
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 154

శనివారం 18-2-2023



చీఫ్ సెలక్టర్ రాజీనామా


బీసీసీఐకి విరుద్ధంగా వ్యవహరించి మూల్యం చెల్లించుకున్న చేతన్ శర్మ - 13లో



యూట్యూబ్ సీఈవోగా నీల్

వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాంకు సీఈవోగా నీల్ మోహన్ నియామకం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్టాక్ మార్కెట్ల'పై సుప్రీం కమిటీ

స్టాక్ మార్కెట్లపై నియంత్రణ చర్యలకు తామే ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్రానికి సుప్రీంకోర్టు తెలిపింది.

వివరాలు 6లో ▸



"రైజినా డైలాగ్"కు ఇరాన్ దూరం

భారత్‌లో మార్చిలో జరిగే "రైజినా డైలాగ్" సదస్సుకు తాము హాజరుకావడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



శివసేన..షిండే వర్గానిదే

శివసేన పేరు, పార్టీ ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికే చెందుతాయని సీఈసీ తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸



450 మందికి గూగుల్ ఉద్వాసన!

450 మంది ఇండియన్స్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉద్యోగులకు టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ సమాచారమిచ్చింది.

వివరాలు 6లో ▸

నాణ్యతలో రాజీవద్దు

గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు'తో పేదల స్వప్నం సాకారం

- ఇళ్ల నిర్మాణాల్లో ఎక్కడా చిన్న లోపానికి కూడా తావివ్వద్దు
- ఎప్పటికప్పుడు ల్యాబ్‌ల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించండి
- మౌలిక సదుపాయాల నిర్వహణలో సచివాలయాలదే కీలక పాత్ర
- నిర్మాణం పూర్తయిన ఇళ్లకు వెంటనే కరెంట్, నీటి కనెక్షన్లు
- ఇసుక పంపిణీ, సామగ్రి రూపేణా రూ.13,780 కోట్ల ఖర్చు
- కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.36,026 కోట్లు
- 71,811.49 ఎకరాల్లో ఇళ్ల స్థలాలకు రూ.56,102.91 కోట్లు
- మొత్తంగా రూ.1,05,908.91 కోట్ల మేర పేదలకు లబ్ధి
- 'టిడ్కో' ఇళ్ల కోసం గత ప్రభుత్వం రూ.8 వేల కోట్లు ఖర్చు
- మనందరి ప్రభుత్వంలో ఏకంగా రూ.20 వేల కోట్ల మేర లబ్ధి



> పేదలందరికీ ఇళ్లు పథకానికి మనందరి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన అనంతరం వాటి నిర్వహణ విషయంలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషించాలి. ఈ మేరకు భవిష్యత్ ప్రణాళిక ఉండాలి. కోర్టు కేసుల కారణంగా పలువురు లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని నిర్ణయించాం. ఈ క్రమంలో భూసేకరణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.
>
> - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సొంత ఇల్లు అనేది పేదల చిరకాల స్వప్నం అని, ఈ క్రమంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో ఏ చిన్న లోపానికి కూడా తావు ఇవ్వద్దని గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. లే అవుట్‌లలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను వినియోగించుకుని ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ, ప్రతి పేద కుటుంబానికి అత్యంత నాణ్యమైన ఇంటిని అందించాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన గృహ నిర్మాణ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణ పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. వర్షాలు పూర్తిగా తగ్గి, వాతావరణం అనుకూలిస్తుండటంతో గత డిసెంబర్ నుంచి ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. నిర్మాణంలో నాణ్యత లోపించకుండా తీసుకున్న చర్యలను వివరించారు. నాణ్యతను పరీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 36 ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు మెటల్ నాణ్యతపై 285 పరీక్షలు..

మిగతా 2వ పేజీలో ▶

మేమింతే..!

ప్రజల ప్రాణాలతో తండ్రీకొడుకుల చెలగాటం

కందుకూరు ఘటన మరవక ముందే మళ్లీ అదే వైఖరి

- అనపర్తిలో ఇరుకు రోడ్డుపై చంద్రబాబు సభ
- పోలీసులు ప్రత్యామ్నాయ ప్రదేశాలు చూపిస్తే తిరస్కరణ
- భద్రత కల్పిస్తామని చెప్పినా ససేమిరా.. అనుమతి లేదన్న పోలీసులపై దౌర్జన్యం
- కార్యకర్తలను రెచ్చగొట్టి బారికేడ్‌ల తోసివేత
- పోలీసు వాహనం అద్దాలు ధ్వంసం చేసిన కార్యకర్తలు
- తోసివేయడంతో పలువురు పోలీసులకు గాయాలు
- ప్రభుత్వంపై, పోలీసులపై బాబు ఇష్టానుసారం వ్యాఖ్యలు



అనపర్తిలో టీడీపీ కార్యకర్తలు పోలీసు వాహనం అద్దాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఇరుకు సందులో సభ నిర్వహించడం ద్వారా మొన్న కందుకూరులో ఎనిమిది మంది మృత్యువాత పడటానికి కారణమైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడులో ఇసుమంతైనా మార్పు రాలేదు. ప్రజలు ఏమైపోతేనేం తనకు మాత్రం పెద్ద ఎత్తున ప్రచారం రావాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. అధికారం కోల్పోయినప్పటి నుంచి చంద్రబాబు ఎక్కడ సభలు నిర్వహించినా జనం రావడం లేదు. చిన్నా చితక లీడర్లను బతిమాలి, బెదిరించడం ద్వారా వెయ్యి మందిని రప్పించాలనుకుంటే తీరా వంద మందిని సమీకరించడం కూడా గగనమైపోతోంది. బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో సభలు నిర్వహిస్తే జనం కనిపించక.. ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో పరువు పోతోంది. దీంతో చిన్నపాటి సందులను ఎంచుకుని సభలు నిర్వహిస్తూ.. డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించడం ద్వారా ఎక్కువ మంది వచ్చినట్లు ప్రచారం చేసుకోవడం

మిగతా 2వ పేజీలో ▶

పోలీసులు సంఘ విద్రోహ శక్తులు

- అధికారంలోకి రాగానే బొక్కలో వేయిస్తా
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మండిపాటు

10లో

న్యూస్‌రీల్

స్టార్టప్స్‌కు సాయం



ఆక్వా పరిశ్రమలో ప్రపంచస్థాయి సాంకేతికతను వినియోగించి మత్స్య ఉత్పత్తిలో తిరుగులేని రాష్ట్రంగా ఏపీ అభివృద్ధి చెందిందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ టెక్ సమ్మిట్-2023 శుక్రవారంతో ముగిసింది.

వివరాలు 2 ▸

నెల్లూరు, సంగం బ్యారేజ్‌లకు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డు



రాష్ట్రంలోని నెల్లూరు, సంగం బ్యారేజీలు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డుకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ప్రాజెక్టులుగా నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను ప్రకటించి సీబీఐపీ-2022 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును మార్చి 3న కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ రాష్ట్ర అధికారులకు ప్రదానం చేయనున్నారు.

వివరాలు 2 ▸

ముగిసిన ఏరో ఇండియా



బెంగళూరులోని యలహంక వైమానిక స్థావరంలో 5 రోజుల పాటు జరిగిన 14వ ఎడిషన్ ఏరో ఇండియా శుక్రవారంతో ముగిసింది. ఈ షోను తిలకించేందుకు చివరి రెండు రోజులు ప్రజలకు అవకాశం కల్పించారు. ఈ రెండు రోజుల్లో 5 లక్షలమందికి పైగా ప్రజలు దీన్ని వీక్షించారు.

వివరాలు 14 ▸

సర్టిఫికెట్ల పరిశీలనకు ఏపీపీఎస్సీ షెడ్యూల్



రాష్ట్రంలో పలు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు ఏపీపీఎస్సీ షెడ్యూల్‌ను ప్రకటించింది. పోస్టుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనను వేర్వేరు తేదీల్లో నిర్వహించనుంది.

వివరాలు 2 ▸

మరింత మందికి ఆక్వా విద్యుత్ సబ్సిడీ

- అసైన్డ్, ప్రభుత్వ, దేవదాయ భూముల్లో పదెకరాల్లోపు రైతులకు వర్తింపు
- నాన్ ఆక్వాజోన్లలో అర్హమైన ఆక్వాజోన్ ప్రాంతాల గుర్తింపు
- రాష్ట్ర కమిటీ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల



సాక్షి, అమరావతి: ఆక్వాజోన్ పరిధిలో పదెకరాల్లోపు ఆక్వా సాగుచేసే రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేస్తున్న ప్రభుత్వం మరింతమందికి లబ్ధిచేకూర్చాలని సంకల్పించింది. జోన్ పరిధిలో అసైన్డ్ భూములతో సహా వివిధరకాల ప్రభుత్వ భూముల్లో సాగుచేస్తున్న వారితోపాటు దేవదాయ భూములను లీజుకు తీసుకుని సాగుచేస్తున్న పదెకరాల్లోపు వారికి విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. వెబ్‌ల్యాండ్‌లో ఈ భూముల హక్కులు ప్రభుత్వ, ఆయా దేవస్థానాల పేరిట నమోదై ఉండడంతో ఆక్వా సబ్సిడీ వర్తింపునకు సాంకేతికంగా ఇబ్బంది నెలకొంది. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం ఆయా భూముల్లో పదెకరాల్లోపు సాగుచేస్తున్న రైతులందరికి సబ్సిడీ వర్తించేలా వెసులుబాటు కల్పించింది. ఈ ఫిష్ సర్వే ప్రకారం 1,72,514 మంది పదెకరాల్లోపు విస్తీర్ణంలో.. మొత్తం 3,14,313 ఎకరాల్లోను, 4,691 మంది పదెకరాలకు పైగా విస్తీర్ణంలో.. మొత్తం 1,17,780 ఎకరాల్లోను ఆక్వా సాగుచేస్తున్నారు. నోటిఫైడ్ ఆక్వాజోన్ పరిధిలో 2,49,348 ఎకరాల్లో 1,00,792 మంది సాగుచేస్తున్నారు. వీరిలో 98,095 మంది పదెకరాల్లోపు విస్తీర్ణంలో.. మొత్తం 1,86,218 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. నాన్ ఆక్వాజోన్ పరిధిలో 74,419 మంది 1,28,095 ఎకరాల్లో సాగుచేస్తుండగా, 76,413 మంది పదెకరాల్లోపు విస్తీర్ణంలో.. మొత్తం 1,82,744 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. జోన్ పరిధిలో పదెకరాల్లోపు సాగుదారులందరికీ



మిగతా 14వ పేజీలో ▶

సైకత 'నీలకంఠుడు'

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలోని శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నీలకంఠుని సైకత శిల్పాన్ని శిల్పి దేవిన శ్రీనివాస్ తీర్చిదిద్దాడు. 'సర్వం శివమయం' అనే అక్షరాలతో క్షీరసాగర మథనంలో వచ్చిన హాలాహలాన్ని శివుడు తాగుతున్నట్టు సైకతం రూపుదిద్దాడు. -రంగంపేట



శివరాత్రికి 3,800 ప్రత్యేక బస్సులు

సాధారణ చార్జీలనే అమలు చేయనున్న ఆర్టీసీ

14లో

అది రోత రాతల వంటకం

- సంక్షేమ హాస్టళ్ల డైట్ చార్జీలపై ఈనాడు విష ప్రచారం
- ఆరేళ్లపాటు వాటిని పెంచాలని కనీసం ఆలోచించని చంద్రబాబు
- 2019 ఎన్నికలకు ఎనిమిది నెలల ముందు మాత్రమే పెంపు
- పైగా.. ఆయన జమానాలో పేరుకుపోయిన రూ.132 కోట్ల డైట్ చార్జీల బకాయిలు
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అవన్నీ చెల్లింపు

3లో

పాతర.. కుంభకోణాలకే!

- మెరుగైన సేవలే లక్ష్యంగా ఫైబర్ నెట్ ప్రక్షాళన
- అధిక స్పీడ్, డేటాతో ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ పలు ప్యాకేజీలు
- కొత్తగా 15,000 కి.మీ ఫైబర్ లైన్ ఏర్పాటు
- 13కిపైగా ప్రాజెక్టులను దక్కించుకున్న సంస్థ
- రూ.51.25 కోట్ల నుంచి రూ.215.63 కోట్లకు పెరిగిన ఆదాయం
- టెరాసాఫ్ట్ ముసుగులో దోపిడీని దాచేందుకు ఎల్లో మీడియా ఆపసోపాలు

14లో

మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు అంబటి, చెల్లుబోయిన. చిత్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు



పోలవరంపై చంద్రబాబుది అంతా

ప్రచార ఆర్భాటమే

సీఎం జగన్ హయాంలోనే పనులు వేగవంతం

- ఆయన పాలనలోనే ప్రాజెక్టు పూర్తి.. రెండు కాఫర్ డ్యామ్‌లు, స్పిల్‌వే పనులు కూడా..
- ఇక ఏ వరద వచ్చినా, వర్షాలు పడినా ప్రాజెక్టు పనులు ఆగవు
- నిర్వాసితుల పునరావాసంపై ప్రత్యేక దృష్టి: మంత్రి అంబటి రాంబాబు

10లో

ఇదండీ సంగతి



మీకు సరిగ్గా సరిపోయే ఫోన్ తప్పకుండా తీసుకోవాలి సార్!

కేసీఆర్‌కు సీఎం జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి,అమరావతి: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ఏపీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ట్వీట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీపై ఎల్లప్పుడూ భగవంతుని దీవెనలు ఉండాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో చిరకాలం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

'అమృత్ సరోవర్' చెరువుల్లో నీటి నాణ్యత పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచన

సాక్షి, అమరావతి: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'అమృత్ సరోవర్' పథకంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో అభివృద్ధి చేస్తున్న చెరువుల్లో నీటికి వర్షాకాలం ముందు, తర్వాత తప్పనిసరిగా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రాష్ట్రంలో 26 జిల్లాల పరిధిలో ఇప్పటికే 901 అమృత్ సరోవర్ చెరువుల నిర్మాణం పూర్తవగా, మరో 1,219 చెరువుల నిర్మాణ పనులు సాగుతున్నట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు. ఆయా చెరువుల్లో నిల్వ అయ్యే నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఆదేశాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 13 నామినేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 14 ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలకు ఇప్పటి వరకు 13 మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. స్థానిక సంస్థల నుంచి తొమ్మిది, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు రెండు రోజులుగా నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు గురువారం ఐదుగురు, శుక్రవారం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ప్రకటించారు. తొమ్మిది స్థానిక సంస్థల కోటా స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

రీ సర్వేతో భూ వివాదాలకు పరిష్కారం

- కేంద్ర ల్యాండ్ రెగ్యులేషన్స్ డైరెక్టర్ పూల్ చంద్రప్రసాద్
- సర్వే తీరు ప్రశంసనీయం
- కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో క్షేత్రస్థాయి పరిశీలన



సాక్షి, అమరావతి/గుడ్లవల్లేరు: రాష్ట్రంలో భూముల రీ సర్వే బాగా జరుగుతోందని, ఇతర ప్రాంతాలకు ఆదర్శనీయంగా నిలుస్తున్నదని కేంద్ర ల్యాండ్ రీసోర్సెస్ (ల్యాండ్ రెగ్యులేషన్ డివిజన్) శాఖ డైరెక్టర్ పూల్ చంద్ర ప్రసాద్ ప్రశంసించారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేముగుంట గ్రామంలో ల్యాండ్ రీసోర్సెస్ డిప్యూటీ డైరెక్టర్ సుశాంత్, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్‌తో కలిసి రీ సర్వే జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రీ సర్వేతో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో ఎక్కడా జరగని విధంగా ఏపీలో రీ సర్వే జరుగుతుందని అభినందించారు. రీ సర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత భూ హక్కు పత్రంలో కేటాయించిన యునిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ భూ యజమానులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తుందన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలు సులభంగా, పారదర్శకంగా అందుతాయన్నారు. నకిలీలకు ఆస్కారం ఉండదని చెప్పారు. బ్యాంకర్లు కూడా స్పష్టత ఏర్పడి నిజమైన రైతులకు వ్యవసాయ రుణాలు అందించడం సాధ్యమవుతుందని చెప్పారు. సర్వే సెటిల్మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఎన్నో సమస్యలకు రీ సర్వే సమాధానాలు చూపుతున్నదన్నారు. తొలుత పూల్ చంద్ర ప్రసాద్ రీ సర్వేలో భాగంగా వేముగంట గ్రామంలో జరిగిన స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. రైతులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయాన్ని సందర్శించి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత, గుడివాడ ఆర్డీవో పద్మావతి, సర్వే ఏడీ గోపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యా వ్యవస్థ భేష్

జెనీవాలో 'ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్' కార్యక్రమంలో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు ఇగ్నా జియో క్యాసిస్ ప్రశంసలు

- కరోనాతో చాలా దేశాల విద్యా వ్యవస్థలకు పెను సవాళ్లు
- ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా అద్భుత ప్రగతి
- అందుకు సీఎం వైఎస్ జగన్ విధానాలే దోహదం
- నాడు–నేడు, డిజిటల్ బోధనతో మంచి ఫలితాలు
- భవిష్యత్‌లో ఏపీ విద్యార్థులు అంతర్జాతీయంగా రాణింపు



స్విట్జర్లాండ్ అధ్యక్షుడు ఇగ్నా జియో క్యాసిస్

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయని, ప్రత్యేకించి విద్యా వ్యవస్థ అద్భుతమని స్విట్జర్లాండ్ దేశాధ్యక్షుడు ఇగ్నా జియో క్యాసిస్ కొనియాడారు. జెనీవా నగరంలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో విద్యా వ్యవస్థ పెద్ద సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. అయితే ఇండియాలోని ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. ఆ రాష్ట్రంలో పేద విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు మంచి ఫలితాలిస్తున్నాయని కొనియాడారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చేశారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఉన్నాయన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వమే సమకూర్చుతోందని, ఇది గర్వించదగ్గ విషయం అని అన్నారు. కొంత కాలం తర్వాత ఏపీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభావంతులుగా నిలుస్తారని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ అందరి వల్లా కాదని, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి ఉన్న వారికే సాధ్యమవుతుందని చెప్పారు.

ఆకట్టుకున్న ఏపీ స్టాల్

ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పథకాల స్టాల్ పలువురిని ఆకట్టుకుంది. స్వయంగా దేశాధ్యక్షుడే ఏపీ విద్యా విధానాలపై ప్రశంసలు వ్యక్తం చేయడంతో స్విట్జర్లాండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జనరల్ పాట్రిసియా దన్జీ స్టాల్‌ను సందర్శించారు. ప్రభుత్వ పథకాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఏపీలో ఎడ్యుకేషన్ కోసం నాడు–నేడులో తీసుకున్న నిర్ణయాలు, అమలవుతున్న తీరు, విద్యా ప్రమాణాలు మెరుగుదల.. తదితర విషయాలపై ఆయన ఏపీ ప్రభుత్వాన్ని అభినందించారు. డిజిటల్ లెర్నింగ్, క్వాలిటీ ఎడ్యుకేషన్‌లో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీ, పాఠశాలల ఆధునికీకరణ, డిజిటల్ బోర్డుల ఏర్పాటు,



స్విట్జర్లాండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జనరల్ పాట్రిసియా దన్జీ

ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధన తదితర కార్యక్రమాలన్నీ పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని కొనియాడారు. ఇలాంటి సౌకర్యాలు కల్పించడంతో సమాజంలో అన్ని వర్గాల వారు విద్యనభ్యసిస్తారని చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లో న్యూట్రిషన్ ఫుడ్ అందించడం మంచి పరిణామం అన్నారు. లైబ్రరీ, ప్లేగ్రౌండ్స్, హైజెనిక్ బాత్రూమ్స్ అండ్ టాయిలెట్స్, యూనిఫాం, స్టేషనరీ కిట్స్, బుక్స్ అందిస్తున్న విధానం చాలా బాగుందన్నారు. 'ఈక్విటబుల్ ఎడ్యుకేషన్ యాక్సెస్ టు ఆల్' విధానం చాలా నచ్చిందన్నారు. ఏపీ స్టాల్‌ను ఇంటర్నేషనల్ యూనిసెఫ్ ప్రోగ్రామ్స్ స్పెషలిస్ట్ అతెనా లౌబాచెర్ సందర్శించారు. గరల్స్ ఎడ్యుకేషన్ విధానంతో అసమానతలను రూపుమాపవచ్చని అభినందించారు. డిజిటల్ ఎడ్యుకేషన్లో భాగంగా బైజూస్ ద్వారా అందిస్తున్న విద్యా విధానం నూతన పద్ధతుల్లో గొప్పగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇండియా నుండి ఐక్యరాజ్య సమితి శాశ్వత సభ్యుడు వృస్నవ షకిన్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షకు సర్వంసిద్ధం

- పోలీసు నియామక మండలి ఏర్పాట్లు
- అభ్యర్థులకు సూచనలు జారీ

సాక్షి, అమరావతి: ఎస్‌ఐ పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు నియామక మండలి పూర్తి ఏర్పాట్లు చేసింది. సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో మొత్తం 411 ఎస్‌ఐ పోస్టులను భర్తీ చేయనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రిలిమినరీ పరీక్షను ఈ నెల 19న ఆదివారం నిర్వహించనున్నారు. ప్రిలిమినరీ పరీక్షలో పేపర్–1ను ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు, పేపర్–2ను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. కాగా పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 291 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1.71 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఈ నేపథ్యంలో రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పోలీసు నియామక మండలి సూచనలు జారీ చేసింది.

అభ్యర్థులకు సూచనలు..

■ పరీక్ష రోజు గాబరా పడకుండా ఒక రోజు ముందుగానే తమ పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో చూసుకోవాలి. ■ పేపర్–1కు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి, పేపర్–2కు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు. ■ హాల్‌టికెట్‌తో పాటు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలి. ■ గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డు, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు, రేషన్ కార్డుల్లో ఏదైనా తీసుకురావాలి. ■ మొబైల్ ఫోన్, టాబ్లెట్/ల్యాప్‌టాప్, పెన్ డ్రైవ్, బ్లూటూత్ పరికరాలు, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్, లాగ్ టేబుల్, వాలెట్, పర్సు, నోట్స్, చార్టులు వంటివాటితో పాటు ఎలాంటి కాగితాలు, రికార్డింగ్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. వాటిని భద్రపరిచేందుకు పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి ఏర్పాట్లూ చేయడం లేదు.

నాణ్యతలో రాజీవద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సిమెంటుపై 34, స్టీలుపై 84, ఇటుకలపై 95 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయిన 15 రోజుల్లోగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నట్టు ట్రాన్స్‌కో అధికారులు వివరించారు. కోర్టు కేసుల కారణంగా ప్రకాశం, అనంతపురం జిల్లాల్లోని రెండు లేఅవుట్లకు బదులుగా ప్రత్యామ్నాయ భూములను ఎంపిక చేశామన్నారు. సుమారు 30 వేల మందికి త్వరలోనే పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణం కోసం జనవరి ఆఖరు నాటికి రూ.7,630 కోట్లు ఖర్చు చేశామన్నారు. మొత్తంగా ఈ పథకం మొదలు పెట్టినప్పటి నుంచి రూ.13,780 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 2.75 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, మరో 74 వేల ఇళ్లకు శ్లాబ్ వేసే పనులు కొనసాగుతున్నాయని, ఇంకో 79 వేల ఇళ్లు రూఫ్ లెవెల్లో ఉన్నాయన్నారు. మార్చి నాటికి సుమారు 5 లక్షల ఇళ్లు పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్న కొద్దీ మౌలిక సదుపాయాలను ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు కరెంట్, నీటి కనెక్షన్‌లు వెంటనే ఇవ్వాలని, క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది.. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఏ ప్రభుత్వం చేయని విధంగా సాయం

➡ పేదల సొంతింటి కలను సాకారం చేయడం కోసం చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మనం చర్యలు తీసుకున్నాం. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన ఖర్చును ఓసారి పరిశీలిస్తే.. ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక పంపిణీ, తక్కువ ఖరీదుకే సామగ్రిని అందించడం రూపంలో ప్రభుత్వం రూ.13,780 కోట్లు ఖర్చు చేసింది.

➡ ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టడానికి కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.3,117 కోట్లు ఖర్చు చేశాం. వైఎస్సార్, జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రహదారులు తదితర సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు వెచ్చిస్తున్నాం. అంటే కేవలం జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసమే రూ.36,026 కోట్ల మేర ఖర్చు చేస్తున్నాం.

➡ పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాల పంపిణీ కోసం రూ.17,132.78 కోట్ల విలువ చేసే 28,554.64 ఎకరాల ప్రభుత్వ భూములు తీసుకున్నాం. రూ.15,364.5 కోట్ల విలువ చేసే 25,374.66 ఎకరాల భూములను కొనుగోలు చేశాం. విశాఖలో పేదలకు పంపిణీ చేసిన భూముల విలువ రూ.12,405 కోట్లు. ఇళ్ల పట్టాల కోసం ఇచ్చిన ఇతర భూములు 13,425.14 ఎకరాలు. వీటి విలువ రూ.11,200.62 కోట్లు. ఇలా మొత్తంగా అన్ని రకాలుగా ఇళ్ల పట్టాల కోసం పేదలకు పంచిన భూములు 71,811.49 ఎకరాలు కాగా, వీటి విలువ రూ.56,102.91 కోట్లు. ఇలా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కోసం మన ప్రభుత్వం రూ.1,05,908.91 కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూరుస్తోంది.



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గణనీయమైన సహాయం

➡ మరోవైపు టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మన ప్రభుత్వం గణనీయమైన సహాయం చేస్తోంది. గత మూడున్నరేళ్లలో ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, 300 చదరపు అడుగుల ఇళ్లు ఉచితంగా అందించడం, మిగిలిన కేటగిరీల లబ్ధిదారులకు తమవంతుగా చెల్లించిన వాటిపై సబ్సిడీ ఇవ్వడంతో పాటు, ఉచితంగా రిజిస్ట్రేషన్‌ల రూపంలో అండగా నిలిచాం.

➡ టిడ్కో ఇళ్ల కోసం గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన ఖర్చు రూ.8,015 కోట్లు. మన ప్రభుత్వం చేసిన ఖర్చు, పేదలకు కల్పించిన ప్రయోజనాల విలువ చూస్తే మొత్తంగా రూ.20,755 కోట్లు. టిడ్కో ఇళ్ల నిర్మాణ ఖర్చు, మౌలిక సదుపాయాల కోసం ఈ మూడున్నరేళ్లలో రూ.8,734 కోట్లు ఖర్చు పెట్టాం. దీంతో పాటు 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా ఇవ్వడం ద్వారా దాదాపు రూ.10,339 కోట్ల లబ్ధి చేకూర్చాం. 300 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు తమ వంతుగా చెల్లించాల్సిన మొత్తాన్ని పూర్తిగా మాఫీ చేసి వారికి ఎంతో ఉపశమనం కలిగించాం.

➡ మిగిలిన వారికీ ఊరట కల్పించే చర్యల్లో భాగంగా 365, 430 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు తమ వంతుగా చెల్లించాల్సిన డబ్బులో కల్పించిన సబ్సిడీ కారణంగా రూ.482 కోట్ల మేర మేలు చేకూర్చాం. రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా తొలగించి ఉచితంగా ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయించడం ద్వారా మరో రూ.1,200 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. సమీక్షలో గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖ మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేష్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, సీఎస్ డాక్టర్ జవహర్ రెడ్డి, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక, ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదిన్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషా, జేఎండీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేమింతే..!



ఇరుకు రోడ్డులో సభ నిర్వహిస్తున్న చంద్రబాబు

▶ మొదటి పేజీ తరువాయి

పరిపాటిగా మారింది. ఈ క్రమంలో తోపులాటలు చోటుచేసుకుని జనం ప్రాణాలమీదకు వస్తోంది. అయితే ఇవేమీ పట్టనట్లు ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు.. ఇటీవల పాదయాత్ర మొదలు పెట్టిన చంద్రబాబు తనయుడు లోకేశ్ కూడా ఇదే బాట ఎంచుకున్నారు. తొలుత ఒకటి.. రెండు చోట్ల బహిరంగ ప్రదేశాల్లో సభలు నిర్వహించినప్పుడు జనం లేక వెలవెలబోవడంతో తండ్రిబాటలోనే పయనిస్తున్నారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఇరుకు సందుల్లో సభలొద్దని జీవో–1ను జారీ చేసిన ప్రభుత్వంపై, పోలీసులపై నోరు పారేసుకుంటూ.. సీఎం జగన్‌ను ఇష్టానుసారం తిడుతూ తండ్రీకొడుకులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు తాజాగా శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో 'ఈ రాష్ట్రానికి ఇదేం కర్మ' పేరుతో నిర్వహించతలపెట్టిన సభను బహిరంగ ప్రదేశంలో పెట్టుకోవాలని చెప్పిన పోలీసులపై దౌర్జన్యానికి దిగారు.

పోలీసులపై దౌర్జన్యం

'అనపర్తిలో ప్రతిపక్ష నాయకుడు ఎన్.చంద్రబాబునాయుడు బహిరంగ సభ కోసం అనుమతికావాలని ఆ పార్టీ నేతలు కోరారు. పోలీస్‌యాక్ట్, జీవో నంబర్–1ను అనుసరించి రోడ్డుపై సభకు అనుమతి ఇవ్వలేమని చెప్పాం. వారి సభ నిర్వహణకు అనుకూలంగా ఉండేలా కళాక్షేత్రంతో పాటు, ఒక లే అవుట్‌ను సూచించాం. అక్కడ పూర్తి భద్రత కల్పిస్తామని చెప్పాం. అయినా వారు మా మాట వినిపించుకోకుండా రోడ్డుపై సభ పెట్టారు. ఇటు పోలీసులు, అటు ప్రజలకు ఇబ్బంది కలిగించారు' అని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీన్నిబట్టి ఉద్దేశ పూర్వకంగానే చంద్రబాబు అలజడి సృష్టించాలని, ఘర్షణ ధోరణి అవలంబించడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలనే వ్యూహంతో ఉన్నారని స్పష్టమవుతోంది.

పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట నుంచి వేట్లపాలెం కెనాల్ రోడ్డు మీదుగా రోడ్‌షోతో చంద్రబాబు అనపర్తి వైపు బయలుదేరారు. పోలీసులు వాహనాలను నిలుపుదల చేసే ప్రయత్నం చేయగా.. చంద్రబాబు, టీడీపీ నాయకులను ఉసిగొల్పారు. వారు పోలీసులతో వాగ్వాదానికి దిగి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఒక్కసారిగా రెచ్చిపోయి దౌర్జన్యంగా పోలీసులను తోసేశారు. దీంతో పలువురు పోలీసులు కిందపడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. బారికేడ్లను ఎత్తి పడేశారు. దీంతో పోలీసులు నేలపై కూర్చుని బతిమిలాడారు. అయినా చంద్రబాబు వినిపించుకోకుండా పార్టీ నేతలు, పార్టీ శ్రేణులతో కలిసి వాహనాలతో ముందుకు కదిలారు. లక్ష్మీనరసాపురంలో పోలీసు వాహనాన్ని అడ్డుపెట్టారు. కారులో ఉన్న చంద్రబాబు కిందకు దిగి.. అక్కడే ఉన్న మీడియా వాహనాన్ని ముందుకు పిలిపించి ఆ వాహనం పైకి ఎక్కి మాట్లాడారు. మాకు అనుమతి ఉంది, మమ్మల్ని ఎవరు ఆపుతారో చూస్తామని రెచ్చగొట్టడంతో పార్టీ కార్యకర్తలు పోలీసు వాహనంపై రాళ్లతో దాడి చేశారు. అద్దాలు పగులగొట్టి ధ్వంసం చేశారు. ఆ తర్వాత చంద్రబాబు అనపర్తి దేవీచౌక్ సెంటర్‌కు చేరుకుని సభ ఏర్పాటు చేసి ప్రసంగించారు.

స్టార్టప్స్‌కు సాయం

- స్టార్టప్‌ల ఫండింగ్‌కు ముందుకొచ్చిన సంస్థలు
- విశాఖలో ముగిసిన రెండు రోజుల గ్లోబల్ టెక్ సమ్మిట్
- సాంకేతిక వినియోగంలో మొదటి స్థానంలో ఏపీ: మంత్రి సీదిరి అప్పలరాజు
- ఆక్వాకల్చర్ నాలెడ్జ్ షేరింగ్‌పై యూరోపియన్ బయోటెక్నాలజీ, రాష్ట్ర ప్రభుత్వం, పల్సస్ గ్రూప్ ఎంవోయూ

సాక్షి, విశాఖపట్నం: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకునేందుకు, ఆయా దేశాలు పరస్పరం సహకరించుకునేందుకు అడుగులు వేస్తున్నట్లు వివిధ దేశాల ప్రతినిధులు ఉద్ఘాటించారు. రాష్ట్రంలో స్టార్టప్స్ సంస్థలకు ఫండింగ్ అందించేందుకు సహాయమందిస్తామన్నారు. జీ–20 సన్నాహక సదస్సులో భాగంగా విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ టెక్ సమ్మిట్–2023 శుక్రవారం ముగిసింది. సాంకేతిక వినియోగం ద్వారా డెయిరీ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ముగింపు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. దేశంలోనే టెక్నాలజీ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. ఆక్వా పరిశ్రమలో ప్రపంచ స్థాయి సాంకేతికతను వినియోగించి మత్స్య ఉత్పత్తిలో తిరుగులేని రాష్ట్రంగా ఏపీ అభివృద్ధి చెందిందని వెల్లడించారు. ఆక్వా రంగంలో ఏపీ ప్రపంచ దేశాలకు హబ్‌గా మారిందన్నారు. అమెరికా, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాలకు రొయ్య పిల్లలు ఎగుమతులు చేస్తూ రికార్డు సృష్టిస్తున్నామని వివరించారు. డెయిరీ రంగంలోనూ డిజిటలైజేషన్ ప్రవేశపెట్టడంతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖలో ఈ తరహా సదస్సులు నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతనంగా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చేవారికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

20 స్టార్టప్‌లకు ఫండింగ్ భరోసా

కాగా గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి 100 స్టార్టప్ సంస్థల విశేషాలను ప్రదర్శించారు. ఇందులో 20 స్టార్టప్‌లకు నిధులు అందించేందుకు విదేశీ వ్యాపార, వాణిజ్య సంస్థలు ముందుకొచ్చాయి. ఇండియన్ ఏంజిల్ నెట్‌వర్క్, న్యూయార్క్ ఈక్విటీ ఫోరమ్, హైదరాబాద్ ఏంజిల్స్, యూఎస్‌ఏకి చెందిన ఫినాకిల్ సాఫ్ట్ ఐటీ సర్వీసెస్.. స్టార్టప్‌ల అభివృద్ధి, వాటి వ్యాపార విస్తరణకు చేయూతనందిస్తామని ప్రకటించాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్, ఫిన్‌టెక్ తదితర రంగాలకు చెందిన స్టార్టప్‌లకు టెక్ సమ్మిట్‌లో అవకాశాలు దక్కాయి. ఇందులో ఎక్కువగా ఏపీకి చెందిన స్టార్టప్ సంస్థలు ఉండటం విశేషం. కాగా ఆక్వాకల్చర్‌లో నాణ్యమైన ఉత్పత్తులు, ఎగుమతులు సాధించేందుకు అవసరమైన సాంకేతికతని అందిపుచ్చుకునేలా యూరోపియన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ (ఈబీటీసీ) పరిధిలోని యూరోపియన్ బయోటెక్నాలజీ, రాష్ట్ర ప్రభుత్వం, పల్సస్ గ్రూప్ మధ్య నాలెడ్జ్ షేరింగ్‌పై అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. విశాఖ నగరంలోని పల్సస్ భవనంలో ఆక్వా నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

సరికొత్త ప్లాట్‌ఫామ్‌గా మారింది..



స్టార్టప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఒక సరికొత్త ప్లాట్‌ఫామ్‌గా ఇది నిలిచింది. నూతన ఆవిష్కరణలు, పరస్పర సహకారం, పరిశ్రమల వృద్ధి వేగవంతం వంటి అంశాలపై ఈ సదస్సును నిర్వహించాం.

– గేదెల శ్రీనుబాబు, సీఈవో, పల్సస్ గ్రూప్


పబ్లిక్ ఫండింగ్ ద్వారా కొత్త ఔషధాల అభివృద్ధి



శస్త్రచికిత్సలు, ఔషధాల కొనుగోలు చాలా ఖరీదుగా మారిపోయింది. ముఖ్యంగా ఆరోగ్య బీమా లేని నిరుపేద ప్రజలు వైద్యసేవలకు దూరమవుతున్నారు. ఈ ఇబ్బందులు తొలగించాలంటే జనరిక్ ఔషధాల అభివృద్ధికి మద్దతు ఇవ్వాలి. పబ్లిక్ ఫండింగ్ ద్వారా కొత్త ఔషధాలను అభివృద్ధి చేస్తే వైద్య ఖర్చులను తగ్గించొచ్చు.

– డా.టీవీ నారాయణ, అధ్యక్షుడు, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్

కంపెనీ సేవలను విస్తరించే చాన్స్



ఈ సమ్మిట్‌కు హాజరుతో మా కంపెనీ సేవలను విస్తరించే అవకాశం లభించింది. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన మా కంపెనీ ఇప్పుడు పలు ప్రపంచ సంస్థలకు తెలిసింది. ఈ సదస్సుకు హాజరుకావడం వల్ల అనేక సంస్థలను సంప్రదించే వీలు కలిగింది.

– శృతి సాహిణి, డిజివాక్ మీడియా

నెల్లూరు, సంగం బ్యారేజ్‌లకు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డు

- 3న ఢిల్లీలో అవార్డును ప్రదానం చేయనున్న కేంద్ర మంత్రి ఆర్కే సింగ్
- పెన్నా డెల్టా ఆధునికీకరణలో భాగంగా సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను చేపట్టిన వైఎస్సార్
- సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక యుద్ధప్రాతిపదికన ఆ రెండు బ్యారేజ్‌లు పూర్తి





నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నెల్లూరు, సంగం బ్యారేజీలు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డుకు ఎంపికయ్యాయి. పెన్నా డెల్టా ఆధునికీకరణలో భాగంగా నెల్లూరు (0.4 టీఎంసీలు), సంగం బ్యారేజ్ (0.45 టీఎంసీలు)లను వైఎస్ జగన్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వృథాకు అడ్డుకట్ట వేసింది. 4.22 లక్షల ఎకరాలకు సమర్థంగా నీటిని అందిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) ప్రశంసించింది. అత్యుత్తమ ప్రాజెక్టులుగా నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను ప్రకటించి సీబీఐపీ–2022 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును మార్చి 3న సీబీఐపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ రాష్ట్ర అధికారులకు ప్రదానం చేయనున్నారు. సీబీఐపీ.. దేశంలో నీటివనరులు, విద్యుత్, సంప్రదాయేతర ఇంధన వనరుల విభాగంలో అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తోంది.

కరోనాను, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా పెన్నా డెల్టా ఆధునికీకరణ పనులను చేపట్టారు. నెల్లూరు, సంగం బ్యారేజ్‌ల నిర్మాణ పనులను చేపట్టారు. ఆయన హఠాన్మరణంతో ఆ బ్యారేజ్‌ల పనులకు గ్రహణం పట్టుకుంది. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ సర్కార్ వీటిని పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. కరోనా వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ.. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను 2022, ఆగస్టు 31 నాటికి పూర్తి చేశారు. సెప్టెంబర్ 6న ఆయన వాటిని జాతికి అంకితం చేశారు.

సీఎం జగన్ దార్శనికతకు పట్టం

నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను చిత్తశుద్ధితో యుద్ధప్రాతిపదికన సీఎం వైఎస్ జగన్ పూర్తి చేశారు. బ్యారేజ్‌లతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సీఎం జగన్ దార్శనికతకు పట్టం కడుతూ సీబీఐపీ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించింది.

– శశిభూషణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ

సర్టిఫికెట్ల పరిశీలనకు ఏపీపీఎస్సీ షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు ఏపీపీఎస్సీ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పోస్టుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు వేర్వేరు తేదీలను ప్రకటించారు.

వివిధ పోస్టులకు ఎంపికైనవారి సర్టిఫికెట్ల పరిశీలనకు ఏపీపీఎస్సీ ప్రకటించిన తేదీలు ఇలా..

విభాగం	పోస్టు	తేదీ
ఏపీ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్	గ్రేడ్–1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్	ఫిబ్రవరి 28
హార్టికల్చర్ విభాగం	హార్టికల్చర్ ఆఫీసర్	ఫిబ్రవరి 28
ఏపీ వర్క్స్ అకౌంట్స్ సర్వీస్	డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ గ్రేడ్–2	ఫిబ్రవరి 28
ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ విభాగం	అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్	మార్చి 1
ఏపీ లెజిస్లేచర్ సర్వీస్	తెలుగు రిపోర్టర్	మార్చి 6
ఏపీ ఇన్ఫర్మేషన్ సబార్డినేట్ సర్వీస్	అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్	మార్చి 7

లైంగిక దాడి దోషులను కఠినంగా శిక్షించాలి

ఎస్పీకి రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశం


వాసిరెడ్డి పద్మ


కర్రి జయశ్రీ రెడ్డి

సాక్షి,అమరావతి/అమలాపురం టౌన్/కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్ర యానాంలో బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఐదుగురు యువకులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆదేశించారు. ఆమె శుక్రవారం జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయించాలని చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జయశ్రీ రెడ్డి కూడా ఎస్పీతో మాట్లాడి కేసు వివరాలు తెలుసుకుని బాధిత బాలికకు సరైన వైద్యం, ఇతర సహకారం అందించాలని సూచించారు. మరోవైపు ఈ ఘటనపై ఫిర్యాదు రాగానే డీఎస్పీ వై.మాధవరెడ్డి, ముమ్మిడివరం సీఐ జానికీరామ్ ఇతర అధికారులు బాధిత బాలిక ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద చిర్ర యానాం సర్పంచ్ కుమారుడు ఓలేటి తేజ, ఓలేటి తులసీరావు, మల్లాడి వంశీ, అర్ధాని వీరబాబు, ఓలేటి ధర్మరాజుపై కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.

కడప ఆర్జేడీపై దాడి దుర్మార్గం

వైఎస్సార్‌టీఎఫ్ సహా పలు సంఘాల ఖండన

సాక్షి, అమరావతి/పులివెందుల టౌన్ : పాఠశాల విద్యా శాఖ కడప ఆర్జేడీ బి.ప్రతాప్‌రెడ్డిపై కొందరు దుండగులు, కొన్ని పార్టీల వ్యక్తులు దాడిచేయడం దుర్మార్గపు చర్యని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఖండించింది. ఈ మేరకు సంఘం నేత కె.జాలిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిరాధార ఆరోపణలతో భౌతిక దాడులకి దిగడం సమంజసం కాదని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి పేర్కొన్నారు. ఆర్జేడీగా సమీక్ష చేసే అధికారం ఆయనకు ఉంటుందని, అది వద్దని చెప్పడం ప్రభుత్వ వ్యతిరేక చర్య అని పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరిప్రసాద్‌రెడ్డి, మల్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశరావు, జాతీయ లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు బెల్లయ్య నాయక్ తదితరులు దాడిని ఖండించారు. కాగా, 'నా తప్పు ఏదైనా ఉంటే ఏ చర్యలకైనా సిద్ధం' అని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. పులివెందులలో మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా హెచ్ఎంల సమావేశం, నైట్ విజన్ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. దీనికి రాజకీయ రంగు పులమడం నీచమన్నారు.

అది రోత రాతల వంటకం

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వంపై పనిగట్టుకుని ఈనాడు వండి వారుస్తున్న అసత్య కథనాలు రోజురోజుకూ శృతిమించుతున్నాయి. తాజాగా.. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థల డైట్ చార్జీలపై ఆ పత్రిక వండిన రాతల వంటకం రోత పుట్టించేలా ఉంది. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా భావించే ఆ క్షుద్ర పత్రిక 'మాటల వంటకమే' అంటూ అవాస్తవాలతో ఒక కథనాన్ని అచ్చేసింది. నిజానికి.. ఆ వసతి గృహాలపై చంద్రబాబు సవతి ప్రేమ గత పరిస్థితిని గమనించిన వారెవరికైనా ఇట్టే అర్థమవుతుంది. పైగా బోలెడు బకాయిలు తన హయాంలో చెల్లించలేదు. నిజానికి.. ఈ డైట్ ఛార్జీలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ఇవి ఆమోదించే దశలో ఉండగా ఈనాడు ఈ వాస్తవాలన్నింటినీ మరుగునపరిచి ఉద్దేశపూర్వకంగా, ఎప్పటిలాగే తన కడుపుమంటను తీర్చుకుంది. దీనిని ఖండిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుడు కె. హర్షవర్ధన్ శుక్రవారం వాస్తవాలు వెల్లడించారు. అవి ఏమిటంటే..

- 2012లో ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్లకు డైట్ ఛార్జీలు పెంచారు.
- 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు 2018 వరకు వాటిని పెంచాలనే ఆలోచన చేయలేదు.
- కానీ, 2019లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2018 జూలై నుంచి పెంచింది. అంటే.. ఈ చార్జీలు పెంచింది కేవలం ఎనిమిది నెలలు మాత్రమే. పైగా ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను విడుదల చేయలేదు. ఫలితంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. బాబు మిగిల్చిన బకాయిల మొత్తం రూ.132 కోట్లను క్లియర్ చేసింది.
- ఆ తర్వాత డైట్ ఛార్జీలు పెంచేలా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని 2022 ఆగస్టులో సీఎం జగన్ అధికారులను ఆదేశించగా వారు పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించారు.
- దీని ద్వారా 5.92 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. అలాగే, డైట్ ఛార్జీల కోసం రూ.755 కోట్లు బడ్జెట్ కేటాయించారు. తాజా పెంపు ప్రతిపాదనలతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం రూ.110 కోట్లకు పైగానే ఉంటుంది. ఆర్థికపరమైన భారంతో కూడుకున్న ఈ అంశంపై ఆయా విభాగాల వివరణాత్మక పరిశీలన, సంప్రదింపులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆ ఫైలు ఆమోదించే దశలో ఉంది.
- ఇవేకాక.. నాడు–నేడు కింద రాష్ట్రంలో వివిధ రకాల 3,013 సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థలను మూడు దశల్లో రూ.3,300 కోట్ల అంచనాతో అభివృద్ధి చేసేందుకు చేసిన ప్రతిపాదనలు ఆమోదానికి సిద్ధంగా ఉన్నాయి.
- ఇందులో ప్రధానంగా టాయిలెట్లలో నీటి సరఫరా, విద్యుదీకరణ, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఎల్ఈడీ లైట్లు, మంచినీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్, పెయింటింగ్, మరమ్మతులు, వంటగది ఆధునీకరణ, ప్రహరీ గోడలు, దోమల మ్యాట్‌లు, స్మార్ట్ టీవీ, క్రీడా సామగ్రి, లైబ్రరీ పుస్తకాలు, డ్రైనేజీ వ్యర్థ జలాలను సురక్షితంగా పారవేయడంతో పాటు పరిసరాల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.
- ఈ సమయంలో డైట్ ఛార్జీల పెంపుదల ఫైల్ క్లియరెన్స్ అవకాశం ఉందనే విషయాన్ని మరుగున పరిచి ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించడం సరికాదు. బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని కించపరిచే ఉద్దేశ్యంతో బురదజల్లే రాతలు రాయడం దుర్మార్గం.

రాష్ట్ర విద్యార్థులకు లక్కీ చాన్స్.. పెద్ద ఉద్యోగం పక్కా!

- బిట్స్ పిలానీలో ఎంటెక్.. ఆపై ఉద్యోగం
- దరఖాస్తుకు నేడు తుది గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం, ప్రముఖ ఐటీ సంస్థ.. విప్రో కంపెనీ అందించే వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు నేడు (శనివారం) గడువు ముగియనుంది. ఈ ప్రోగ్రామ్ కింద అర్హులైన విద్యార్థులు బిట్స్ పిలానీలో ఎంటెక్ కోర్సులో చేరొచ్చు. ఫుల్‌టైమ్ జాబ్, ఫుల్ స్పాన్సర్‌షిప్ కల్పిస్తారు. కోర్సు పూర్తి చేసినవారికి కనీసం రూ.5 లక్షల వార్షిక ప్యాకేజీతో విప్రోలో ఉద్యోగం ఇస్తారు. ఈ కోర్సుకు 60 శాతం మార్కులు లేదా 6 సీజీపీఏతో కంప్యూటర్ సైన్స్, ఐటీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో బీసీఏ/బీఎస్సీ పూర్తి చేసినవారు అర్హులు. మూడేళ్లలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. 2021, 2022, 2023 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద విప్రో 8 వేల మందిని ఎంపిక చేయనుంది. వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌కు ఎంపికై ఎంటెక్ చేసే సమయంలో ప్రతి నెలా స్టైపెండ్ కింద మొదటి ఏడాది నెలకు రూ.15,488 చొప్పున అందిస్తారు. రెండో ఏడాది నెలకు రూ.17,553 చొప్పున, మూడో ఏడాది నెలకు రూ.19,618 చొప్పున ఇస్తారు. నాలుగో ఏడాది నెలకు రూ.23 వేలు చొప్పున చెల్లిస్తారు. కోర్సు పూర్తైన వెంటనే విప్రోలోనే ఉద్యోగం ఇస్తారు. శిక్షణ కాలం 60 నెలలు ఉంటుంది. ఆసక్తి గల విద్యార్థులు https://bit. ly// APSCHE& WIPRO ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌కు కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల విద్యార్థులకు ఫిబ్రవరి 23న గుంటూరులో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఉత్తరాంధ్ర విద్యార్థులకు విశాఖలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తారు. రాయలసీమ విద్యార్థులకు 28న తిరుపతిలో ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

పెట్టుబడులకు ఆహ్వానం



వేదికపై మంత్రులు, అధికారులు, ప్రతినిధులు

- తమిళనాడు పారిశ్రామికవేత్తలతో మంత్రి బుగ్గన సమావేశం
- మా ప్రభుత్వం ఎంత ప్రోత్సహిస్తోందో పారిశ్రామికవేత్తలే చెబుతున్నారు
- త్వరలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు
- మూడు రాజధానులే మా విధానం

సాక్షి, చెన్నై: పెట్టుబడులకు అపార అవకాశాలున్న ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆహ్వానించారు. విశాఖ వేదికగా మార్చిలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం చెన్నైలో ఇండస్ట్రీ మీట్‌లో ఆయన మాట్లాడారు. తమిళనాడులో వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు దీనికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాలు, సహజ వనరులు, పారిశ్రామిక కవాడలు, ప్రభుత్వ సహకారం, పాలసీలు, పోర్టులు, విశాఖపట్నం–చెన్నై, చెన్నై–బెంగళూరు, బెంగళూరు–హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్లు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పారిశ్రామికవేత్తలకు అధికారులు వివరించారు. పారిశ్రామికవేత్తల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృతి – సంప్రదాయాలు ఒకే విధంగా ఉంటాయని మంత్రి బుగ్గన గుర్తు చేశారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఏపీలో విస్తారమైన తీర ప్రాంతం, విమాన మార్గాలతోపాటు వ్యవసాయం, మెరైన్, విద్యుత్, రెన్యువబుల్ ఎనర్జీ తదితర అంశాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ పెట్టుబడులను ఆహ్వానించేలా ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు తెలిపారు.

పారిశ్రామికవేత్తలే చెబుతారు..

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న విస్తృత అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని చాటి చెప్పేందుకు రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తల అభిప్రాయాలే నిదర్శనమని బుగ్గన తెలిపారు. వారి అనుభవం కంటే కొత్తగా తాము వివరించాల్సింది ఏమీ లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్వేచ్ఛగా, చౌకగా వాణిజ్య నిర్వహణకు అవకాశాలున్నాయన్నారు. 50 వేల ఎకరాలకుపైగా పారిశ్రామిక భూములు, పోర్టులు, విమానాశ్రయాలు అనుసంధానమై ఉండడం పరిశ్రమల స్థాపనకు కలసి వస్తుందన్నారు. ఐటీ, ఫార్మా, పారిశ్రామిక, తయారీ రంగానికి విశాఖపట్టణం చిరునామాగా మారుతోందని బుగ్గన వెల్లడించారు. రూ.2500 కోట్లతో భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు పోర్టుల నిర్మాణం, ఐదు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, చౌకగా జల రవాణాపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ వంకా రవీంద్రనాథ్‌రెడ్డి, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్‌గౌర్, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శి సుందర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి, తమిళనాడు సీఐఐ మాజీ చైర్మన్ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులే..

మూడు రాజధానుల అంశంపై ప్రభుత్వ ఉద్దేశాన్ని ఇప్పటికే ప్రజలకు, అసెంబ్లీ సాక్షిగా కూడా స్పష్టం చేశామని బుగ్గన గుర్తు చేశారు. ఈ వ్యవహారంలో చరిత్ర గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష మాట్లాడే వారందరికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఏ విధంగా నిర్ణయించారో అదే విధంగా కోస్తా, రాయలసీమ తదితర ప్రాంతాల అభివృద్ధి గురించి శ్రీబాగ్ ఒప్పందంలో స్పష్టంగా ఉందన్నారు. అందుకే మూడు రాజధానులపై దృష్టి పెట్టామన్నారు. అతి తక్కువ శ్రమతో అతి పెద్ద నగరంగా విశాఖను తీర్చిదిద్దవచ్చన్న సంకల్పంతో పరిపాలనా రాజధానిగా ఎంపిక చేశామన్నారు. హైకోర్టుతో పాటు వివిధ న్యాయపరమైన విభాగాలు, సంస్థలకు కర్నూలును జ్యుడీషియల్ రాజధానిగా నిర్ణయించామన్నారు. సాంస్కృతిక కేంద్రంగా ఉన్న అమరావతిని శాసన రాజధానిగా ఎంపిక చేశామని వివరించారు. మూడు రాజధానుల బిల్లును మరింత మెరుగ్గా సభ ముందుకు తెస్తామన్నారు.

టీడీపీకి పుట్టగతులుండవని 'ఈనాడు' భయం

- అందుకే పేదల ఇళ్లపై తప్పుడు రాతలు
- రాష్ట్ర వ్యాప్తంగా 17,005 వైఎస్సార్, జగనన్న కాలనీలు
- పేదల సొంతింటి కల సాకారానికి దేశంలో ఎక్కడా లేని విధంగా చర్యలు

సాక్షి, అమరావతి: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా సాకారం చేస్తుంటే, తన ఆత్మీయుడు ఉనికి కోల్పోవడం ఖాయం అని 'ఈనాడు' రామోజీరావుకు దిగులు పట్టుకుంది. ఏకంగా 17,005 వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్తగా ఊళ్లనే నిర్మిస్తుండటం చూసి.. అవి పూర్తయితే టీడీపీకి పుట్టగతులుండవని నిద్ర కరువైంది. ఏదో ఒకటి చేసి ఆ ఇళ్ల నిర్మాణాలు సమాజానికి కన్పించకుండా కనికట్టు చేయాలని 'నవరత్న ఇల్లు.. పల్లె పేదకు లేదు!' అంటూ శుక్రవారం ఓ కథనాన్ని వండివార్చారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ప్రభుత్వం ఏకంగా 30.65 లక్షలకు పైగా పేద కుటుంబాలకు గృహ యోగం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 30.65 లక్షల ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. వీరికి రూ.56,102 కోట్ల విలువైన భూములను కేటాయించింది. వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్తగా ఊళ్లనే నిర్మిస్తున్నారు. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం ఏకంగా రూ.36 వేల కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఇప్పటి వరకూ రెండు దశల్లో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఇప్పటికే 17.22 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ వాస్తవాలన్నీ అందరికీ కళ్లెదుటే కనిపిస్తున్నా, ఈనాడుకు మాత్రం కనిపించలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని బురద చల్లుతుండటం దారుణం. ఇప్పటికే రెండు దశల్లో శర వేగంగా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా, త్వరలో మూడో దశ కింద మరికొన్ని అదనపు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. మున్సిపల్, పట్టణాభివృద్ధి, గ్రామీణ ఇలా ఏ లబ్ధిదారులకైనా ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం యూనిట్‌కు రూ.1.80 లక్షలు ఇస్తోంది. దీంతో పాటు పావలా వడ్డీకి రూ.35 వేల బ్యాంక్ రుణ సాయం చేస్తోంది. వీటికి అదనంగా 20 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా ఇవ్వడంతో పాటు, ఇతర నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై అందిస్తోంది. ఎక్కడైనా కోర్టు కేసులు, లబ్ధిదారు మరణం, లబ్ధిదారుల శాశ్వత వలస వంటి ఇతర సమస్యల కారణంగా ఇంటి నిర్మాణం చేపట్టని సందర్భాల్లో మాత్రమే ఆయా ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి తప్ప లబ్ధిదారులను ఎక్కడా తొలగించలేదు.

తాగునీటి అవసరాలకే అనుమతిస్తున్నాం



'పాలమూరు-రంగారెడ్డి'పై సుప్రీంకోర్టు..

- ఎన్జీటీ విధించిన జరిమానాపై స్టే
- 90 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ ఏపీ అభ్యంతరం
- వాస్తవాల్లోకి వెళ్లాలని కోరిన ఏపీ తరపు న్యాయవాది
- విచారణను ఆగస్టుకు వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీ విధించిన జరిమానాపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తాగునీటికి సంబంధించి 7.15 టీఎంసీల పనులకు అనుమతిస్తున్నట్లు స్పష్టం చేసింది. ధర్మాసనం ఆదేశాలకు ఏపీ ప్రభుత్వం అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తోందని పర్యావరణ అనుమతుల్లేవని ఆరోపించింది. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో ఎన్జీటీ విధించిన భారీ జరిమానాను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ .. ఎన్జీటీ ఆదేశాలతో రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందన్నారు. కేవలం తాగునీటి కోసమే ప్రాజెక్టు అని ఎలా చెబుతారు..? ఉత్తర్వుల్లో రెండు రకాల ప్రయోజనాలు అని ఉందిగా అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రాజెక్టు తాగు, సాగు నీటి విభాగాలకని, రెండింటికీ వేర్వేరుగా నిధులు కేటాయింపులు ఉన్నాయని రోహత్గి తెలిపారు. 2050 నాటి అవసరాల మేరకు ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు. తెలంగాణ వారెవరూ ప్రాజెక్టును వ్యతిరేకించలేదని, ఏపీ వారే వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పర్యావరణ అనుమతుల్లేవంటూ ఏపీ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలు లేపాలని యోచిస్తోందన్నారు.

విభేదించిన ఏపీ న్యాయవాది

తెలంగాణ వాదనలతో ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా విభేదించారు. రెండు రాష్ట్రాల అధికారులతో సంయుక్త కమిటీకి తెలంగాణ ఒప్పుకోలేదని తెలిపారు. తాగునీటి అవసరాలకు 7.15 టీఎంసీలు సరిపోతాయని సంయుక్త కమిటీ నివేదిక చెప్పిందని, అయితే సాగు, పారిశ్రామిక అవసరాలకు సరిపోయేలా 90 టీఎంసీలతో ప్రాజెక్టు రూపొందించారని చెప్పారు. న్యాయస్థానం వాస్తవాల్లోకి వెళ్లాలని కోరారు. 7.15 టీఎంసీల పనులే చేపడుతున్నామని తెలంగాణ చెబుతోందిగా అని ధర్మాసనం పేర్కొనగా.. రిజర్వాయర్లకు అనుమతులు లేవని, ప్రాజెక్టు నిలిపివేయాలని గుప్తా కోరారు. ఎన్జీటీ ఎంత మొత్తం జరిమానా విధించిందని ధర్మాసనం ప్రశ్నించగా.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.35,200 కోట్లలో 1.5 శాతం రూ.528 కోట్లు, ఆదేశాలు ఉల్లంఘించారంటూ మరో రూ.300 కోట్లు జరిమానా వేసిందని రోహత్గీ తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. 7.15 టీఎంసీల తాగునీటి పనులకు మాత్రమే అనుమతిస్తున్నామంది. ఎన్జీటీ విధించిన పరిహారం మొత్తంపైనా స్టే విధిస్తున్నట్లు పేర్కొన్న ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఆరువారాల్లోగా ప్రతివాదులు, ఏపీ ప్రభుత్వం, కేంద్రం కౌంటరు దాఖలు చేయాలని, తర్వాత ఆరు వారాల్లోగా తెలంగాణ రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

'క్రేజ్' కల్చర్..!


ఆర్కే బీచ్ సమీపంలో సముద్రంలో ఏర్పాటు చేస్తున్న కేజ్‌లు

విశాఖ జిల్లాకు 10 యూనిట్ల మంజూరు

- ఆర్కే బీచ్‌లో ఏర్పాటు
- వీటిలో పండుగప్ప రకం చేపల పెంపకం
- మార్కెట్‌లో ఈ చేపలకు ఎంతో డిమాండ్
- కిలో రూ.500–700 పలుకుతున్న ధర
- ఒక్కో యూనిట్ వ్యయం రూ.5 లక్షలు
- 60 శాతం రాయితీతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం: కేజ్ కల్చర్! సముద్రంలో పంజరం వంటివి ఏర్పాటు చేసి వాటిలో చేపలను పెంచే విధానాన్ని కేజ్ కల్చర్‌గా పేర్కొంటారు. వీటిలో పెరిగే చేపలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. ఇలాంటి కేజ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. కొన్నేళ్ల నుంచి సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు విశాఖ ఆర్కే బీచ్‌కు సమీపంలో సముద్రంలో కేజ్‌లను అమర్చి పరిశోధనలు సాగిస్తున్నారు. వీరు అక్కడ ఉన్న 30 కేజ్‌ల్లో వివిధ రకాల చేపలను పెంచుతున్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) ద్వారా మత్స్యకారులతో పాటు వివిధ కులాల మహిళలకు ఓపెన్ సీ కేజ్ యూనిట్లను మంజూరు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలు, మత్స్యకార మహిళలకు 60 శాతం, బీసీ మత్స్యకారులకు 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇలా విశాఖ జిల్లాకు 18 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో జనరల్ కేటగిరీ వారికి 14, ఎస్సీలకు 4 చొప్పున కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.5 లక్షలు. ఇందులో 10 శాతం లబ్దిదారు వాటాగా భరిస్తే సబ్సిడీ సొమ్ము 40/60 శాతం) పోగా మిగిలినది బ్యాంకు రుణంగా సమకూరుస్తోంది. సబ్సిడీ సొమ్మును లబ్దిదారునికి దశలవారీగా చెల్లిస్తారు. విశాఖ జిల్లాలో బి.రేవతి అనే మహిళకు 10 ఓపెన్ సీ కేజ్ యూనిట్లను మంజూరు చేశారు. వీటిని సీఎంఎఫ్ఆర్ఐ నిర్వహిస్తున్న కేజ్‌ల సమీపంలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేజ్‌ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని సీఎంఎఫ్ఆర్ శాస్త్రవేత్తలే అందజేస్తారు. అంతేకాదు.. వీరి పర్యవేక్షణలోనే కేజ్‌ల్లో చేపల పెంపకం కూడా జరుగుతుంది. చేప పిల్లలు, మేత, రవాణా తదితర అవసరాలకు సీఎంఎఫ్ఆర్ఐ సహకరిస్తుంది. విశాఖలో సముద్రంలో కేజ్‌ల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. నెల రోజుల్లో వీటిలో చేపల పెంపకం ప్రక్రియ ప్రారంభమవుతుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ కేజ్‌ల్లో పండుగప్పల పెంపకం

విశాఖలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కేజ్‌ల్లో పండుగప్ప రకం చేపలను పెంచనున్నారు. ప్రస్తుతం బయట మార్కెట్‌లో పండుగప్ప చేపలకు మంచి డిమాండ్ ఉంది. ఈ పండుగప్ప చేప పిల్లలను (3–4 అంగుళాల పొడవు) పాండిచేరి సమీపంలోని సీడ్‌గాళిలో ఉన్న రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ నుంచి తీసుకొచ్చి ఈ కేజ్‌ల్లో పెంచుతారు. 10–12 నెలల్లో చేప పూర్తి స్థాయిలో (కిలో వరకు బరువు) ఎదుగుతుంది. ఇలా ఒక్కో కేజ్ నుంచి 2–3 టనునల చేపల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో పండుగప్ప ధర రూ.500–700 వరకు పలుకుతోంది.

కేజ్‌ల నిర్మాణం ఇలా..

ఒక్కో ఓపెన్ సీ కేజ్‌ను ఆరు మీటర్ల వ్యాసార్థంలో, నాలుగు మీటర్ల లోతులో రబ్బరు ట్యూబ్‌లు, పీవీసీ పైప్‌లతో నిర్మిస్తారు. వీటికి ప్లాస్టిక్ డ్రమ్ములు, వెదురును కూడా ఉపయోగిస్తారు. చుట్టూ ఔటర్, ఇన్నర్ నెట్‌లను ఫ్రేమ్‌ల మాదిరిగా అమరుస్తారు. ఈ కేజ్‌లు కొట్టుకుపోకుండా సముద్రంలో లైన్లు, యాంకరింగ్‌కు వీలుగా చైన్లను ఏర్పాటు చేస్తారు.


పండుగప్ప

రొయ్యల ఎగుమతికి లైన్‌క్లియర్

- కొన్నాళ్లుగా విశాఖ విమానాశ్రయంలో నిలిచిన ఎయిర్ కార్గో
- తాజాగా సరకు రవాణాకు అనుమతులు ఇచ్చిన బీసీఏఎస్



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎట్టకేలకు రొయ్య పిల్లల రవాణాకు అనుమతులు లభించాయి. విమానాశ్రయాల్లో నిర్దేశిత నిపుణులైన స్క్రీనర్లు లేని కారణంగా విశాఖ, విజయవాడ సహా దేశంలోని తొమ్మిది ఎయిర్‌పోర్టుల్లో జనవరి ఒకటి నుంచి ఎయిర్ కార్గో రవాణాకు బ్రేకులు పడ్డాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సరకు రవాణాను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇన్నాళ్లూ ఆయా విమానయాన సంస్థలే కార్గో స్క్రీనింగ్ వ్యవహారాలు చూసుకునేవి. ఇటీవల ఆ బాధ్యతలను బీసీఏఎస్ పర్యవేక్షిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయాల్లో బీసీఏఎస్ నిబంధనలకనుగుణంగా నియమితులైన స్క్రీనర్లతోనే సరకు తనిఖీలు చేపట్టడం తప్పనిసరి చేసింది. వీటిని ఇప్పటికీ అమలు చేయని విమానాశ్రయాల్లో కార్గో బుకింగ్, రవాణాను నిలిపివేస్తూ బీసీఏఎస్ నిర్ణయం తీసుకుంది. గతంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా ఒక కార్గో విమానాన్ని నడిపేది. కోవిడ్ ప్రభావంతో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సరకు రవాణాకు ప్రత్యేకంగా కార్గో విమానాలు నడవడం లేదు. పాసింజరు విమానాల్లో కేటాయించిన మేరకు వివిధ ప్రాంతాలకు కార్గో రవాణా జరుగుతోంది. కాగా నిలిచిపోయిన కార్గో రవాణాను తక్షణమే పునరుద్ధరించాలంటూ విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టు అధికారులు బీసీఏఎస్‌ను ఎవరి స్థాయిలో కోరుతున్నారు.

ఇక సరకు రవాణా జోరు

విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 80 వరకు పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున 300 టన్నుల సరకు రవాణా జరుగుతోంది. వీటిలో వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రక్త పరీక్షల నమూనాలు, ఫార్మా, మత్స్య ఉత్పత్తులు, టెక్స్‌టైల్ వంటివి ఉన్నాయి. 45 రోజులుగా ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా నిలిచిపోవడంతో సంబంధీకులు రోడ్డు, రైలు మార్గాల్లో తమ సరకు/ఉత్పత్తులను పంపిస్తున్నారు. మరీ అత్యవసరమైతే తేలికైన వస్తువులు, సరకులు, మందులు, రక్త నమూనాలు వంటి వాటిని విమాన టిక్కెట్టు బుక్ చేసుకుని తమ వెంట తీసుకెళ్లి వస్తున్నారు. ఇలా రవాణా చేసే సమయంలో ఆక్సిజన్ అందక రొయ్య పిల్లలు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా విశాఖ విమానాశ్రయం నుంచి రొయ్య పిల్లలను కార్గో ద్వారా రవాణా/ఎగుమతులకు అనుమతులిస్తూ పౌర విమానయానశాఖ జాయింట్ డైరెక్టర్ అవధేష్ ప్రతాప్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రక్షణరంగ ఉత్పత్తుల రవాణాకు బీసీఏఎస్ అనుమతించిందని, తాజాగా రొయ్య పిల్లల (ష్రింప్ సీడ్) రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని విమానాశ్రయం డైరెక్టర్ కె.శ్రీనివాసరావు 'సాక్షి'తో చెప్పారు.

"అర్జునా! నీ స్వభావ సిద్ధమైన కర్మలకు నువ్వు బద్ధుడివి. భ్రాంతి వలన కర్మ చేయడానికి ఇష్టపడకపోయినా తప్పనిసరిగా చేసి తీరుతావు.
- భగవద్గీత

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 18

ఎట్టకేలకు ఢిల్లీకి మేయర్!

ఎన్నికలు జరిగి మూడు నెలలవుతున్నా మేయర్ సంగతి తేలక అయోమయంలో పడిన ఢిల్లీ ఓటర్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం మంచి కబురందించింది. ఢిల్లీ కార్పొరేషన్ తొలి సమావేశానికీ, మేయర్ ఎన్నికకూ 24 గంటల్లో ప్రకటన విడుదల చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్‌కు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి గనుక, పౌరుల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని నింపటం అవసరం గనుక స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహించాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. పంచాయతీల మొదలుకొని నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వరకూ ఎన్నికలు నిర్వహించేది అందుకే. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తావనకొచ్చే అంశాలు, వాటి అవసరాలు వేరు గనుక ఆ ఎన్నికల స్వరూపమే భిన్నంగా ఉంటుంది. కనుక రాష్ట్రాన్ని పాలించే పార్టీ కాకుండా మరో పార్టీ స్థానిక సంస్థల్లో పాగా వేయొచ్చు. దీన్ని వమ్ము చేసి, బలాబలాలను తారుమారు చేయటానికి అధికారపక్షం తమ ఎమ్మెల్యేలనూ, ఎంపీలనూ ఆ సంస్థల్లో సభ్యులుగా చేర్చే ధోరణి చాన్నాళ్లుగా కొనసాగుతోంది. ఢిల్లీలో జరిగింది అదే. అక్కడ మూడు పురపాలక సంస్థలనూ విలీనం చేసి ఒకే కార్పొరేషన్‌గా మార్చాక జరిగిన ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఘన విజయం సాధించింది. పదిహేనేళ్లుగా మూడు పురపాలక సంఘాల ద్వారా ఆ నగరాన్ని అవిచ్ఛిన్నంగా ఏలిన బీజేపీ ఓటమి చవిచూసింది. 250 స్థానాలుండే కార్పొరేషన్‌లో ఆప్‌కు 134 వచ్చాయి. బీజేపీ బలం 104. ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలు నువ్వా నేనా అన్నట్టు జరిగాయి. బీజేపీకి మద్దతుగా 15 మంది కేంద్ర మంత్రులు, ఆరుగురు ముఖ్యమంత్రులు ఢిల్లీ వీధుల్లో నెల్లాళ్లపాటు అలుపెరగకుండా ప్రచారం చేశారు. కానీ ఫలితం దక్కలేదు. అప్పటినుంచి కేంద్రంలో ఎన్‌డీఏ సర్కారుకు నాయకత్వం వహిస్తున్న బీజేపీ చేయనిదంటూ లేదు. మొదట ఆప్ సభ్యులను లోబరుచుకునేందుకు ప్రయత్నించిందన్న ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత నగరపాలక సంస్థ తొలి సమావేశంలోనే తమ నామినేటెడ్ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించే ఎత్తుగడకు దిగింది. ఇందుకు అనుగుణంగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులిచ్చారు. కానీ 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం ముందు ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీకారం, ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, స్థాయి సంఘం సభ్యుల ఎన్నిక పూర్తయ్యాకే నామినేటెడ్ సభ్యుల ప్రమాణస్వీకారం ఉండాలి. ఈ నిబంధనలు తొలి సమావేశానికి మాత్రమే వర్తిస్తాయి. లెఫ్టినెంట్ గవర్నర్ అప్రజాస్వామిక ఉత్తర్వులు పాటించబోమంటూ ఆప్... వాటిని తలదాల్చాల్సిందేనని బీజేపీ వాగ్యుద్ధాలకు దిగటంతో గత నెల 6న, ఆ తర్వాత 24న జరిగిన సమావేశాలు రసాభాసగా ముగిశాయి. ఫిబ్రవరి 6న సైతం ఇదే పునరావృతమైంది. తాజాగా సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ఆప్ మాటే నెగ్గినట్టయింది.

దేశవ్యాప్తంగా తిరుగులేని మెజారిటీ సాధించి కేంద్రంలో రెండో దఫా పరిపాలన సాగిస్తూ కూడా ఢిల్లీ కోసం అర్రులు చాచటం బీజేపీ మానుకోలేదు. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వరసగా రెండు దఫాలు అధికారం అందుకున్న ఆప్ మొన్నటి నగర పాలక ఎన్నికల్లో సైతం విజయం సాధించటం సహజంగానే బీజేపీకి కంటగింపుగా ఉంది. రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా నచ్చని ప్రభుత్వాలను నియంత్రిస్తున్నట్టే, లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ఢిల్లీలో ఆప్ సర్కార్‌కు చికాకులు తీసుకురావటం, న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు కొనసాగటం తరచు కనబడుతూనే ఉంది. ఢిల్లీ మహానగరంలోనే కేంద్ర ప్రభుత్వ అధికార పీఠానికి సంబంధించిన సమస్త యంత్రాంగమూ ఉంటుంది గనుక అక్కడి అసెంబ్లీ, అక్కడి నగర పాలక సంస్థ కూడా తన అధీనంలోనే ఉండాలని బీజేపీ కోరుకోవటంలో విపరీతమేమీ లేదు. ఉన్న అధికారాన్ని పదిలపరుచుకోవటానికి, దాన్ని మరింత విస్తృతపరుచుకోవటానికి ప్రజాస్వామ్యంలో ప్రతి పార్టీకీ హక్కుంటుంది. అయితే అదంతా నిబంధనలకు అనుగుణంగా జరగాలి. అడ్డదారుల్లో అధికారాన్ని అందుకోవాలని ఎవరూ తాపత్రయపడకూడదు. 2014 ఎన్నికల తర్వాత తనకొచ్చిన బలంతో సరిపెట్టుకోక వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి చేర్చుకున్న చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్‌లో జనం ఏ గతి పట్టించారో కళ్లముందుంది. నిజానికి ఢిల్లీలో కొత్తగా నామినేట్ అయ్యే పదిమందితో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆప్‌ను అధిగమించటం ఇప్పటికప్పుడు బీజేపీకి అసాధ్యం. అయితే ఈ చర్యవల్ల ఇద్దరి బలాబలాల్లోని వ్యత్యాసం తగ్గిపోతుంది. అనంతరకాలంలో సభ్యులను ప్రలోభపెట్టడం ద్వారా దాన్ని మరింత పెంచుకుని అధికారం దక్కించుకునే ఆస్కారం ఉంటుంది.

నిజానికి అన్ని పార్టీలూ హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించటం నేర్చుకుంటే దాదాపు మూడు నెలలపాటు ఎన్నికైన పాలకవర్గం లేకుండా ఢిల్లీ నగర పాలక సంస్థ అనాథగా మిగిలేది కాదు. అందరికీ సహజంగా తెలియాల్సిన నిబంధనల గురించి సుప్రీంకోర్టుతో చెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడేది కాదు. పెండింగ్ కేసుల సంఖ్య అపారంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలా విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయటం పార్టీలకు తగునా? అన్ని పార్టీలూ ఆలోచించాలి. ఇకనుంచైనా తన విధులు తాను నిర్వర్తించే వెసులుబాటు ఢిల్లీ నగర పాలక సంస్థకు కలుగుతుందని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి: బ.త్రయోదశి సా.6.20 వరకు
తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఉత్తరాషాఢ సా.4.11 వరకు, తదుపరి
శ్రవణం, వర్జ్యం: రా.7.54 నుండి 9.23 వరకు
దుర్ముహూర్తం: ఉ.6.28 నుండి 8.01 వరకు
అమృతఘడియలు: ఉ.10.05 నుండి 11.40 వరకు, మహాశివరాత్రి

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

చైనా దూకుడుకు కారణాలెన్నో!

విశ్లేషణ



డాక్టర్ గద్దె ఓంప్రసాద్

చైనాకు లదాఖ్ ఎందుకంత ముఖ్యం అన్న ప్రశ్నకు సమాధానం వెతకగలిగితే సరిహద్దు సమస్యలకు సమాధానం దొరుకుతుంది. టిబెట్ అటానమస్ రీజియన్‌ను క్సిన్జియాంగ్ అటానమస్ రీజియన్‌తో అనుసంధానించే ప్రాంతంలో లదాఖ్‌లోని అక్సాయ్ చిన్ ఉంది. చైనా తన పశ్చిమ, ఉత్తర, నైరుతి దిక్కుల్లో ఉన్న సరిహద్దులకు సైన్యాన్ని తరలించడానికి ఉన్న మార్గాలు ఇవి మాత్రమే. చైనా ఉత్పత్తి చేసే 157 రకాల ఖనిజాల్లో దాదాపు 138 రకాల ఖనిజాలు ఈ ప్రాంతంలో దొరుకుతాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌తో ఉన్న సరిహద్దులపై చైనా ఇంకా దృష్టి పెడుతుంది. అతి నిర్ణయాత్మకమైన ధోరణిని అవలంబించే బలమైన ప్రభుత్వం మాత్రమే చైనా దూకుడును ఎదుర్కోగలదు.

ఈ సంవత్సరం జనవరి 20-22 తేదీల్లో ఢిల్లీలో 'కంచె లేని భూసరిహద్దుకు సంబంధించిన భద్రతా సమస్యలు' అనే అంశంపై ఇంటలిజెన్స్ బ్యూరో నిర్వహించిన సమావేశంలో లదాఖ్‌లో చైనాతో ఉన్న సరిహద్దుకు సంబంధించిన విషయాలు చర్చకు వచ్చి, అవి మీడియాలో కూడా అనేక చర్చలకు దారితీశాయి. ప్రధాని, హోంమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుకు వచ్చిన ఒక నివేదిక ప్రకారం– ఈ ప్రాంతంలో కారకోరం పాస్ నుండి చుమూర్ గ్రామం వరకు ప్రస్తుతం ఉన్న 65 పాట్రోలింగ్ పాయింట్స్‌లో 26 పాయింట్స్ అంటే పాయింట్ నంబర్ 5 నుండి 17, 24 నుండి 32, 37, 51, 52, 62 అనే పాయింట్స్ ఇండియా కోల్పోయిందనీ, చైనా పాటించే సలామి స్లైస్ వ్యూహంలో(చిన్న దాడులతో పెద్ద ఫలితం రాబట్టడం) ఇవి చిక్కుకున్నాయనీ వెల్లడయిన విషయాలు ఆందోళన కలిగించేవే! అయినప్పటికీ ఈ ప్రాంతంపై చైనాకు ఉన్న ఆర్థిక రాజకీయ వ్యూహాత్మక భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ఇది ఊహించదగ్గదే.

ఇండియా, చైనా మధ్య 2020 ఏప్రిల్ నుండి ఇప్పటివరకూ సుమారు 17 రౌండ్ల చర్చలు జరిగినప్పటికీ, వాటి ఫలితాలు ఏమాత్రం అనుకూలంగా రాలేదు. రెండు దేశాల సైన్యాలు బాహాబాహీకి దిగుతున్న సంఘటనలు, నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు, రహదారులు, మిలిటరీ స్టేషన్స్, జనావాసాలు... ఎన్ని రౌండ్ల చర్చలు జరిగినప్పటికీ 2020 సంవత్సరానికి పూర్వం ఉన్న పరిస్థితులు పునరుద్ధరించడం కష్టమేనన్న భావన కలిగిస్తున్నాయి. దానికి తోడు జనవరి 20వ తేదీన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ లదాఖ్ ప్రాంతంలోని చైనా సైనికులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన సమావేశంలో ఎల్లవేళలా యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చాడు. చైనాకు ఈ ప్రాంతం ఎందుకంత ముఖ్యం అన్న ప్రశ్నకు సమాధానం వెతకగలిగితే ఈ సరిహద్దు సమస్యలకు సమాధానం దొరుకుతుంది.

గత మూడు దశాబ్దాల్లో చైనా విదేశీ విధానంలో, దాని రూపకల్పనలో సైన్యం పోషించే పాత్రలో చాలా మార్పులు వచ్చాయి. తొంభయ్యో దశకంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించకుండా అతిగోప్యతను పాటించడం, ఇతర దేశాల్లో ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం ముఖ్యమైన విధానంగా ఉంటే, కొత్త సహస్రాబ్దిలో చైనా సాధించిన ఆర్థిక విజయాలు ఈ విధానంలో సమూల మార్పులకు దోహద పడ్డాయి. అందులో భాగంగా తన ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకోవడానికి సైన్యం కీలక పాత్ర పోషించవలసిన అవసరం ఉందని గుర్తించింది. దూకుడైన విధానాలు, బలమైన, టెక్నాలజీ సపోర్ట్‌తో కూడిన రక్షణ వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి పెట్టింది. జిన్‌పింగ్ కాలంలో విదేశీ విధానాల రూపకల్పనలో



గస్తీలో భారత సైనికుడు

సైన్యం పాత్ర మరింత పెరగటం గమనించవచ్చు. జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చాక 2013లో చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో భాగంగా చైనా వాణిజ్యం పెంచే ఎగుమతులు దిగుమతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా కొనసాగించడానికి రక్షణ చర్యలు తీసుకొనవలసిన అవసరం ఏర్పడింది. 2016 నుండి తన పశ్చిమ సరిహద్దుల్లో ముఖ్యంగా సెంట్రల్ ఆసియా, అఫ్గానిస్తాన్‌లో పెరుగుతున్న తీవ్రవాదం ప్రభావం తన ఉగెర్, క్సిన్జియాంగ్ ప్రాంతాల్లో పడకుండా ఉండడానికి ఆ ప్రాంతాల్లో మిలిటరీ ఉనికిని పెంచడమే కాకుండా, తన వెస్టర్న్ కమాండ్‌ను మొత్తంగా పునరుద్ధరించింది. ఈ చర్యలు అటు క్సిన్జియాంగ్ ప్రోవిన్సుతో పాటు, టిబెట్ ప్రావిన్స్‌లలో సైన్యం కదలికలు పెరిగి ఎన్నడూ లేని విధంగా ఆ ప్రాంతాల్లోని సరిహద్దులపై దృష్టి పెట్టేందుకు దోహదపడ్డాయి.

గత రెండు దశాబ్దాల్లో చైనా విధానాల్లో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు, తాను నిర్దేశించుకున్న 'మూల ప్రయోజనాలు'. తొంభయ్యో దశకం వరకు ఆర్థిక అభివృద్ధి, దేశ సమగ్రత ముఖ్య లక్ష్యాలయితే, అది కొత్త మిలీనియంలో విదేశాల్లో ఆర్థిక ప్రయోజనాలతో పాటు, ఆయా దేశాల్లో ఉన్న సహజ వనరులను ఉపయోగించుకునేందుకు, అందుకు అవసరమైతే మిలిటరీ తదితర శక్తుల ప్రదర్శన చేయడంగా రూపాంతరం చెందింది.

అయితే ఢిల్లీలో జరిగిన సమీక్ష సమావేశంలో చైనాకు లదాఖ్ ప్రాంతంలో ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ, అవి ఏమిటన్నది వెల్లడించలేదు. ఈ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని పరిశీలిస్తే చైనాకు ఇది అత్యంత కీలకమైన ప్రాంతమని గోచరిస్తుంది. చైనాకు ఈ ప్రాంతంతో మూడు రకాల ప్రయోజనాలున్నాయి. ఒకటి: చైనాలో ఉన్న టిబెట్ అటానమస్ రీజియన్‌ను క్సిన్జియాంగ్ అటానమస్ రీజియన్‌తో అనుసంధానించే ప్రాంతంలో లదాఖ్‌లోని అక్సాయ్ చిన్ ఉంది. ఈ ప్రాంతంలో చైనా నిర్మిస్తున్న నగరి డ్యామ్ ద్వారా సింధు నదీ జలాల ప్రవాహాన్ని నియంత్రించడమే కాకుండా, వాటిని తన రక్షణ దళాల అవసరాలకు మళ్లించుకోవడానికీ, ఆప్రాంతానికి కావలసిన విద్యుత్ ఉత్పత్తి చేయడానికీ అక్సాయ్ చిన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలపై చైనాకు పూర్తి నియంత్రణ అవసరం.

రెండు: క్సిన్జియాంగ్ ప్రావిన్స్‌ను టిబెట్ ప్రావిన్స్‌తో కలిపే ఎ219 హైవే, కషగర్ నగరాన్ని సెంట్రల్ చైనా నుండి బీజింగ్‌తో కలిపే ఎ314 హైవే... ఈ రెండింటి భద్రతకు అక్సాయ్ చిన్, లదాఖ్ ప్రాంతాలు చైనాకు అతి ముఖ్యమైనవి. చైనా తన పశ్చిమ, ఉత్తర, నైరుతి దిక్కుల్లో ఉన్న సరిహద్దులకు సైన్యాన్ని తరలించడానికి ఉన్న మార్గాలు ఇవి మాత్రమే. ఈ ప్రాంతంలో ఇండియా నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రహదారులు, దౌలత్ ఓల్డ్ బేగ్ లాంటి వైమానిక స్థావరాలతో చైనా భద్రతకు, అందునా చైనా- పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను కషగర్ సిటీతో కలిపే కారకోరం హైవేకు ప్రమాదం ఏర్పడుతుందని చైనా అంచనా.

మూడు: ఈ ప్రాంతంలో 1913లో జరిగిన డి ఫిలిపె ఎక్స్‌పెడిషన్, ఆ తర్వాత సోవియెట్ యూనియన్ జరిపిన భౌగోళిక సర్వేలో అత్యంత విలువైన థోరియం, యురేనియం, బోరాక్స్, సల్ఫర్, నికెల్, పాదరసం, ఇనుము, బంగారం, బొగ్గు నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించారు. 2019లో చైనా సహజ వనరుల మంత్రిత్వ శాఖ ప్రచురించిన నివేదికలో చైనా ఉత్పత్తి చేసే 157 రకాల ఖనిజాల్లో దాదాపు 138 రకాల ఖనిజాలు ఈ ప్రాంతంలో దొరుకుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే వీటి వెలికితీత కార్యక్రమాలు, శుద్ధిచేసే ప్లాంట్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ ఖనిజ సంపదతో తన తూర్పు ప్రాంతానికి సమానంగా పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చనీ, ఉగెర్ ప్రాంతంలో నెలకొని ఉన్న పేదరికాన్ని, వేర్పాటువాదాన్ని ఎదుర్కొనవచ్చనీ చైనా వ్యూహం.

ఈ పరిస్థితుల మధ్య భారత్‌తో ఉన్న సరిహద్దులపై చైనా ఇంకా దృష్టి పెడుతుందనీ, భవిష్యత్తులో మరింత దూకుడుగా ఉంటుందనీ అంచనా వేయవచ్చు. ఇంతకు ముందులా కాకుండా భారత్ కూడా లదాఖ్ నుండి అరుణాచల్ వరకు ఉన్న తన సరిహద్దుల వెంబడి అనేక మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, సైనిక దళాలకు కావలసిన వసతులను వేగంగా అభివృద్ధి చేసుకుంటున్నది. చైనాకు ఉన్న ప్రయోజనాల దృష్ట్యా, అది వ్యవహరిస్తున్న తీరును బట్టి, భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలు తలెత్తవచ్చని చెప్పవచ్చు. అతి నిర్ణయాత్మకమైన ధోరణిని అవలంబించే బలమైన ప్రభుత్వం మాత్రమే చైనా దూకుడును ఎదుర్కోగలదు.

వ్యాసకర్త సహాయ ఆచార్యులు, సిక్కిం సెంట్రల్ యూనివర్సిటీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఈ ముగ్గురు



కమలా హారిస్, నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి... 2024 అమెరికా అధ్యక్ష స్థానం కోసం బహుశా ముగ్గురు భారత సంతతివాళ్లు పోటీపడబోతున్నారు.

– బాలాజీ శ్రీనివాసన్, ఆంట్రప్రెన్యూర్

రాశానొక కవిత



కుచ్ పల్ కే లియే పూరా ఆవూ/ యా హర్ పల్ మే అధూరా ఆవూ (కొన్ని క్షణాల కోసం మొత్తంగా రానా/ లేదా ప్రతి క్షణంలో సగమే రానా)

– ఆయుష్మాన్ ఖురానా, సినిమా నటుడు

చెల్లని పెళ్లి



ఒకవేళ స్వర భాస్కర్ ముస్లిం కాకపోయి, ఆమె 'భర్త' ముస్లిం అయితే, ఇస్లాం ప్రకారం ఈ వివాహం చెల్లదు. బహుదేవతారాధకురాలయిన మహిళను విశ్వాసి కానంతవరకూ వివాహం చేసుకోకూడదని చెప్తాడు అల్లా (2:221). కేవలం వివాహం కోసమే ఆమె ఇస్లాంను అంగీకరించినా కూడా దానికి అల్లా అంగీకరించడు.

– యాసిర్ నదీమ్ అల్ వజీదీ, స్కాలర్

తీర్పరిగా ఉండొద్దు



మీరెవరు(యాసిర్ నదీమ్ అల్ వజీదీ)? ఇతరుల మీద తీర్పులు చెప్పడానికి అల్లా నియమించినవారా? మేము అల్లాకు, అల్లాకు మాత్రమే జవాబుదారీ. మిమ్మల్ని ఎవరైనా అభిప్రాయం అడిగేవరకూ దాన్ని మీవద్దే ఉంచుకోండి. మంచి ముస్లింగా ఉండండి. (నటి స్వర భాస్కర్, ఎస్పీ నాయకుడు ఫహాద్ అహ్మద్ రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నారు.)

– సయేమా, రేడియో జాకీ

బాధితుడే!



వీడియోను బట్టి స్పష్టంగా అర్థమయ్యేది ఏమంటే, క్రికెటర్ పృథ్వీ షా తనను తాను రక్షించుకోవడానికే నటి సప్నా గిల్ నుంచి బ్యాట్ లాక్కున్నారు. ఇంకో రకంగా జరగలేదు. ఒకవేళ పృథ్వీ సాధారణ మనిషి అయివుంటే హింసించాడన్న కేసు మీద ఇప్పటికే జైల్లో ఉండేవాడు. ఇది ఎలా ముగుస్తుందో చూడాలి.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

పదేళ్ల అద్భుతం



ఈ పదేళ్లలో ఏ భాషలో నైనా వచ్చిన అత్యుత్తమ నవల 'ద సెవెన్ మూన్స్ ఆఫ్ మాలీ అల్మీదా'. క్లాసికల్, ఆధునిక నవలల రెండు ధోరణులనూ సమాంతరంగా అనుకరించిన పనితనం ఇందులో కనబడుతుంది. నవలా రచయిత శేహన్ కరుణతిలక నమ్మలేనంత బాగా రాశారు. (2022 బుకర్ ప్రైజ్ గెలుచుకుంది.)

– ఖాలిద్ జావేద్, ఉర్దూ నవలా రచయిత

పడిపోయిన ప్రమాణాలు



బెంగళూరులో ఉబర్, ఓలా డ్రైవర్లు అత్యంత దారుణంగా ఉన్నారు. నా రైడ్‌లో ఏసీ కోరినందుకు డ్రైవర్ పరుషంగా మాట్లాడాడు. పైగా ఈ రైడ్ దొరకడానికి 20 నిమిషాలు పట్టింది. ఒకప్పుడు ఈ రెండు అద్భుతాలు సాంకేతికతకూ, తెగువకూ పేరొందాయి. కానీ ఇప్పుడు వినియోగదారుడు వాటిని అభినందించడం కష్టం. అసలు అవి ఇంతదూరం ఎలా వచ్చాయి?

– రాజేశ్ సాహ్నీ, ఇన్వెస్టర్

అవధాన సరస్వతీ దీప్తి

నివాళి



మా శర్మ

సుప్రసిద్ధ అవధాని, బహువిద్యా విద్వన్మణులు, సరస్వతీ ఉపాసనా విశిష్టులు అష్టకాల నరసింహరామశర్మ ఇటీవలే అనంతలోకాల్లో కలిసిపోయారు. తెలంగాణ మాగాణంలో విరిసి మెరిసిన ఈ ప్రతిభామూర్తి తెలుగు ఎల్లలు దాటి తేజః సంపన్నులయ్యారు. ఈ మూర్తిని కీర్తిమంతుని చేసిన ప్రధాన అంగాలు రెండు. ఒకటి అవధానం. మరొకటి సరస్వతీ ఆలయం స్థాపన. తన శ్రావ్య కావ్యకన్యను, తన కోమల శ్యామల అవధానపు ముద్దుగుమ్మను ఎవ్వరికీ ఎన్నడూ అమ్మకుండా త్రిశుద్ధిగా 'భారతి'ని నమ్మి జీవించారు. చిలుకతోడై నిలిచిన పలుకులమ్మకు గుండె గుడిగా చేసుకొని గుడి కట్టించారు.



భారతదేశంలో సరస్వతికి మూడే మూడు దేవాలయాలు ప్రధానంగా ఉన్నాయి. ప్రాచీన కాలం నుంచి వెలసిన కశ్మీర్ ఆలయం ఒకటి కాగా, రెండోది బాసర. మూడో దేవాలయం అష్టకాల నరసింహరామశర్మ స్థాపించినది కావడం విశేషం. ఈ దేవాలయ స్థాపనకు తన జన్మభూమిని ఎంచుకోవడం అష్టకాలవారి పూర్వ పుణ్య విశేషం. ఈరోజు తెలుగునాట రెండు శారదా నిలయాలు ఉన్నాయంటే ఆ కీర్తిదీప్తిలో సగభాగం వారికే చెందుతుంది. నరసింహరామశర్మ నిర్మించిన ఈ సరస్వతీమూర్తి ప్రత్యేకమైనది. ఆ దేవళంలో అమ్మవారు నిల్చొని ఉన్న నిలువెత్తు వీణాపాణి. ఆ అమ్మవారిని నిండార కొలుచుకొనే సౌభాగ్యం, నిలువెల్లా తిలకించి పులకించే అదృష్టం కలిగించిన అష్టకాలవారు కీర్తనీయ చరితులు.

ఈ గుడి కట్టించడానికి దశాబ్దాలు పట్టింది. ఏ ఒక్కరినీ యాచించకుండా, ఎవ్వరి దగ్గర తలవంచకుండా అవధాన ప్రదర్శనల ద్వారా వచ్చిన సొమ్ముతో, ఎవరైనా భక్తితో, అనురక్తితో సమర్పించినవాటితోనే ఈ నిర్మాణం ఆద్యంతం జరిగింది. మెదక్ జిల్లా అనంతసాగర్‌లో నెలకొని వున్న ఈ అమ్మవారు నేడు కోటి ప్రభలతో కోట్లాదిమందికి అనంత విద్యా విభూతిని అందిస్తోంది. కొండల్లో నిండుగా నిలుచున్న ఆ పలుకులమ్మ పరమ ఆకర్షణాశోభితంగా ఉంటుంది.

ఈ ప్రయాణంలో అష్టకాలవారు ఆసేతు సీతాచలం తిరిగారు. ఊరికే తిరగడం కాదు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వేలకొలది సరస్వతీ యజ్ఞాలు నిర్వహించారు. శారదాదేవి మూర్తిమత్వాన్నీ, సరస్వతీదేవి తత్త్వాన్నీ వాడవాడలా చాటిచెప్పారు.

కవిగా వాసికెక్కారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎందరికో ఉన్నత విద్యను అందించారు. ఉత్తమోత్తమైన రచనలు చేశారు. జ్యోతిష్యం, వాస్తు, భూగర్భ జలశాస్త్రంలో అనిర్వచనీయమైన ప్రతిభను సొత్తుగా చేసుకొని ఎందరో ఉన్నతికీ, ఎంతో ప్రగతికీ మెట్లు కట్టారు. పదునారేళ్ల ప్రాయంలోనే పద్యాల పంటల సిరులు పండించారు. ఇరవైఏళ్ళు రాక మునుపే కావ్యకర్తగా రాణకెక్కారు. తెలంగాణ, కోస్తా, రాయలసీమతో పాటు కాశీక్షేత్రంలోనూ వందలాదిగా అవధాన ప్రదర్శనలు చేశారు. అష్టకాలవారి అవధాన పద్యాలు సరసరమణీ లలామలు. కృతులు ఆకృతి దాల్చిన పండువెన్నెలలు. తన అవధాన ప్రస్థానానికి అయలావఝుల వెంకటరమణయ్య కారకులు, ప్రేరకులుగా నిలిచారు. కార్యంపూడి రాజమన్నార్, గడియారం వేంకటశేషశాస్త్రి, వానమామలై వరదాచార్యులు వంటి దిగ్గంతుల పేరున పురస్కారాలు అందుకున్నారు. ఎన్నో బిరుద భూషణములు కలికితురాయిగా చేరాయి.


మనోహరమ్మ, లక్ష్మయ్య దంపతులకు 1943లో వరంగల్లులో జన్మించిన నరసింహరామశర్మ ఎనిమిది పదుల జీవితాన్ని పరిపూర్ణంగా పండించుకున్నారు. విద్యాభ్యాసం సిద్దిపేట, వరంగల్లులో సాగించి ఎంఏ తెలుగులో పట్టభద్రులు అయ్యారు. అష్టకాలవారి జీవితం, రచనపై ఒకరు పరిశోధన చేసి పీహెచ్‌డీ కూడా పొందారు. 'తుకారామ స్వామి చరిత్ర' గ్రంథంపై ఒకరు ఎం.ఫిల్ తీసుకున్నారు. గజారోహణాది గౌరవాలు పొందిన ఘనులు అష్టకాల.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

(ఫిబ్రవరి 9న అష్టకాల నరసింహ రామశర్మ తుదిశ్వాస విడిచారు.)

హరప్పా అవశేషాలలో శివావతారాలు

సందర్భం



డా॥ చిల్లావూరి శివరామకృష్ణశర్మ

భారతదేశంలో హరప్పా వంటి గ్రామాలలో నిర్వహించిన త్రవ్వకాలలో లభించిన అవశేషాలలో శివుని అవతార చిత్రాలు (ముద్రికలు) కొన్ని లభించాయి. ఇవి భారతదేశంలో ఐదు వేల సంవత్సరాల వెనుక శివారాధన ఉందనడానికి ఆధారాలు.

హరప్పా అనే పదబంధంలో 'హర' పదం శివునికి పర్యాయనామం. హృ ఇన్ హరణే అనే ధాతువు నుండి హరపదం ఏర్పడింది. హరతి ప్రళయే సర్వమితి హరం– ప్రళయకాలంలో సర్వము హరించువాడు అని ఒక అర్థం. భక్తుల పీడను హరించువాడు అని మరియొక అర్థం.

మొహంజొదారో తవ్వకాలలో పశుపతి దేవుని ముద్రిక దొరికింది. పక్కన పశువులుండడం వలన దీనికి పశుపతి అని పేరు పెట్టి ఉంటారు. పశుపతి శివుని పర్యాయపదం (అమరకోశం 1-30). ఈ ముద్రికలో రుద్రుని తలపై పాము, దానికి అయిదు తలలు, దానికి తలపై మణి, మధ్యలో గంగా ప్రవాహం పైకి చిమ్ముతున్న స్థితి, రుద్రుని తలపై మరొక పక్క అర్ధ చంద్రుడు కనబడుతున్నాడు.

చిత్రంలో కుడివైపున దేవనాగరి ప్రణవం ఉంది. ముద్రికలో ఏనుగు బొమ్మ, మనిషి బొమ్మ, దానికింద ఆయుధం ఉన్నాయి. రుద్రునికి అలంకారాలు, కవచం కనబడుతున్నాయి. దీనికి మూడు తలలు గల పశుపతి దేవుని ముద్రిక అని పేరు పెట్టారు చరిత్రకారులు. కాని మూడు తలలు లేవు. జుట్టు లేని ఒకే శిరస్సు ఉంది (తరతరాల భారత చరిత్ర, పుట 21). కొందరు రెండు కొమ్ముల దేవుడు అన్నారు (చరిత్రలో మతాలు, పుట 2). అవి కొమ్ములు కావు. ఒకటి సర్పము, రెండవది అర్ధ చంద్రుడు. ఇది వేదం మొదలైన గ్రంథాలలో వర్ణించిన రుద్ర రూపమని 'శ్రుతి సౌరభం' గ్రంథంలోనూ, సింధు సంస్కృతి– నమకంలోని 'రుద్రుడు' అనే వ్యాసంలోనూ నిరూపించడం జరిగింది (వేద పరిషత్ వార్షిక సంచిక 2002-2003, 64, 65 పుటలు).

ప్రణవానికి పరమున గలవాడు పరమేశ్వరుడని తైత్తిరేయారణ్యకము అనే వేదభాగం చెప్పింది(10 ప్ర. 12 అ. 3 ప.). శివధ్యానాల్లో తలపై చంద్రుడు, గంగ ఉండడం ప్రసిద్ధమే. రుద్రునికి గంగాధరుడని పేరు. గంగని తలపై ధరించిన వాడని అర్థం. శివాష్టోత్తర శతనామ స్తోత్రంలో కూడా ఈ నామముంది (అమర-1-54). భయః అని మరొక పేరు (అమరం 1-35). వీరి వలన భయపడతారు అని అర్థం. నమకంలో 'ఉగ్రాయ' అనే నామం ఉంది. తీవ్రమైన వాడు అని అర్థం. హరప్పా రుద్రుని చూస్తే భయం కలుగుతుంది.



పశుపతి ముద్రిక

శివ సహస్ర నామ స్తోత్రంలో గజేశ్వర, నరర్షభ అనే నామాలున్నాయి (148 శ్లో.). పశుపతి దేవుని ప్రక్కన ఎడమవైపు ఏనుగునూ, మనుష్యునీ చిత్రించారు. శివ సహస్ర నామ స్తోత్రంలో ముండః= తలపై జుట్టు లేనివాడు అనే నామముంది. పశుపతి దేవునికి జుట్టు లేదు. నమకంలో వ్యుప్తకేశ నామముంది. దీనికి కూడా అదే అర్థం. నమకంలో తారాయ అనే నామముంది. ప్రణవ స్వరూపుడని అర్థం. పశుపతి దేవుని ప్రక్కన ప్రణవముంది.

నమకంలో 'కవచినే' అనే నామముంది. కవచం కలవాడు శివుడు. పశుపతి దేవునికి కవచం ఉంది. నమకంలో 'పశుపతయే' అనే నామం ఉంది. పశుపతి దేవుని ముద్రిక అని పేరులోనే ఉంది కదా!

'ఆయుధినే' అని నమకంలో ఉంది. ఆయుధం కలవాడు అని అర్థం. పశుపతి పక్క బాణాయుధం ఉంది కదా! నమకంలో కూడా ఇషువు కలవాడని తెలిపే నామం ఉంది (కృష్ణయజుర్వేదం 4 అ. 5ప.). రుద్రునికి నందీశ్వరావతారం ఉంది(శివపురాణం శత రుద్ర సం. 6 అ.). శివునికి వృషభావతారం ఉంది (శివపు. శతరుద్ర సం. 23 అ.). హరప్పా అవశేషాలలో వృషభ చిత్రముంది.

రుద్రునికి ద్విజేశ్వరావతారం, ద్విజావతారం ఉన్నాయి (శివపు. శతరుద్ర- 27, 35 అ.). హరప్పా అవశేషాలలో యజ్ఞోపవీతం వలె వస్త్రాన్ని ధరించిన ద్విజ చిత్రం ఉంది. యజ్ఞోపవీతం ఉత్తరీయం వలె ధరించమని వేదంలో ఉంది (తైత్తిరీయ అరణ్యకం. 2ప.).

కొమ్ములుంటాయి. తలపై సర్పముండదు. హరప్పా అవశేషాలలో నందీశ్వర రూపముంది. రుద్రునికి కిరాతేశ్వరావతారముంది. (శివపు. శతరుద్ర. 37 అ.). హరప్పా అవశేషాలలో కిరాత చిత్రముంది.

ఇలా పేరు, వేదం, శివ పురాణాల్లో, శివాష్టోత్తర శత నామ స్తోత్రం, శివ సహస్ర నామ స్తోత్రం అనే గ్రంథాల ద్వారా పరిశీలిస్తే హరప్పా సంస్కృతిలో శివారాధన ఉందని తెలుస్తోంది. ఆసక్తి కలవారు కోరితే ఈ అవతార కథలను కూడా తెల్పవచ్చు.

వ్యాసకర్త రచయిత, వేద పండితులు

(నేడు మహాశివరాత్రి పర్వదినం)

క్లుప్తంగా...

వేద ధ్వనితో కురుక్షేత్ర పరవశం



యజ్ఞభూమిలో అమ్మవారి సన్నిధిలో స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం (పెందుర్తి): విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని గుంతీ ఆశ్రమ నిర్వహణలో జరుగుతున్న లక్ష చండీ మహా యజ్ఞం శుక్రవారం శాస్త్రోక్తంగా కొనసాగింది. చండీ మాత పురుహూతికాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంతీ మాత అమ్మవారికి పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. చండీమాతను ఆరాధిస్తూ రెండు వేలకు పైగా పండితులు 6,900 హోమాలు నిర్వహించారు. అలాగే సప్తశతి పారాయణ చేశారు. వేద ధ్వనితో కురుక్షేత్ర అంతా పరవశించింది. అఖండ భారతావని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబోయే ఈ మహా క్రతువును దిగ్విజయంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా పండితులకు స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు.

గజ వాహనంపై శ్రీశైల మల్లన్న



గజ వాహనంపై విహరిస్తున్న మల్లన్న

శ్రీశైలం టెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం భ్రమరాంబ సమేతుడైన మల్లన్న గజ వాహనంపై విహరించాడు. తొలుత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం కళాకారుల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గజ వాహనంపై దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో ఎస్.లవన్న పాల్గొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శనివారం రాత్రి 7.00 గంటలకు ఆలయ ప్రాంగణంలో నంది వాహన సేవ, ఎదురుకోలు నిర్వహిస్తారు. 10.00 గంటలకు పాగాలంకరణ సేవ, లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 12.00 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం జరపనున్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో అపశ్రుతి



వాహనం నుంచి గొడుగు విరిగి పడిపోతుండడంతో వాహనానికి ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడుతున్న అర్చక స్వామి

చంద్రగిరి(తిరుపతి జిల్లా): శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం అపశ్రుతి జరిగింది. ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరారు. నిత్యకైంకర్యాలు ముగిసిన తర్వాత అలంకార మండపం నుంచి స్వామి వారి వాహనం ఊరేగింపునకు బయల్దేరింది. వాహనాన్ని బేరర్లు పైకి ఎత్తడంతో స్వామి వారికి ఏర్పాటు చేసిన రెండు గొడుగుల్లో ఒకటి మండపం షెల్టర్‌కు తగిలి విరిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అర్చక స్వాములు విరిగిన గొడుగు వాహనంపై పడకుండా జాగ్రత్త వహించారు. అనంతరం అధికారులు హుటాహుటిన మరొక గొడుగును తీసుకొచ్చి స్వామివారి వాహనానికి ఏర్పాటు చేశారు. తదుపరి వాహన సేవను పునఃప్రారంభించారు.

హంస వాహనంపై ఆది దేవుడు

శ్రీకాళహస్తి రూరల్(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు హంస వాహనంపై విహరించారు. అమ్మవారు చిలుక వాహనంలో ఊరేగారు. అలాగే రాత్రి కైలాసపతి శేష వాహనంపై చిద్విలాసంతో భక్తులకు అభయ ప్రదానం చేశారు. జ్ఞాన ప్రసూనాంబ యాళి వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాయులింగేశ్వరునికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు.

‘క్లోనింగ్’తో కొల్లగొడుతున్నారు

అంతర్‌రాష్ట్ర సైబర్ ముఠాల నయా దందా

ఏఈపీఎస్ ఖాతాలే లక్ష్యంగా ఆన్‌లైన్ మోసాలు	ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ రికార్డుల నుంచి వేలిముద్రల కాపీ	దేశవ్యాప్తంగా భారీగా నమోదవుతున్న కేసులు



వైఎస్సార్ జిల్లాలో ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని రూ.90 వేలు ఎవరో విత్‌డ్రా చేశారని పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై కడప పోలీసులు విచారణ చేపట్టగా.. ఉత్తరప్రదేశ్ కేంద్రంగా దందా సాగిస్తున్న అంతర్‌రాష్ట్ర సైబర్ నేరస్తుల ముఠా గుట్టు రట్టయింది. 'ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్న దందా బట్టబయలైంది. కడప పోలీసులు ఈ కేసును విజయవంతంగా ఛేదించి సైబర్ నేరస్తులను అరెస్టు చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ మండల కేంద్రంలోని ఒక బ్యాంకు ఖాతాదారుల ఖాతాల్లోని డబ్బు వారికి తెలియకుండానే ఇతర ఖాతాలకు బదిలీ అయింది. దీనిపై ఖాతాదారులు గగ్గోలు పెట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని, తాము పరిశీలిస్తామని బ్యాంకు అధికారులు ఖాతాదారులను అతికష్టం మీద ఒప్పించారు. ఆ బ్యాంకు అధికారులు తమ కేంద్ర కార్యాలయానికి సమాచారమిచ్చారు. అనంతరం ఆ బ్యాంకు కేంద్ర కార్యాలయం సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా హరియాణలోని సైబర్ ముఠా ఘరానా మోసం వెలుగుచూసింది. ఏఈపీఎస్ ద్వారా ఆ బ్యాంకు ఖాతాదారుల ఖాతాల్లోని నగదును హరియాణలోని మరో బ్యాంకు ఖాతాకు బదిలీ చేసినట్టు గుర్తించారు. దాంతో బ్యాంకు కేంద్ర కార్యాలయం తమ ఖాతాదారులు పోగొట్టుకున్న మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేసింది. బ్యాంకు ప్రతిష్టకు మచ్చరాకుండా అతికష్టం మీద ఈ వ్యవహారాన్ని పరిష్కరించారు.

విశాఖపట్నంలో ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.1.50 లక్షలు గల్లంతయ్యాయి. దీనిపై విచారించగా హరియాణలోని ఓ ముఠా దందా వెలుగుచూసింది. ఆన్‌లైన్‌లో రుణాలు ఇస్తామని చెప్పి ఓ సంస్థ ఆయన ఆధార్‌కార్డు, పాన్‌కార్డు కాపీలతోపాటు వేలిముద్రలు కూడా తీసుకుంది. అనంతరం క్లోనింగ్ ద్వారా ఆయన బ్యాంకు ఖాతాల్లోని నగదును విత్‌డ్రా చేసేసింది.

సాక్షి, అమరావతి:దేశంలో కొత్తరూపు సంతరించుకుంటున్న సైబర్ నేరాలకు తాజా ఉదాహరణలు ఇవి. ఏఈపీఎస్ ఖాతాలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. బ్యాంకు ఖాతాదారుల వేలిముద్రల క్లోనింగ్ ద్వారా వారి ఖాతాల్లోని నగదును కొల్లగొడుతున్నారు. మన రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ఈ తరహా సైబర్ నేరాలు అధికమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ ప్రకారం గత ఆరునెలల్లో దాదాపు నాలుగువేల కేసులు నమోదవడం ఈ తరహా సైబర్ నేరాల తీవ్రతకు అద్దంపడుతోంది. ఈ రీతిలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలు అత్యధికంగా హరియాణలో కేంద్రీకృతం కాగా.. మరికొన్ని ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి దందా సాగిస్తున్నాయని సైబర్ పోలీసుల విభాగం గుర్తించింది.

సైబర్ మోసంఇలా..

సైబర్ నేరగాళ్లు ఏఈపీఎస్‌ను దుర్వినియోగం చేస్తూ బ్యాంకు ఖాతాల్లో నగదును కొట్టేస్తున్నారు. అందుకోసం రెండుమూడు తరహాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. ముందుగా వివిధ వెబ్‌సైట్ల నుంచి వ్యక్తుల వేలిముద్రలను 'బటర్ పేపర్'పై కాపీచేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ, ట్రెజరీ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదైన వేలిముద్రలను కాపీచేస్తారు. అనంతరం క్లోనింగ్ ద్వారా నకిలీ సిలికాన్/రబ్బర్ వేలిముద్రలు తయారు చేస్తారు. ఆధార్ నంబరు అనుసంధానమైన వ్యక్తుల పేరిట ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలు తెరుస్తారు. దీంతో ఆ వ్యక్తుల అసలైన ఆన్‌లైన్ ఖాతాలు, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌లు వారి నియంత్రణలోకి వస్తాయి. అనంతరం తాము క్లోనింగ్ చేసిన వేలిముద్రలు ఉపయోగించి ఖాతాల్లోని నగదును కొల్లగొడుతున్నారు. మరికొన్నిసార్లు బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్స్, ఏజెంట్స్ కస్టమర్ సర్వీస్ పాయింట్‌లో బయోమెట్రిక్ డివైజ్ స్కానర్స్‌తో స్కాన్‌చేసి నగదు లాగేస్తున్నారు. మరికొన్ని ముఠాలు ఏకంగా ఆన్‌లైన్ రుణ కంపెనీల పేరిట నకిలీ సంస్థలను ప్రారంభిస్తున్నాయి. రుణాలు ఇస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటనలు చేస్తున్నాయి. రుణాల కోసం తమను సంప్రదించే వ్యక్తుల పాన్‌కార్డులు, ఆధార్‌కార్డుల కాపీలు, వేలిముద్రలు కూడా తీసుకుంటున్నాయి. అనంతరం క్లోనింగ్‌ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోని నగదును తస్కరిస్తున్నాయి. ఆధార్ నంబర్లతో లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోని నగదును పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) మెషిన్ల ద్వారా కూడా సిఫోనింగ్ చేసి మరీ ఇతర ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. ఇలా పలు రకాలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు సూచిస్తున్నారు. అందుకు ఖాతాదారులతోపాటు ప్రభుత్వ సంస్థలకు కూడా కొన్ని సూచనలు చేస్తున్నారు.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు తమ వెబ్‌సైట్లను ఎవరూ హ్యాక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- తమ వెబ్‌సైట్లను తరచు సేఫ్టీ ఆడిట్ చేయాలి.
- ప్రజల వ్యక్తిగత సమాచారం లీక్‌కాకుండా తగిన ప్రమాణాలు పాటించాలి.
- అందుకోసం కేంద్రీకృత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఖాతాదారులకు సూచనలు

- ఏఈపీఎస్ విధానాన్ని తరచు వినియోగించని ఖాతాదారులు ఆ సౌలభ్యాన్ని ఉపసంహరించుకోవాలి.
- వెబ్‌సైట్లలో తమ వేలిముద్రలు నమోదు చేయకూడదు. ఎటువంటి వ్యవహారం కోసమైనా సరే వేలిముద్రలు అడిగితే తిరస్కరించాలి.
- తమ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమయ్యాయని గుర్తిస్తే 24 గంటల్లోనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి. దీంతో వారి ఖాతానుంచి నగదు బదిలీ అయిన ఖాతాను సైబర్ పోలీసులు స్తంభింపజేయడానికి అవకాశం ఉంటుంది.
- సైబర్ నేరం జరిగినట్టు తెలియగానే ఏపీ సైబర్‌మిత్ర (వాట్సాప్ నంబర్ 9121211100)నుగానీ, నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ (1930)ను గానీ సంప్రదించి ఫిర్యాదు చేయాలి.

డిజిటలైజేషన్‌తో వేగంగా టూరిజం అభివృద్ధి

భారత పర్యాటక మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.వి.శంకర్‌రెడ్డి



రేణిగుంట(తిరుపతి జిల్లా): సాంకేతికతను అనుసంధానం చేయడం ద్వారా టూరిజం రంగంలో మరింత వేగంగా అభివృద్ధి సాధించుకోవచ్చని భారత పర్యాటక మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.వి.శంకర్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కుర్రకాల్వ సమీపంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్‌లో హోటల్స్, టూర్ ఆపరేటర్స్, ట్రావెల్ ఏజెంట్ యాజమాన్యానికి ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ టూరిజం అథారిటీ తిరుపతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశ నిధి పోర్టల్ ద్వారా సర్టిఫికేషన్, అక్రిడిటేషన్, బ్రాండింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిధి పోర్టల్లో ఆతిథ్య రంగానికి చెందిన సంస్థలు ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. ఈ వెబ్‌సైట్‌లో హోటల్స్ అందించే విభిన్నమైన వంటలు, ప్రత్యేక సౌకర్యాలు, సామాజిక మాధ్యమాల లింకులు, సిబ్బందికి ఉన్న నైపుణ్యాలను వివరించే వెసులుబాటు ఉందన్నారు. ఏపీ పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, ఏపీ టూరిజం అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్ లజ్వంతి నాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.బాలకృష్ణారెడ్డి, తాజ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ డైరెక్టర్ మనోజ్‌మిశ్రా, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.ప్రయాగ, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి ఎం.త్రిలోక్‌చంద్, తిరుపతి హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకయ్యనాయుడు, రఘు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: అడిగినంత డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తిని హత్య చేసేందుకు ప్రయత్నించిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 12వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొఘల్‌రాజపురానికి చెందిన నిందితుడు పటమట సుధాకర్ అదే ప్రాంతంలో రామప్రియ అపార్ట్‌మెంట్ ఎదురుగా నిలబడిన వ్యక్తిని రూ.4 వేలు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో భయపడిన బాధితుడు తన వద్దనున్న రూ.2 వేలను సుధాకర్‌కు ఇచ్చాడు. అడిగినంత డబ్బు ఇవ్వలేదనే కారణంతో సదరు వ్యక్తిపై సుధాకర్ కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. 2017 జూన్ 13వ తేదీన జరిగిన ఈ ఘటనలో బాధితుడికి మొహం, ఛాతీపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మాచవరం పోలీసులు అదే నెల 20వ తేదీన నిందితుడు సుధాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు సుధాకర్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

చురుకుగా వెలిగొండ ప్రాజెక్టు పనులు

- నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

పెద్దదోర్నాల: వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత ప్రాధాన్యత ఉన్నవి సొరంగ నిర్మాణాలేనని, మొదటి సొరంగ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, రెండో సొరంగ పనులు కూడా చురుకుగా కొనసాగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులను సందర్శించిన సీపీఐ బృందం శుక్రవారం వెలిగొండ ప్రాజెక్టును సందర్శించింది. ఈ సందర్భంగా సొరంగ నిర్మాణాలను పరిశీలించిన రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందనుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దాదాపు పూర్తయ్యే దశలో ఉందని, అయితే నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.2,900 కోట్లు ప్రాజెక్టుకు ఖర్చు చేసిందని, అయితే ఆ డబ్బులు సైతం కేంద్రం ఇవ్వడం లేదని తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కర్ణాటకలోని అప్పర్ తుంగభద్రకు రూ.5,300 కోట్లు కేటాయించారని విమర్శించారు. దీని వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోతుందన్నారు. ఈనెల 20 తేదీన పోలవరం ప్రాజెక్టును సందర్శించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ శాసనమండలి సభ్యుడు జల్లి విల్సన్, కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, హరినాథరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ దంపతుల హత్య కేసు
విచారణ ప్రారంభం

కోర్టు వద్ద భారీ పోలీసు భద్రత.. సతీష్ వాంగ్మూలం నమోదు



కోర్టు వద్ద అధికారులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణ ప్రారంభమయ్యింది. చిత్తూరు పాత న్యాయస్థానాల సముదాయంలోని ప్రత్యేక మహిళా న్యాయస్థానంలో న్యాయమూర్తి శాంతి విచారణను ప్రారంభించారు. 2015లో జరిగిన జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడు చింటూతో పాటు 22 మంది నిందితులు న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. అప్పట్లో జరిగిన ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న సతీష్ అనే వ్యక్తి జంట హత్యల సమయంలో తాను చూసిన విషయాలను న్యాయమూర్తి ఎదుట వివరించాడు. తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు విచారణ జరుగుతున్న సమయంలో కోర్టు వద్ద ఎలాంటి శాంతిభద్రతల సమస్య రాకుండా చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏఎన్‌యూని సందర్శించిన జగ్జీవన్‌రామ్ మనవడు



డాక్టర్ అన్షుల్ అవిజిత్‌ను సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ మనవడు డాక్టర్ అన్షుల్ అవిజిత్ శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)ని సందర్శించి వీసీ ఆచార్య రాజశేఖర్‌తో భేటీ అయ్యారు. వర్సిటీలో జరుగుతోన్న విద్య, పరిశోధన, మౌలిక వసతుల అభివృద్ధిని ఆయనకు వీసీ వివరించారు. ఆంగ్ల, సంస్కృత భాషల పరిజ్ఞానం ఆవశ్యకతతో పాటు పలు విద్యాపరమైన అంశాలనూ చర్చించారు. అన్షుల్ అవిజిత్‌ను వీసీ సత్కరించారు. వర్సిటీ అధికారులతో కలిసి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అవిజిత్ నివాళులర్పించారు. వర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రాన్ని అవిజిత్ సందర్శించి అక్కడ బాబూ జగ్జీవన్‌రామ్ జీవిత ఘట్టాలతో రూపొందించిన చిత్రాలు, బోర్డులను తిలకించారు. కేంద్రంలో జరుగుతున్న పరిశోధనాంశాలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ నివేదికతో రూపొందించిన పుస్తకాన్ని అవిజిత్‌కు బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య మధుబాబు అందజేశారు. రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, యూజీసీ కోఆర్డినేటర్ రత్నాకర్, పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ ఉదయకుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబుకు తగిన బుద్ధి చెప్పడం ఖాయం

873వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: మూడు పంటలు పండే భూములను లాక్కుని రైతులు, రైతు కూలీలను నట్టేట ముంచిన బాబుకు.. ఈ ప్రాంత ప్రజలు రాబోయే ఎన్నికల్లోనూ తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 873వ రోజు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. అమరావతిలో ఒక రాజధాని ఉద్యమం ఎప్పుడో చతికిలపడిపోయిందని, రైతులు, రైతు కూలీలు నేడు ఉపాధి కోసం ఊళ్లు వదిలి పనులు వెదుక్కోవాల్సిన దుస్థితి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో కులవాదంతో ఓ సామాజిక వర్గం ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని బాబును గద్దెనెక్కించేందుకు తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటని చెప్పారు. ఏపీలో బహుజనులకు విద్య, వైద్యం చేరువ చేసిన జగనన్న ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేసేందుకు పక్కా ఇళ్లను నిర్మాణం చేస్తుండడం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. నిపుణుల కమిటీలు సైతం వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సూచించాయని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికె వరప్రసాద్, పులి దాసు, బుదుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు స్థానం శూన్యం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామమూర్తి



మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామమూర్తి

విజయనగరం అర్బన్: వెనుకబడిన వర్గాల నాయకులను అణగదొక్కడమే తెలుగుదేశం అధినాయకత్వం లక్ష్యమని, అందుకు తానే నిలువెత్తు సాక్ష్యమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామమూర్తి అన్నారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచి టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేసిన అనుభవం ఉన్న తనను మాజీ ఎమ్మెల్యేలు చింతకాయల అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు ఎదగనీయకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. తాజాగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా సీటు ఇస్తామని చెప్పి ఓటర్ల నమోదుకు సంబంధించిన క్షేత్రస్థాయి ప్రక్రియలో వినియోగించుకుని ఇప్పుడు సీటు ఇవ్వలేదని వాపోయారు. బీసీలను ఎదగనీయకుండా చంద్రబాబు పార్టీని ఎన్నాళ్లు నడుపుతారని ప్రశ్నించారు. బీసీ నాయకులను ఓటు బ్యాంక్‌గా వాడుకోవడానికి తప్ప పదవులను ఇవ్వడానికి చంద్రబాబు ఇష్టపడరని విమర్శించారు.

వికేంద్రీకరణతోనే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి

మూడు రాజధానులపై పల్లెల్లో నాన్ పొలిటికల్ జేఏసీ విస్తృత ప్రచారం



పల్లెల్లో వారంతపు సంతల్లో మూడు రాజధానులపై అవగాహన కల్పిస్తున్న ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్

సాక్షి, అనకాపల్లి: వికేంద్రీకరణతోనే వెనుకబడిన ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్ చెప్పారు. ఆయన శుక్రవారం మూడు రాజధానులపై అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పల్లె పల్లెలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు మూడు రాజధానులతో అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రధాన ప్రతిపక్షపార్టీలు వక్రీకరిస్తూ ప్రచారం చేయడాన్ని తమ జేఏసీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తుంటాయని, ప్రజలకు మేలు కలిగేలా కొందరు సీఎంలు మాత్రమే వినూత్న నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. రాజకీయాలకతీతంగా మంచిని స్వాగతించాలని, చెడును వ్యతిరేకించాలని సూచించారు. అంతేగానీ రాష్ట్రానికి మంచి కలిగే మూడు రాజధానుల నిర్ణయంపై వ్యంగ్యంగా మాట్లాడడం సరికాదని హెచ్చరించారు. పైగా రాజకీయ అజెండాగా మార్చి వచ్చే ఎలక్షన్‌కు వెళ్లాలని జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ సవాలు విసరడం సరికాదన్నారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మకమైన బాధ్యత వహించాల్సిన పార్టీలు అందుకు విరుద్ధంగా ప్రకటనలివ్వడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ఒకేచోట అభివృద్ధి కేంద్రీకరించకుండా వ్యవహరిస్తేనే నవ్యాంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అన్ని ప్రాంతాలకు సమానంగా విస్తరిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన శివరామకృష్ణన్ కమిటీ తన నివేదికలో ప్రస్తావించిందని గుర్తుచేశారు. అంతేగానీ మూడు రాజధానుల విషయంలో రాజకీయ స్వార్థాలు లేవని చెప్పారు. వెనకబడిన ప్రాంత ప్రజలకు మేలుచేయకపోయినా ఫర్వాలేదుగానీ.. దయచేసి కీడు చేయవద్దని చేతులెత్తి కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

75 ఏళ్లు దాటితే యోగ్యతా పరీక్షలు పెట్టాలి: నిక్కీ హేలీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా పోటీ పడుతున్న వారిలో 75 ఏళ్ల వయసుకు పైబడి ఉంటే వారికి ఎంత వరకు ఆ పదవికి యోగ్యత ఉందో అమెరికన్లు తప్పనిసరిగా చూడాలని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయాల్లోకి కొత్త తరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ వాషింగ్టన్‌లో ఎందరో రాజకీయ నాయకులకు వయసు మీదపడిందన్నారు. కాంగ్రెస్‌కి ఎన్నికవాలంటే వయసు పరిమితి విధించాల్సిన ఆవశ్యకత ఉందని హేలీ అన్నారు. అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నికైన 75 ఏళ్లకు పైబడిన వారికి యోగ్యతా పరీక్షలు నిర్వహించాలని కొత్త ప్రతిపాదన చేశారు. మరోవైపు హేలీ అభిప్రాయాలను వైట్ హౌస్ కొట్టిపారేసింది. ఇప్పటికే అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతూ ఉండడం, వారి వయసు 75 దాటిపోవడంతో హేలీ చేసిన ప్రతిపాదనపై విమర్శలు మొదలయ్యాయి. ఇలాంటి వ్యాఖ్యలు, విమర్శలు, దాడులు గతంలో కూడా చూశామని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీనా జీన్ పియరే అన్నారు.

కారు కింద పడి.. 3 కి.మీ. ఈడ్చుకెళ్లి

యూపీ గ్రామంలో ఢిల్లీ తరహా ఘటన
22 ఏళ్ల యువకుడి బలి

బుదాన్ (యూపీ): దేశ రాజధాని ఢిల్లీలో కారు కింద పడ్డ యువతిని ఈడ్చుకొని కొన్ని కిలోమీటర్లు వెళ్లిన తరహా ఘటనలు తరచూ జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌కి వెళ్లిన ఒక యువకుడి నిండు ప్రాణాలు ఇలాగే బలయ్యాయి. యూపీ పోలీసులు అందించిన వివరాల ప్రకారం సిరసోలా గ్రామానికి చెందిన 22 ఏళ్ల వయసున్న ఉమేష్ కుమార్ శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు బయల్దేరగా వెనుక నుంచి వచ్చిన కారు అతనిని ఢీకొట్టింది. కారు బోనెట్‌పైకి ఎగిరి మళ్లీ కిందపడిన కుమార్ ముందువైపునున్న ఎడమ చక్రంలో ఇరుక్కుపోయారు. అయినా కూడా కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా 3 కి.మీ. ప్రయాణించాడు. దీనిని చూసిన స్థానికులు ఆ కారుని వెంబడించి అతనిని పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ కుమార్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు డ్రైవర్‌ని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

గ్లోబల్ వార్మింగ్‌కు... చంద్రధూళితో చెక్

భూమిపైకి వచ్చే సూర్యరశ్మిని తగ్గించడమే లక్ష్యం

- అందుకోసం అంతరిక్షంలో భారీగా ధూళిమేఘాలు
- భూమికి, సూర్యునికి మధ్య పరచాలంటున్న సైంటిస్టులు
- సాధ్యాసాధ్యాలపై జోరుగా చర్చ



చంద్రుడంటేనే చల్లదనానికి చక్కని ప్రతీక. అందుకే చల్లని రాజా అంటూ చందమామపై సినీ కవులు ఎన్నో పాటలు కూడా కట్టారు. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు నానాటికీ ప్రమాదకరంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అడ్డుకట్ట వేసి భూమిని చల్లబరిచేందుకు కూడా చంద్రుడు ఎంతో సాయపడగలడట. అమెరికా సైంటిస్టుల బృందమొకటి ఈ దిశగా వినూత్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. చంద్రధూళిని అంతరిక్షంలోకి వెదజల్లడం! తద్వారా భూమిపై పడే సూర్యరశ్మిని కొద్దిగా మళ్లించడం!! ఆ మేరకు భూమిని చల్లబరచడం..!!!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ ప్రతిపాదన...?

చంద్రునిపై ఉన్న ధూళిని భారీ పరిమాణంలో తవ్వి తీయాలి. దాన్ని సూర్యునికేసి వెదజల్లాలి. అది భారీ ధూళి మేఘాల రూపంలో కనీసం ఓ వారం పాటు సూర్యునికి, భూమికి మధ్యలో నిలిచి ఉండేలా చూడాలి. అది చెదిరిపోయాక చంద్రునిపై మరో దఫా తవ్వకం. మరో వారం పాటు సూర్యునికి, భూమికి మధ్యలో మరిన్ని ధూళి మేఘాలు. ఇలా మొత్తమ్మీద ఏటా ఏకంగా కోటి టన్నుల చంద్రధూళిని భూమికి, సూర్యునికి మధ్య మేఘాల రూపంలో వెదజల్లాలన్నది ప్రతిపాదన.

ఏమిటి సమస్య?

- చంద్ర ధూళిని అంతరిక్షంలో వెదజల్లడం వినడానికి బానే ఉన్నా అందుకు చాలా సాంకేతికత అవసరం. అంతేగాక సాంకేతిక, రాజకీయ సవాళ్లతోనూ, అంతకుమించి భారీ వ్యయ ప్రయాసలతోనూ కూడిన పని కూడా. ఎందుకంటే...
- అన్నింటికంటే ముందుగా చంద్రునిపై భారీ సైజులో ఓ శాశ్వత స్థావరం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత ధూళిని తవ్వి పోసే పరికరాలు తదితరాలను అక్కడికి చేరేసుకోవాలి.
- గత 50 ఏళ్లలో మనిషి చంద్రునిపై కాలు పెట్టలేదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇదంతా ఎంత కష్టమో అర్థమవుతుంది.
- రాజకీయంగా చూస్తే ఈ మొత్తం ప్రయోగానికి ఎవరు సారథ్యం వహించాలి, ఇందులో ఏ దేశం పాత్ర ఎంతమేరకు, ఎలా ఉండాలన్నది మరో పెద్ద ప్రశ్న. అంతరిక్షంపై ఆధిపత్యం కోసం ఇప్పటికే పెద్ద దేశాల మధ్య పోటీ ఉద్రిక్తతలకు దారితీస్తున్న వేళ కేవలం ఓ పర్యావరణ లక్ష్యసాధన కోసం అభిజాత్యాలను పక్కన పెట్టి అవన్నీ ఏ మేరకు కలిసొస్తాయన్నది అనుమానమే.
- అంతరిక్షంలో భూమికి, సూర్యునికి మధ్య ప్రాంతమంతా పలు దేశాలు ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహాలతో నిండిపోయి ఉంది!
- ఇన్ని కష్టాలూ పడి ఒకవేళ విజయవంతమైనా ధూళిని వెదజల్లే ఉపాయం తాత్కాలిక ఫలితాలే ఇస్తుంది తప్ప గ్లోబల్ వార్మింగ్‌కు శాశ్వతంగా అడ్డుకట్టు వేసే స్థాయిలో దీర్ఘకాలికంగా పెద్దగా ప్రయోజనం కన్పించకపోవచ్చని కొందరు సైంటిస్టులు పెదవి విరుస్తున్నారు

చంద్రధూళే ఎందుకు?

- భూమిపై పడే సూర్యరశ్మి పరిమాణాన్ని కొంత మేరకు తగ్గించడం ద్వారా భూమిని చల్లబరచాలన్న ప్రతిపాదనలు ఎంతోకాలంగా ఉన్నవే. దీన్ని సోలార్ జియో ఇంజనీరింగ్, సోలార్ రేడియేషన్ మేనేజ్‌మెంట్‌గా పిలుస్తున్నారు.
- భూ వాతావరణపు పై పొరలోకి వాయు కణాలతో కూడిన సన్నని లేయర్‌ను పంపి భూమిపైకి వచ్చే సూర్యరశ్మిని కొద్దిమేరకు అడ్డుకోవాలన్న ప్రతిపాదనపై విస్తృతంగా చర్చ జరిగింది. కానీ ఇది ఆచరణ సాధ్యం కాదని, ఇలా వాతావరణపు పొరలతో చెలగాటమాడితే భూమిపై పలు ప్రాంతాల్లో వర్షపాతం తదితరాలు తీవ్రంగా ప్రభావితం కావచ్చన్న భయాల నేపథ్యంలో దానిపై ముందడుగు పడలేదు.
- మరికొందరు అంతరిక్షంలో భారీ అద్దాలు, లేదా ఫిల్టర్లను ఉంచాలని సూచించినా అవేవీ పెద్దగా ఆకట్టుకోలేదు.
- అదే చంద్రధూళిని వాడుకోగలిగితే ఇలాంటి సమస్యలేవీ లేకుండానే దిగ్విజయంగా పని పూర్తవుతుందన్నది తాజా యోచన.
- ఎందుకంటే చంద్రుని ఉపరితలంపై అది అపారంగా అందుబాటులో ఉంది.
- గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉండే చంద్రుని పై నుంచి ధూళి మేఘాలను అంతేగాక భూమి పై నుంచి జరిపే ఏ ప్రయోగంతో పోల్చినా అత్యంత తక్కువ వ్యయ ప్రయాసలతో సులువుగా అంతరిక్షంలోకి తరలించవచ్చు.

బీబీసీలో ఆర్థిక అవకతవకలు జరిగాయ్

కీలక ఆధారాలు లభించాయన్న సీబీడీటీ

న్యూఢిల్లీ: బీబీసీ గ్రూప్‌లో ఆదాయ పన్ను శాఖ జరిపిన సర్వేలో కీలకమైన ఆధారాలు లభించాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. కొన్ని సంస్థలు చూపిస్తున్న ఆదాయం, లాభాలు భారత్‌లో వారి కార్యకలాపాలకు అనుగుణంగా లేవని, దాని విదేశీ సంస్థల చెల్లింపులపై కట్టాల్సిన పన్నుల్ని ఎగవేసిందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉద్యోగులిచ్చిన వాంగ్మూలాలు, డిజిటల్ ప్రూఫ్‌లు, సేకరించిన డాక్యుమెంట్ల ద్వారా ఆ గ్రూప్‌లో భారీగా ఆర్థిక అవకతవకలు, పన్ను ఎగవేతలు చేసినట్టుగా ఆదాయ పన్ను శాఖ అధికారులు గుర్తించారని తెలిపింది. ప్రైసింగ్ డాక్యుమెంటేషన్ బదిలీకి సంబంధించి ఎన్నో వ్యత్యాసాలు, అవకతవకలు జరిగినట్టుగా ఐటీ సర్వేలో తేలిందని ఆ ప్రకటన వివరించింది. పన్ను చెల్లింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఐటీ శాఖ సర్వే సమయంలో మందకొడిగా వ్యవహరిస్తూ ప్రతీది ఆలస్యం చేసే వ్యూహాలు రచించిందని ఆరోపించింది. ఢిల్లీ, ముంబై కార్యాలయాల్లో ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు దాదాపు 60 గంటలు ఐటీ శాఖ సర్వే నిర్వహించింది. 2002 గుజరాత్ మతఘర్షణలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బాధ్యుడిగా ఆరోపిస్తూ ''ఇండియా ది మోదీ క్వశ్చన్'' పేరిట బీబీసీ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజుల్లోనే ఐటీ శాఖ సర్వే జరపడం చర్చనీయాంశంగా మారింది.

భారత్‌లో 450 మందికి గూగుల్ ఉద్వాసన !

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్‌లో కూడా లే ఆఫ్‌ల పర్వం మొదలైంది. భారత్‌లో ఒకేసారి 450 మందిని ఇంటికి పంపించింది. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టుగా గురువారం అర్ధరాత్రి దాటాక ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించింది. గూగుల్ ఇండియా చీఫ్ సంజయ్ గుప్తా 450 మంది ఉద్యోగులకి ఉద్వాసన పలుకుతూ ఈ మెయిల్స్ పంపించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ గత నెలలో 12 వేల ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్టుగా ప్రకటించింది. అందులో భాగంగానే భారత్‌లో ఉద్యోగుల్ని తొలగించారా లేదంటే ఈ ఉద్యోగుల తొలగింపు అదనంగా చేశారా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మారుతున్న ఆర్థిక పరిస్థితులతో సంస్థ నష్టాలు చవిచూడాల్సి వస్తూ ఉండడంతో 12 వేల మందిని తొలగించడానికి నిర్ణయించుకున్నట్టు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ వెల్లడించారు. మరోవైపు గూగుల్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారు లింక్డిన్ వేదికగా ఈ విషయంపై పోస్టులు ఉంచుతున్నారు. రాత్రికి రాత్రి ఉద్యోగం కోల్పోవడంతో కొత్త ఉద్యోగాలు వెతుక్కోవాల్సి వస్తోందన్నారు.

ట్విటర్ ఢిల్లీ ముంబై కార్యాలయాలు మూసివేత

సామాజిక మాధ్యమం ట్విటర్‌ను బిలియనీర్ ఎలన్‌మస్క్ కొనుగోలు చేసిన దగ్గర్నుంచి ఆ కంపెనీకి కష్టాలు తీరడం లేదు. కాస్ట్ కటింగ్ చర్యల్లో భాగంగా భారత్‌లోని మూడు కార్యాలయాల్లో రెంటింటిని మూసివేసింది. ఢిల్లీ, ముంబైలో కార్యాలయాలను మూసివేస్తున్నట్టుగా ప్రకటించిన ట్విటర్ ఉద్యోగుల్ని వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని ఆదేశాలిచ్చింది. బెంగళూరులో కార్యాలయాన్ని మాత్రం కొనసాగిస్తుంది. 2023 చివరి నాటికి ట్విటర్‌ను ఆర్థికంగా గాడిలో పెట్టాలన్న లక్ష్యంతో ఉన్న మస్క్ ప్రపంచ వ్యాప్తంగా పలు కార్యాలయాలను మూసివేస్తున్నారు. గత ఏడాది చివర్లో భారత్‌లో ఉన్న ఉద్యోగుల్లో 90% మందిని ట్విటర్ తొలగించిన విషయం తెలిసిందే.

ఇప్పటికే మైక్రోసాఫ్ట్ 10 వేలు, అమెజాన్ 18 వేలు,, ఫేస్‌బుక్‌కు చెందిన మెటా 11 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

"రైజినా డైలాగ్"కు ఇరాన్ దూరం

న్యూఢిల్లీ: భారత్‌లో వచ్చే నెలలో జరిగే ''రైజినా డైలాగ్'' సదస్సుకు ఇరాన్ హాజరు కావడం లేదు. ఈ సదస్సుకి హాజరుకావాల్సిన ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్ అబ్దుల్లా భారత పర్యటనను రద్దు చేసుకున్నారు. విదేశాంగ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న రైజినా డైలాగ్‌పై ప్రచార వీడియోలో ఇరాన్‌లో హిజాబ్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ఒక మహిళ జుట్టు కట్ చేసుకుంటున్న విజువల్స్ ఉన్నాయి. ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైజీ ఫొటో పక్కనే, మహిళ జుట్టు కత్తిరించుకుంటున్న దృశ్యం ఆ వీడియోలో ఉండడంపై ఇరాన్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యక్షుడితో పాటు నిరసనకారుల్ని చూపించడాన్ని ఆక్షేపించిన భారత్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం ప్రచార వీడియోలో ఆ భాగాన్ని తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం దానిని తొలగించకపోవడంతో మనస్తాపానికి గురైన ఇరాన్ ఈ సదస్సుకి హాజరుకాబోవడం లేదని తేల్చి చెప్పింది. అంతర్జాతీయ వ్యవహారాలపై లోతైన చర్చ జరపడానికి 2016 నుంచి కేంద్ర ప్రభుత్వం రైజినా డైలాగ్స్‌ను నిర్వహిస్తోంది.

షిండే వర్గానిదే శివసేన



పార్టీ పేరు.. విల్లు, బాణం గుర్తు ఆ వర్గానికే సొంతం

- 2019లో 76 శాతం ఓట్లు షిండే వర్గం ఎమ్మెల్యేలకే దక్కాయి
- పార్టీ రాజ్యాంగ సవరణ గురించి మాకు సమాచారం లేదు
- 78 పేజీల ఉత్తర్వు జారీ చేసిన ఎన్నికల సంఘం
- ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో అధికార శివసేన పార్టీలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి పెద్ద షాక్ తగిలింది. శివసేన పేరు, పార్టీ ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయని ఎన్నికల సంఘం శుక్రవారం తేల్చిచెప్పింది. ఈ మేరకు త్రిసభ్య కమిషన్ ఏకగ్రీవంగా 78 పేజీల ఉత్తర్వు జారీ చేసింది. గత ఏడాది మధ్యంతర ఉత్తర్వులో ఇచ్చిన శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పేరును, కాగడా గుర్తును ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికలు పూర్తయ్యేదాకా ఉద్ధవ్ ఠాక్రే వర్గం వాడుకోవచ్చని సూచించింది. పార్టీ పేరును, ఎన్నికల గుర్తును తమకే కేటాయించాలని కోరుతూ షిండే వర్గం ఆరు నెలల క్రితం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. పిటిషన్ సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన త్రిసభ్య కమిషన్ షిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది.

పార్టీ రాజ్యాంగ సవరణ అప్రజాస్వామికం

'పార్టీ రాజ్యాంగ పరీక్ష, మెజారిటీ పరీక్ష' సూత్రాల ఆధారంగా ఉత్తర్వును ఖరారు చేశామని ఎన్నికల సంఘం వెల్లడించింది. 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన తరఫున 55 మంది నెగ్గారని, వీరందరికీ పడిన ఓట్లలో 76 శాతం ఓట్లు షిండే వర్గంలో ఉన్న ఎమ్మెల్యేలకు దక్కాయని గుర్తుచేసింది. ఠాక్రే వర్గం ఎమ్మెల్యేలకు కేవలం 23.5 శాతం ఓట్లు పడ్డాయని వివరించింది. పార్టీ పేరు, గుర్తు తమదేనని చెప్పుకోవడానికి ఠాక్రే వర్గం 2018 నాటి 'పార్టీ రాజ్యాంగం'పై ఆధారపడుతోందని, కానీ, రాజ్యాంగ సవరణ గురించి తమకు తెలియజేయలేదని ఆక్షేపించింది. 2018లో చేసిన సవరణ తమ వద్ద రికార్డు కాలేదని తెలిపింది. ఠాక్రే వర్గం బలంగా నమ్ముతున్న శివసేన పార్టీ రాజ్యాంగాన్ని అప్రజాస్వామికం అని తాము భావిస్తున్నట్లు వెల్లడించింది. తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి ఎలక్టోరల్ కాలేజీని తానే నామినేట్ చేసేలా రాజ్యాంగంలో మార్పులు చేశారని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఇది విరుద్ధమని ఎన్నికల సంఘం తెలియజేసింది. షిండే వర్గానికి గత ఏడాది అక్టోబర్‌లో కేటాయించిన 'బాలాసాహెబంచీ శివసేన' పేరును, 'రెండు కత్తులు, డాలు' గుర్తును స్తంభింపజేస్తున్నామని, ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని, ఇకపై వాడుకోవానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం తాజా నిర్ణయంతో శివసేనపై ఠాక్రే కుటుంబం పూర్తిగా పట్టు కోల్పోయినట్లయ్యింది.

సత్యానికి దక్కిన విజయం: షిండే

ఎన్నికల సంఘం ఉత్తర్వు పట్ల ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే హర్షం వ్యక్తం చేశారు. ఇది సత్యానికి దక్కిన విజయం, ప్రజల గెలుపు అని అభివర్ణించారు. బాలాసాహెబ్ బాల్ ఠాక్రే ఆశీస్సులతో శివసేన పేరు, ఎన్నికల గుర్తు తమకు లభించాయని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నెంబర్లే కీలకమని అన్నారు. ఆ నంబర్లు తమవద్ద ఉన్నాయని ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యంలో మెజార్టీని పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. ఎన్నికల సంఘానికి షిండే కృతజ్ఞతలు తెలిపారు. బాలాసాహెబ్ ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని గత ఏడాది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. అసలైన శివసేనకు షిండే సారథ్యం వహిస్తున్నట్లు నిరూపితమైందని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వివరించారు.

సుప్రీంకోర్టులో సవాలు చేస్తాం: ఉద్ధవ్ ఠాక్రే

శివసేనను షిండే వర్గానికి కట్టబెడుతూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగిస్తుందని ఉద్ధవ్ ఠాక్రే ఆందోళన వ్యక్తం చేశారు. తమ విల్లు, బాణం గుర్తును షిండే వర్గం కాజేసిందని, దీనిపై ప్రజలు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఇక మిగల్లేదని, నిరంకుశత్వం మొదలైనట్లు ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఉద్ధవ్ ఠాక్రే సూచించారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారు: సంజయ్ రౌత్

షిండే వర్గానిదే అసలైన శివసేన అంటూ ఎన్నికల సంఘం తేల్చిచెప్పడం పట్ల ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుపై ప్రజల్లోకి వెళ్లి న్యాయం కోరుతామని చెప్పారు. పై నుంచి వచ్చిన ఒత్తిళ్లతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘంపై తనకు నమ్మకం లేదన్నారు. ఇది 'డబ్బు సంచుల విజయం' అంటూ షిండే వర్గం ఎమ్మెల్యేలపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసలేం జరిగింది!

- భూమి పుత్రుల నినాదంతో శివసేనను 1966లో దివంగత బాల్ ఠాక్రే స్థాపించారు.
- ప్రధానంగా హిందూత్వ నినాదంతో శివసేన ప్రస్థానం సాగింది. 2019 వరకూ బీజేపీతో స్నేహం చేసింది.
- బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే 2019లో బీజేపీ కూటమి నుంచి విడిపోయారు. ఎన్సీపీ, కాంగ్రెస్ మద్దతుతో 'మహా వికాస్ అఘాడీ' కూటమి పేరిట మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రిగా కుర్చీ ఎక్కారు.
- 2022 జూన్‌లో శివసేన పార్టీ షిండే, ఠాక్రే వర్గాలుగా విడిపోయింది. మెజార్టీ ఎమ్మెల్యేలు, నేతలు షిండేకు మద్దతుగా నిలిచారు. నాటకీయ పరిణామాల మధ్య బీజేపీ మద్దతుతో షిండే అధికారంలోకి వచ్చారు. అప్పటినుంచి పార్టీ పేరు, గుర్తుపై ఇరు వర్గాల మధ్య పోరాటం మొదలైంది.
- వివాదం ఎన్నికల సంఘానికి చేరింది. విల్లు, బాణం గుర్తును ఎన్నికల సంఘం స్తంభింపజేసింది. షిండే వర్గానికి 'రెండు కత్తు, డాలు', ఠాక్రే వర్గానికి కాగడా గుర్తును, రెండు వర్గాలకు వేర్వేరు పేర్లను కేటాయించింది.
- ఎన్నికల సంఘం నిర్ణయాన్ని కొట్టివేయాలని కోరుతూ ఠాక్రే వర్గం గత ఏడాది నవంబర్‌లో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వారి విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది.
- పార్టీ పేరు, ఎన్నికల గుర్తుపై తమకే పూర్తి అధికారం ఉందంటూ ఇరు వర్గాలు ఎన్నికల సంఘానికి గత నెలలో లేఖ రాశాయి. తమ వాదనను వినిపించాయి.

నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు లేదు

ఢిల్లీ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నామినేటెడ్ సభ్యులకు ఈ ఎన్నికలో ఓటు వేసే హక్కు లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీల సభ్యుల ఎన్నిక తేదీని ఖరారు చేయడానికి వీలుగా ఎంసీడీ మొదటి సమావేశం నిర్వహించడానికి 24 గంటల్లోగా నోటీసు జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తొలుత మేయర్‌ను ఎన్నుకోవాలని పేర్కొంది. డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవడానికి ప్రిసైడింగ్ అధికారిగా మేయర్ వ్యవహరిస్తారని వెల్లడించింది. ఢిల్లీ మేయర్ ఎన్నికల ఇప్పటికే మూడుసార్లు విఫలమైన సంగతి తెలిసిందే. నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు ఉందని బీజేపీ వాదిస్తుండగా, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) వ్యతిరేకిస్తోంది. మేయర్ ఎన్నిక త్వరగా నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నామినేటెడ్ సభ్యుల కూడా ఓటు హక్కు ఉందంటూ లెఫ్టినెంట్ గవర్నర్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనను ధర్మాసనం తిరస్కరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఆర్ కింద అందుకు అవకాశం లేదని తేల్చిచెప్పింది. రెండు నెలల క్రితం జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మెజారిటీ సాధించింది. మొత్తం 250 వార్డులకుగాను ఆ పార్టీ 134 వార్డులు గెలుచుకుంది. బీజేపీ 104 స్థానాలకే పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 9 వార్డులు దక్కించుకుంది.

తైవాన్‌లో చైనా బెలూన్ కలకలం

తైపీ: తైవాన్‌లో చైనా బెలూన్ తీవ్ర కలకలం సృష్టించింది. చైనా ప్రయోగించిన బెలూన్ తమ భూభాగంలో ల్యాండ్ అయ్యిందని తైవాన్ రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. చైనాలోని తైయువాన్ సిటీలో ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి చెందిన పరికరాలు ఇందులో ఉన్నట్లు గుర్తించామని పేర్కొంది. చైనాలో అంతర్భాగమైన ఫుజియాన్ ప్రావిన్స్ తీరానికి సమీపంలోని తమ మాత్సూ ఐలాండ్‌లో భాగమైన తూంగ్‌యిన్‌లో ఈ బెలూన్ నేలపైకి దిగినట్లు తెలియజేసింది. ఈ ఉదంతంపై చైనాలోని తైయువాన్ వైర్‌లెస్(రేడియో) ఫస్ట్ ఫ్యాక్టరీ లిమిటెడ్ అధికారి స్పందించారు. ఆ బెలూన్‌లోని ఎలక్ట్రానిక్ పరికరాలు మాత్రమే తాము అందజేశామని, బెలూన్‌ను తాము తయారు చేయలేదని పేర్కొన్నారు. ఆ కంపెనీ చైనా వాతావరణ శాఖకు అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. తైవాన్ భూభాగంలో దిగిన బెలూన్ వాతావరణాన్ని పరిశీలించేందుకు ప్రయోగించినదేనని స్పష్టం చేశారు. ఇలాంటి బెలూన్లు తైవాన్ జలసంధిపై ఎగరడం సాధారణమేనని, ఇప్పుడు మాత్రమే దీనిపై అందరి దృష్టి పడిందని వివరించారు. చైనా బెలూన్‌ను ఇటీవల అమెరికా కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇరు దేశాల నడుమ మాటల యుద్ధం సాగుతోంది.

ఎయిరిండియాకు 6,500 మంది పైలట్లు కావాలి

ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాల కొనుగోలు

ముంబై: టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా సంస్థ ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాలు కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ విమానాలు నడిపించడానికి 6,500 మందికిపైగా పైలట్లు అవసరమని విమానయాన పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 113 విమానాలు ఉన్నాయి. దాదాపు 1,600 మంది పైలట్లు పనిచేస్తున్నారు. పైలట్ల కొరత వల్ల ఇటీవల పలు సందర్భాల్లో అల్ట్రా–లాంగ్ హాల్ విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. కొన్ని విమానాల ప్రయాణాల్లో ఆలస్యం చోటుచేసుకుంది. ఎయిరిండియా అనుబంధ సంస్థలైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఆసియా ఇండియాలో 54 ఫ్లైట్లు ఉండగా, దాదాదాపు 850 మంది పైలట్లు సేవలందిస్తున్నారు. విస్తారా ఎయిర్‌లైన్స్‌లో 53 విమానాలు, 600 మందికిపైగా విమాన చోదకులు ఉన్నారు. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఆసియా ఇండియా, విస్తారా సంస్థల్లో కలిపి 220 విమానాలు ఉన్నాయి. 3,000 మందికిపైగా పైలట్లు పనిచేస్తున్నారు.

'స్టాక్ మార్కెట్ల'పై సుప్రీంకోర్టు కమిటీ

సీల్డ్ కవర్‌లో కేంద్రం చేసిన సూచనలను తిరస్కరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లపై నియంత్రణ చర్యలను బలోపేతం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను సీల్డ్ కవర్‌లో స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. మదుపరుల ప్రయోజనాలను కాపాడే విషయంలో పూర్తి పారదర్శకత కావాలని తాము కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రతిపాదిత నిపుణుల కమిటీ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి సిట్టింగ్ జడ్జిని నియమించడం సాధ్యం కాదని పేర్కొంది. అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత మదుపరులు భారీగా నష్టపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లపై నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని, ఇందుకోసం సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని, మదుపరుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, ఎంఎల్ శర్మతోపాటు పలువురు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు(పిల్స్) దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస జేబీ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. నియంత్రణ చర్యలను బలోపేతం చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కమిటీ సభ్యుల పేర్లు, విధివిధానాలను శుక్రవారం సీల్డ్ కవర్‌లో అందజేయగా, ధర్మాసనం స్వీకరించలేదు. ప్రభుత్వం సూచించిన సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తే అది పూర్తిగా ప్రభుత్వ కమిటీ అవుతుందని అభిప్రాయపడింది. పారదర్శకత కావాలి కాబట్టి తామే ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, తద్వారా న్యాయస్థానంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని వెల్లడించింది. ఇకపై సిట్టింగ్ న్యాయమూర్తులు ఈ అంశాన్ని విచారిస్తారని, కమిటీలో మాత్రం వారు సభ్యులుగా ఉండబోరని తెలిపింది.

రాజస్తాన్‌లో కిడ్నాప్.. హరియాణాలో హత్య

జైపూర్: హరియాణాలో అత్యంత దారుణమైన ఘటన జరిగింది. గో సంరక్షకులుగా అనుమానిస్తున్న కొందరు రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు ముస్లింలను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్టు ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత వారిద్దరి కాలిన మృతదేహాలు ఒక కారులో లభించడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన అరడజను మందికిపైగా బజరంగ్ దళ్ కార్యకర్తల్ని రాజస్తాన్ పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. ఈ హత్యలను రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఖండించారు. ఈ దారుణానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లా ఘట్‌మీక గ్రామానికి చెందిన నజీర్ (25), జునైద్ అలియాస్ జునా (35)లను బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. గురువారం వారిద్దరి మృతదేహాలు హరియాణాలోని భివానిలో లోహారు ప్రాంతంలో ఒక దగ్ధమైన కారులో కనిపించాయి. బజరంగ్ దళ్ కార్యకర్తలు ఆ ఇద్దరు ముస్లిం యువకుల్ని కిడ్నాప్ చేశారని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు అరడజనుకుపైగా బజరంగ్‌దళ్ కార్యకర్తల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ''వారికి ఈ నేరంలో ప్రమేయం ఉందో లేదో తేలాల్సి ఉంది'' అని పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ గౌరవ్ శ్రీవాస్తవ చెప్పారు. మృతి చెందిన వారిలో జునైద్‌కి నేరచరిత్ర ఉందని, ఐదుకి పైగా కేసుల్లో అతను నిందితుడని చెప్పారు. రింకూ సైనీ అనే నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

రష్యా రక్షణ శాఖ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రభుత్వంలోని మరో ఉద్యోగిని అనుమానాస్పదంగా మృతి చెందారు. రక్షణ శాఖలో పని చేస్తున్న 58 ఏళ్ల మరీనా యాంకినా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అపార్ట్‌మెంట్‌లో 16వ అంతస్తులో ఉన్న తన నివాసం కిటికీ నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయారు. ఆమె ప్రమాదవశాత్తూ పడిపోయారా, ఆత్మహత్య చేసుకున్నారా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. 160 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోవడంతో ఆమె వెంటనే ప్రాణాలు కోల్పోయారు. రక్తపు మడుగులో ఉన్న మరీనాను ఆ మార్గం నుంచి వెళుతున్న వారు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రష్యా అధ్యక్షుడు ఉక్రెయిన్‌పై జరిపే యుద్ధంలో నిధుల సేకరణలో మరీనా అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం : 18 ఫిబ్రవరి : 2023



అందగత్తెల సందడి

శుక్రవారం బెంగళూరు కోరమంగళలో ఓ కార్యక్రమంలో నటి హర్షిక, మోడల్స్ హొయలు

న్యూస్‌రీల్

అలరిస్తున్న మలబార్ మేళా



ఆభరణాలతో మోడల్స్

సాక్షి, బెంగళూరు: ప్రముఖ స్వర్ణాభరణాల షోరూంల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిర్వహిస్తున్న బ్రైడల్ జ్యువెల్లరీ షో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నెల 11న బెంగళూరులోని డికెన్సన్ రోడ్డులోని సంస్థ షోరూమ్‌లో ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆదివారం సాయంత్రం వరకు జరగనుంది. విలువైన రాళ్లతో పొదిగిన వివాహ ఆభరణాలను ఇందులో ప్రదర్శిస్తున్నారు. అత్యద్భుతమైన ఆభరణాలను కొనుగోలు చేసే అవకాశంతోపాటు కనువిందు చేసే నగలను తిలకించవచ్చని ప్రతినిధులు తెలిపారు.

కాలేజీ ఉత్సవాల్లో విషాదం.. విద్యార్థిని మృతి

మైసూరు: 20 ఏళ్లు కూడా దాటని బాలలు, యువతీ యువకులు ఆకస్మికంగా కన్నుమూసే ఉదంతాలు తరచూ ఏదో ఒకచోట జరుగుతున్నాయి. కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థిని డ్యాన్స్ చేస్తూ కిందపడి ప్రాణాలు వదిలిన విషాద ఘటన మైసూరు జిల్లాలోని టి. నరసిపుర పట్టణంలో ఉన్న విద్యోదయ కాలేజీలో జరిగింది. ద్వితీయ పీయూసీ విద్యార్థిని నమిత (16) మృతురాలు. కళాశాలలో గురువారం సాయంత్రం జరిగిన వార్షికోత్సవంలో విద్యార్థినులతో కలిసి ఆమె ఉల్లాసంగా నృత్యాలు చేసింది. ఇంతలో హఠాత్తుగా కుప్పకూలిపోయింది. వెంటనే ఆక్కడి నుంచి ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థిని మరణంతో కాలేజీలో విషాద వాతావరణం నెలకొంది.

త్రినేశ్వర ఆలయానికి బంగారు శివుడు



మైసూరు: మైసూరు మహా నగరం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. నగరంలోని అంబా విలాస్ ప్యాలెస్ ఆవరణంలో ఉన్న త్రినేశ్వర దేవాలయానికి 11 కిలోల బంగారంతో చేసిన శివుడి ముఖాన్ని జిల్లా ట్రెజరీ నుంచి బందోబస్తు మధ్య పరిపాలన మండలి జెడీ సుబ్రమణ్యం, తహసీల్దార్ కృష్ణ, ప్యాలెస్ ఏసీపీ చంద్రశేఖర్ తదితరులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పండితులు సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి బంగారు ముఖానికి ప్రత్యేక అలంకరణ పూజలు చేస్తారు.

పురుష ఎమ్మెల్యేకు శ్రీమతి హోదా

శివాజీనగర: చిత్తాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రియాంక ఖర్గేను శ్రీమతి అని సంబోధించడం నవ్వులు పూయించింది. ఈయన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడన్నది తెలిసిందే. ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఒక కార్యక్రమం ఆహ్వాన పత్రికలో విధానసభ సచివాలయం ఆయన పేరు ముందు శ్రీమతి అని పేర్కొంది. ఆయన పేరును బట్టి సిబ్బంది మహిళగా భావించడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ తతంగం సోషల్ మీడియాలో నవ్వులపాలైంది. ఈ వ్యవహారంపై ప్రియాంక ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిరుత ప్రత్యక్షం

- భయాందోళనలో గ్రామస్తులు



తుమకూరు: రాష్ట్రంలో చిరుత పులుల సంచారం పెరిగిపోయింది. తాజాగా తుమకూరు నగరానికి సమీపంలో ఉన్న దేవరాయ పట్టణంలో చిరుత కనిపించడంతో ప్రజలు వణికిపోతున్నారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో దేవరాయణ పట్టణంలో చిరుత కనిపించింది. ఓ ఇంటి గోడమీద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలను స్థానికులు వీడియోలు, ఫొటోలు తీశారు. ఇదే వేళలో వీధి కుక్కలు గట్టిగా వెంటపడి తరమడంతో చిరుత అడవిలోకి పారిపోయింది. చిరుత గ్రామంలోకి రావడం స్థానికులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది చిరుత కోసం గాలిస్తున్నారు.

వచ్చేసింది ఎన్నికల బడ్జెట్

రూ. 3.09 లక్షల కోట్లతో 2023–24 రాష్ట్ర బడ్జెట్

- రైతులకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణం
- పలు వర్గాలకు సంక్షేమ పథకాలు



బడ్జెట్ ప్రకటిస్తున్న సీఎం బొమ్మై



శివాజీనగర: రానున్నవి అత్యంత ముఖ్యమైన అసెంబ్లీ ఎన్నికలు, కాబట్టి బడ్జెట్‌లో వరాలు ఎక్కువగా ఉండాలి, వడ్డింపులు తక్కువగా వేయాలి, అదే రీతిలో సీఎం బసవరాజ బొమ్మై 2023–24వ సంవత్సర బడ్జెట్‌ను రూపొందించారు. అన్నదాతలకు, మహిళలకు, విద్యార్థినులకు, అసంఘటిత రంగ కార్మికులకు, బీసీలకు, ఎస్సీలకు ఇలా అందరికీ సంక్షేమ పథకాలను ప్రకటించారు. శుక్రవారం విధానసభలో సీఎం బొమ్మై నూతన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పద్దు మొత్తం రూ 3,09,182 కోట్లని తెలిపారు. కొత్తగా ఎలాంటి పన్నులను వేయడం లేదని చెప్పారు. గత 2022–23 బడ్జెట్ రూ. 2,65,720 కోట్లు మాత్రమే. అంటే గత పద్దుతో పోలిస్తే రూ. 43,462 కోట్లు పెరిగిందని తెలిపారు. రైతుకు ఇచ్చే సున్నా వడ్డీ రుణాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. మహిళలకు నెలకు రూ.500 లభించేలా గృహశక్తి పథకాన్ని ప్రకటించారు.

బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు

- కన్నడ చిత్రరంగానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా రాష్ట్రంలోని ద్వితీయస్థాయి నగరాల్లో 200 సీట్ల సామర్థ్యం కలిగిన మినీ థియేటర్ల నిర్మాణానికి సాయం.
- రాష్ట్ర స్మార్ట్ సిటీ పథకానికి రూ. 5,900 కోట్ల కేటాయింపులు. ఈ పథకం కింద తుమకూరు, బెంగళూరు, దావణగెరె, శివమొగ్గ తదితర ఏడు నగరాల్లో అభివృద్ధి పనులు.
- వెనకబడిన వర్గాల సమగ్రాభివృద్ధి కోసం రూ. 1,600 కోట్లు.
- రాష్ట్రంలోని 29 ప్రాంతాల్లో మైనార్టీ విద్యార్థుల కోసం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధనతో పాటు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరిట హాస్టళ్ల ఏర్పాటు
- ఇక ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి రూ. 1,842 కోట్లు కేటాయింపులు. ఎస్సీ, ఎస్టీ యువత స్వయం ఉపాధి నిమిత్తం మూడు చక్రాల సరుకు రవాణా వాహనాల కొనుగోలు కోసం రూ. 50 వేల ఆర్థిక సాయం.
- ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ సేవలు, ప్రభుత్వ గణాంకా భద్రత కోసం సైబర్ నిపుణులు, ఆధునిక సాంకేతికత ఏర్పాటు కోసం త్వరలో 24/7 సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ కేంద్రాల ఏర్పాటు.
- వ్యవసాయ రంగానికి రూ. 39,031 కోట్లు కేటాయింపులు.
- సిరిధాన్యాల ఉత్పత్తి చేసే రైతులను ప్రోత్సహించేందుకు రైతుసిరి పేరిట ప్రతి హెక్టార్‌కు రూ. 10 వేల ఆర్థిక సాయం.
- మహిళల సాధికారత కోసం గృహిణి శక్తి పథకం ప్రారంభం. ఈ పథకం కింద భూమి లేని మహిళ వ్యవసాయ కార్మికులకు ప్రతి నెల చెరో రూ. 500 ఆర్థిక సాయం. అలాగే ఇంట్లోనే లాభదాయక పరిశ్రమలను ప్రారంభించేలా లక్ష మంది మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ.
- రాష్ట్రంలో శివమొగ్గ, విజయపుర, హాసన్, రాయచూరు, కారవారల్లో ఐదు విమానాశ్రయాల ఏర్పాటు. ఈ ఏడాది శివమొగ్గ, విజయపురల్లో విమానాశ్రయాల ప్రారంభం. మైసూరు విమానాశ్రయం అభివృద్ధికి రూ. 320 కోట్లు.
- కృష్ణా ఎత్తిపోతల పథకం మూడో దశ పనులకు రూ. 5 వేల కోట్లు కేటాయింపు. కళసా బండూరి ప్రాజెక్టుకు రూ. వెయ్యి కోట్లు,
- మొత్తం 38 జల వనరుల ప్రాజెక్టులకు రూ. 11,236 కోట్లు కేటాయింపులు..
- ప్రభుత్వ పీయూ, డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఫీజు నుంచి మినహాయింపు. 8 లక్షల విద్యార్థులకు అనుకూలం.
- బెంగళూరులో మహిళల కోసం పబ్లిక్ షీ–టాయిలెట్లు
- పోలీసు స్టేషన్ల ఆధునీకరణకు రూ. 250 కోట్లు.
- మైనార్టీ విద్యార్థుల విదేశాల్లో చదువు కోసం సున్నా వడ్డీతో రూ. 20 లక్షల రుణం
- బీదర్, రాయచూరు నగరసభలు మహాపాలికెలుగా అప్‌గ్రేడ్
- బళ్లారి విమానాశ్రయానికి రూ.320 కోట్లు.



విధానసభలో బడ్జెట్ సమావేశం

మిగులు బడ్జెట్ ఇది: సీఎం

బనశంకరి: ఆర్థిక నిర్వహణలో అత్యంత పారదర్శకత పాటించి సుమారు రూ.402 కోట్ల మిగులుతో కూడిన బడ్జెట్ ఇదని సీఎం బొమ్మై తెలిపారు. బడ్జెట్ అనంతరం విధానసౌధలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి ఐదేళ్లు పడుతుందన్నారు, కానీ రెండేళ్లలోనే ఆర్థిక క్రమశిక్షణ పాటించి మిగులు బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. దేశ ఆర్థిక సరాసరి కంటే ఎక్కువ ఆదాయం రాష్ట్రంలో ఉందన్నారు. గతేడాది రూ.69 వేల కోట్లు మాత్రమే రుణం తీసుకున్నామని తెలిపారు. ఈ సారి కూడా రూ.72 వేల కోట్ల లోపే రుణాలు ఉంటాయన్నారు. ఈసారి మిగులు బడ్జెట్ ప్రవేశపెట్టామని, గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి రికార్డు సృష్టించలేదని, జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే రెండవ స్థానంలో కర్ణాటక ఉందని చెప్పారు. జాతీయ ఆర్థిక వృద్ధి 6.8 శాతం ఉండగా, రాష్ట్రంలో ఆ రేటు 7.8 శాతం ఉందన్నారు. గత బడ్జెట్‌లో చెప్పినదానికంటే రూ.20 వేల కోట్లు ఎక్కువ వ్యయం చేశామన్నారు. ప్రతిసారి 5–6 శాతం మాత్రమే బడ్జెట్ ప్రమాణం పెరుగుతుందని, కానీ ఈసారి 16 శాతం పెరిగిందని తెలిపారు.

ఈ బడ్జెట్ చెవిలో పువ్వు: కాంగ్రెస్

సాక్షి బెంగళూరు: బడ్జెట్ వట్టి బోగస్ అని విమర్శించేలా ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెవిలో బంతి పువ్వులు పెట్టుకుని అసెంబ్లీకి వచ్చారు. సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్, ఎమ్మెల్యేలు అజయ్‌సింగ్ తదితరులు చెవిలో పూలతో రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఎన్నికల ముందు అమల్లోకి రాని బడ్జెట్ అని, అందుకే చెవుల్లో పువ్వులు పెట్టుకుని వచ్చినట్లు నేతలు చెప్పారు. ఈసారి ప్రభుత్వం తీసుకొచ్చేది ఎన్నికల బడ్జెట్ అని, ఎన్నికల ముందు లబ్ధి పొందేందుకు బడ్జెట్‌లో పలు ప్రజాకర్షక ప్రకటనలు, తాయిలాలు, ప్రాజెక్టులను ప్రకటించారని కాంగ్రెస్‌పార్టీ ఆరోపించింది. ఎన్నికల కోసం ప్రజాకర్షక ప్రకటనలు చేసి రాష్ట్ర ప్రజల చెవుల్లో పూలు పెడుతోందని విమర్శించింది.



భారత వాయుసేనకు చెందిన అపాచీ హెలికాప్టర్



మొబైల్‌లో బంధించాల్సిందే...

అంబర సంబరానికి సెలవిక

ఈ నెల 13న బెంగళూరు యలహంకలో ఆరంభమైె ఏరో ఇండియా వైమానిక ప్రదర్శన శుక్రవారం సాయంత్రం సమాప్తమైంది. దేశ విదేశాలకు చెందిన వైమానిక సంస్థలు తమ విమానాలను ఇక్కడ ప్రదర్శించాయి. లోహ విహంగాల గర్జనలు, వాటి విన్యాసాలు సందర్శకులను అబ్బురపరిచాయి. అపురూప జ్ఞాపకంగా మదిలో నిలిచిపోయింది. మళ్లీ 2025లో ఈ వేడుక జరుగుతుంది





సూర్యకిరన్ జెట్ల చివరి ప్రదర్శన

కనువిందుగా రథోత్సవం



చింతామణి: తాలూకాలోని పెద్దూరు గ్రామపంచాయతీ పరిధిలోని పాతకోట మజరా దిగవకోట గ్రామంలో వెలసిన పురాతన శ్రీ విశ్వేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం కమనీయంగా జరిగింది. గ్రామస్తులతో పాటు పరిసర పల్లెల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను తేరులో ఉంచి స్వామినామాన్ని జపిస్తూ తేరును లాగారు.

వైభవంగా రుద్రయాగం




బనశంకరి: పరమశివుడికి పవిత్రమైన మహాశివరాత్రి సందర్భంగా ద్వాదశజ్యోతిర్లింగ దేవస్థానం (ఓంకార ఆశ్రమం)లో రుద్రయాగాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఉత్తరహళ్లి–కెంగేరి ప్రధానరహదారిలోని శ్రీనివాసపురలో వెలసిన ఆశ్రమంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు రుద్రయాగం చేపట్టారు. మధ్యాహ్నం వేళ పీఠాధిపతి మధుసూదనానందపురి స్వామీజీ పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శనివారం మహాశివరాత్రి కావడంతో జ్యోతిర్లింగదర్శనానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 10 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.

అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లిన బస్సు



దొడ్డబళ్లాపురం: అదుపుతప్పిన బస్సు రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లిన సంఘటన దొడ్డ తాలూకా కల్లుకోట వద్ద చోటుచేసుకుంది. దొడ్డబళ్లాపురం, గౌరిబిదనూరు తాలూకా మంచేనహళ్లి మధ్య సంచరించే కేఎస్ఆర్టీసీ బస్సు కల్లుకోట వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. బస్సులో ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు. రోడ్డు గుంతలమయమై ఉన్నందునే బస్సు అదుపుతప్పిందని ప్రయాణికులు తెలిపారు.

ఆదియోగి సన్నిధి సంసిద్ధం



చిక్కబళ్లాపుర వద్ద ఆదియోగి విగ్రహం

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం సమీపంలో ఆవలగుర్కి గ్రామం దగ్గర 112 అడుగుల బృహత్ ఆది యోగి శివుని ప్రతిమ వద్ద శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు శుక్రవారమే చేరుకున్నారు. తెల్లవారుజాము నుంచి పూజలు, హారతి, భజన వేడుకలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రవేశం ఉచితమని తెలిపారు. కాగా, వేలాది మంది వచ్చే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశముంది.

తల్లితో గొడవపడి ఆత్మహత్య

- నెల్లూరులో బెంగళూరువాసి అఘాయిత్యం

నెల్లూరు (క్రైమ్): అతను తల్లిపై అలిగి భార్యతో సహా నెల్లూరుకు వచ్చాడు. తాను ముంబైలో ఇంటర్వ్యూకు వెళ్లాలని బావమరిదిని పిలిచి భార్యను అప్పగించాడు. తరువాత రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు జీవనహళ్లి కాక్స్‌టౌన్‌కు చెందిన పి.శశి కుమార్ (32)కు ఉమ్మడి నెల్లూరు జిల్లా కలువాయి మండలం పల్లెకొండకు చెందిన తన మేనమామ కుమార్తె ప్రమీలతో ఏడాది క్రితం వివాహమైంది. వీరు బెంగళూరులో ఉంటున్నారు. శశికుమార్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో పాటు చిన్నచిన్న పనులు చేస్తుండగా ప్రమీల అక్కడే ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేస్తోంది. శశికుమార్ తరచూ తల్లితో గొడవపడి ఇల్లు వదిలి వెళ్లేవాడు. రెండు రోజుల క్రితం తల్లితో కొట్లాడి, భార్యను తీసుకుని గురువారం సాయంత్రం నెల్లూరుకు వచ్చాడు. స్థానికంగా ఉండే బావమరిది కళ్యాణ్‌ను ఆర్టీసీ బస్టాండ్ వద్దకు పిలిపించుకుని తాను ముంబైలో ఇంటర్వ్యూకు వెళ్తున్నానని, ప్రమీలను ఇంట్లో వదిలిపెట్టాలని సూచించాడు. వారు వెళ్లిపోయాక రైల్వేస్టేషన్‌కు వెళ్లి యశ్వంతపుర–హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుండగా దానికి ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికపై లైంగిక దాడి

యశవంతపుర: చాక్లెట్ ఇప్పిస్తానంటూ నమ్మించి బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన దావణగెరె జిల్లాలోని ఓ గ్రామంలో జరిగింది. బాలికను ఇంటి వద్ద వదలి కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లారు. బాలిక ఒక్కటే ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన నాగ (21) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి పక్కకు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి రాగా బాలిక భయం భయంగా కనిపించడంతో వారు విషయం ఆరా తీశారు. బాలిక జరిగిన దారుణాన్ని వివరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి బాలికను ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎం మోసగాళ్లకు బేడీలు

దొడ్డబళ్లాపురం: ఏటీఎం సెంటర్ల వద్ద అమాయకులను నగదు డ్రా చేసిచ్చే సాకుతో పిన్ నంబర్ చూసుకుని మోసం చేస్తున్న ఇద్దరిని రామనగర తాలూకా ఐజూరు పోలీసులు అరెస్టు చేశారు. కోలారు జిల్లా బంగారుపేట పరిధిలోని వివేకానంద నగరకు చెందిన తిమ్మ అలియాస్ వెంకటరామ (38), మాలూరు పట్టణ నివాసి మంజునాథ్ (37) పట్టుబడ్డ నిందితులు. రామనగర యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద శాంతమ్మ అనే మహిళ డబ్బులు డ్రా చేయడానికి రాగా ఆమెకు సాయం చేస్తున్నట్లు నటించి ఆమె కార్డు పిన్ నంబర్ తెలుసుకుని, కార్డు తీసుకుని ఒక నకిలీ కార్డును ఇచ్చి పంపారు. తరువాత అసలైన కార్డుతో రూ.12 వేలు డ్రా చేసుకున్నారు. ఇదే మాదిరిగా అనేకమందిని మోసం చేసినట్లు నిందితులు తెలిపారు. వారి నుంచి 20 ఏటీఎం కార్డుల, రూ.50వేల నగదు, రెండు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ధ్యానయోగి విగ్రహావిష్కరణ



శివమొగ్గ: నగరంలోని వినోబానగరలోని కల్లహళ్లి శ్రీ శివగంగ యోగా కేంద్రంలో ధ్యాన యోగి శివుని విగ్రహాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. శివుడు ప్రకృతికి ప్రతీక, ధ్యానయోగి అని పేర్కొన్నారు. గోణిబీడు సిద్దలింగ స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజల నిర్వహించారు.

గ్రామీణ కళలకు జీవం పోయాలి



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు

కంప్లి: గ్రామీణ కళలను నిరంతరం కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. గురువారం వద్దట్టి గ్రామంలో దుర్గమ్మదేవి కుంభోత్సవంలో భాగంగా రాత్రి రతికళ్యాణ అనే బయలు నాటక ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడారు. కళాకారుడి ప్రతిభను మెచ్చి గ్రామీణ కళలను ప్రోత్సహిస్తూ నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, కళాభిమానులు పాల్గొన్నారు.

నెలమంగలలో చిరుత కలకలం

దొడ్డబళ్లాపురం: నెలమంగల తాలూకా మల్లరబాణవాడి గ్రామంలో చిరుతపులి భయం పట్టుకుంది. గత 15 రోజులుగా మల్లరబాణవాడి గ్రామం చుట్టుపక్కల చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల గ్రామంలోకి జొరబడి వీధికుక్కలను, పశువులను బలి తీసుకుంటోంది. శుక్రవారంనాడు గ్రామ శివార్లలో కాలికి గాయమై కుంటుతున్న చిరుతను చూసినట్టు గేరహళ్లి గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. గాయపడ్డ చిరుత ఎటువైపు నుండి దాడి చేస్తుందోనని గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలోని 23వ వార్డు మహానంది కొట్టం అంబాభవాని దేవస్థానం సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఉదయం మేయర్ రాజేశ్వరి, ఉపమేయర్ మాలన్‌బీ, ఆ వార్డు కార్పొరేటర్ పీ.గాదెప్ప భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ.8 లక్షల వ్యయంతో ఈ సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 8వ వార్డు కార్పొరేటర్, స్థాయి సమితి సభ్యులు రామాంజినేయులు, కార్పొరేటర్లు శ్రీనివాస్ మోత్కర్, హనుమంతు, ప్రముఖులు ఎస్.గంగిరెడ్డి, గురుసిద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

గౌరిబిదనూరు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఎన్నికల్లో ఓటు వేయాలని తహసీల్దారు మహేశ్ తెలిపారు. శుక్రవారం మినీ విధానసౌధలో ఈవీఎం, వీవీ ప్యాట్ ల పనితీరు గురించి ప్రజలకు, సిబ్బందికి ప్రదర్శించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఓటర్లలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పట్ల విశ్వాసం పెంపొందించడానికి ఎన్నికల కమిషన్ జాగృతి కల్పిస్తోందన్నారు. ఓటరు ఎవరికి ఓటు వేసింది వీవీ ప్యాట్ రసీదులో 7 సెకెండ్ల లోపు చూడవచ్చని తెలిపారు. ప్రతి ఓటరు ఈవీఎం పనితీరు గురించి తెలుసుకొని ఉంటే మంచిదన్నారు. నగరగెరె ఆర్‌ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గంగావతి రూరల్: తాలూకాలోని శ్రీరామనగర్ 6వ వార్డులో వెలసిన ఏకు మక్కళ తాయమ్మ దేవి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.05 గంటలకు గణపతి పూజతో మొదలైన పలు ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా కుంకుమ అర్చన, పంచామృత అభిషేకం, దుర్గా లలిత సహస్రనామ హోమం, విశేష పుష్పాలతో అలంకరణ, మహా నైవేద్యం తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ నేతృత్వంలో ఆచార్య రాజపురోహిత్ హులిహైదర్ తిరుపతి స్వామి, ఆలయ అర్చకులు హనుమంతరావు ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం నిర్వహించినట్లు కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు.

ఇద్దరు ఇళ్ల చోరుల అరెస్ట్



స్వాధీనపరచుకున్న ఆభరణాలతో పోలీసులు

హొసపేటె: నగరంలోని అరవింద నగరలో దొంగతనానికి పాల్పడ్డ నిందితులను రూరల్ పోలీసులు బంధించిన ఘటన శుక్రవారం జరిగింది. జిల్లా ఎస్పీ హరిబాబు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 21న ఉదయం షాదీమహల్ వెనుక ఉన్న ఇంటి తాళాలను పగలగొట్టి ఇంటిలో చొరబడి బీరువాలోని సుమారు 720 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.11 వేల నగదును దోచుకొని పరారయ్యారు. ఈ విషయంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని హొసపేటకు చెందిన మరడి హనుమంత, అనిల్ అనే నిందితులను పోలీసులు బంధించి వారి నుంచి మొత్తం రూ.19,19,200 విలువ చేసే 383 గ్రాముల బంగారు ఆభరణాలు, 70 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు.

కోట మల్లేశ్వరా పాహిమాం

- శివరాత్రికి ఆలయాలు ముస్తాబు
- హంపీలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు



నగరంలో వెలిసిన కోట మల్లేశ్వరుని మూలవిరాట్



కోటలోని కోట మల్లేశ్వర స్వామి ఆలయం

సాక్షి,బళ్లారి: మహా శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజైన మహా శివరాత్రిని భక్తిశ్రద్ధలతో ఆచరించేందుకు శివ భక్తులు సిద్ధమయ్యారు. శనివారం మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని శివాలయాలను ముస్తాబు చేశారు. ముఖ్యంగా కోరిన కోర్కెలు తీర్చే మహాశివుడుగా గుర్తింపు పొందిన నగరంలోని కోట మల్లేశ్వర ఆలయం, నగరేశ్వర ఆలయం, కాశీవిశేశ్వర ఆలయం, సంగమేశ్వర ఆలయం, పెద్ద మార్కెట్ నీలకంతేశ్వర ఆలయం, బసవేశ్వర ఆలయాలు, బ్రాహ్మణ వీధిలోని నాగేశ్వర ఆలయం, శివలీల ఆలయం, నారాయణ రావు పార్కులో శివుని విగ్రహానికి పూజలు, పటేల్ నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శివుని విగ్రహానికి, చిన్న మార్కెట్ సమీపంలోని మల్లికార్జున స్వామి తదితర శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రిని ఆచరించేందుకు అన్ని ఏర్పాట్లు జరిపారు. ఉదయం నుంచి శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించేందుకు ముందుగా భక్తులను సిద్ధం చేశారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీలోని విరుపాక్షేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. విరుపాక్షేశ్వర ఆలయంలో శివుడిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్న తరుణంలో ముందస్తు చర్యలు చేపట్టారు. మహాశివరాత్రి రోజున జాగరణ చేసే భక్తులకు, రాత్రి భజనలు చేసేందుకు, ఉపవాసం చేసే భక్తులకు రాత్రి ఉపహారం అందించేందుకు ఆయా శివాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి ప్రాణ ప్రతిష్టాపన వేడుకలు



అమ్మవారి నూతన ఆలయం (ఇన్‌సెట్‌లో) ఆదిశక్తి దుర్గామాత అమ్మవారు

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది మేగోటె దుర్గామాత ఆలయ నిర్మాణం అనంతరం అమ్మవారి ప్రాణ ప్రతిష్టాపన వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ రాజణ్ణ స్వామి తెలిపారు. దుర్గామాత మానస పుత్ర, దాసోహ రత్న బ్రహ్మానంద స్వామీజీ నేతృత్వంలో ఈనెల 19 నుంచి 25 వరకు పలు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం కలశ స్థాపన, ధ్వజారోహణ, పుణ్యాహవాచన, సోమవారం గణపతి హోమం, వాస్తు హోమం, నవగ్రహ రుద్రహోమం, బుధవారం గణపతి హోమం, సుదర్శన హోమం, గురువారం గణపతి హోమం, పవమాన హోమం, శుక్రవారం అమ్మవారికి ప్రాణ ప్రతిష్టాపన, కళాకర్షక హోమం, పూర్ణాహుతి, శనివారం గణపతి హోమం, 108 మహారుద్రకుంభాభిషేకం, మహా చండీయాగం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో ఆనెగుంది రాజవంశస్తులు లలితారాణి శ్రీరంగదేవరాయలు, నరసింహ దేవరాయలు, రామదేవ రాయలు, రాజా కృష్ణదేవరాయలు, మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లితో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

బడ్జెట్ అబద్ధాల పుట్ట

హుబ్లీ: బీజేపీ నేతలు అబద్ధాలను చాలా బాగా చెబుతారు. సీఎం బడ్జెట్ అంతా అబద్ధాలమయం అని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జీ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అన్నారు. స్థానిక విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ నుంచి బొమ్మై వరకు అబద్ధాలు చెప్పడం బాగా నేర్చుకున్నారన్నారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత ఏడాది 240 హామీలు ఇచ్చి 132 హామీలను జోలికే పోలేదన్నారు. కర్ణాటక ప్రజలకు మంచి జరగలేదు. నమ్మ క్లినిక్‌లు ఎక్కడికి వెళ్లాయి. ఒక్కలిగ అభివృద్ధి కార్పొరేషన్‌తో పాటు ఏమీ చేయలేదన్నారు. నాగమోహన్ దాస్ కమిటీ నివేదికపై చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పెంపును 9వ షెడ్యూల్‌లో చేర్చలేదన్నారు. ఒక్కలిగులు, లింగాయతులకు ప్రత్యేక రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి కోర్టులో స్టే వచ్చేలా చేశారన్నారు. డబల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్నా ప్రయోజనం లేదన్నారు. ఇది బ్యాడ్ బ్రోకర్ ప్రభుత్వం అన్నారు. విపక్ష నేత సిద్దరామయ్యపై మంత్రి అశ్వత్‌నారాయణ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

దూరదృష్టి బడ్జెట్

హుబ్లీ: సీఎం బొమ్మై ప్రతిపాదించిన బడ్జెట్ సమతుల్యతతో దూరదృష్టి కలిగిందని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వినయ్ జవళి తెలిపారు. ఆయన హుబ్లీలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన బడ్జెట్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ఆరోగ్య, పర్యాటక తదితర అనేక రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించారన్నారు. విద్యా శాఖకు 20 శాతం నిధులు, రైతులకు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ప్రకటించారన్నారు. ఆరోగ్యం కోసం 428 నమ్మ క్లినిక్‌లు కేటాయించారన్నారు. విద్యా రంగంలో 7 కొత్త విశ్వవిద్యాలయాలు, ఒక వైద్య కళాశాల ప్రకటించారన్నారు. బడ్జెట్‌లో మహదాయికి రూ.1000 కోట్లు, కళసా బండూరికి రూ.80 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తూ రూ.50 కోట్లు కేటాయించారన్నారు. విద్యార్థులకు, యువజనులకు ప్రోత్సాహం అందించారన్నారు. ఉత్తర కర్ణాటక, కిత్తూరు కర్ణాటకకు మంచి పథకాలను ప్రకటించారని ఆ సంస్థ స్థాయి సమితి సభ్యుడు శేషగిరి కులకర్ణి తెలిపారు.

బడ్జెట్‌లో అంజనాద్రి అభివృద్ధికి రూ.100 కోట్లు

గంగావతి రూరల్: కొప్పళ జిల్లా గంగావతి తాలూకా ఆనెగుంది కిష్కింధా క్షేత్రం అంజనాద్రి పర్వతం బాలాంజనేయస్వామి దేవస్థానం మౌలిక సౌకర్యాల కోసం శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై రూ.100 కోట్ల నిధులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో అయోధ్య రామ జన్మభూమి, రామమందిరం తరహాలో అభివృద్ధి చేయాలన్న ఆశయం నెరవేరింది. అంజనాద్రికి గ్రాంట్ విడుదల చేయడం హనుమ భక్తులకు ఆనందాన్ని కలిగించింది. దీంతో అంజనాద్రి, కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి సీఎం బొమ్మై సహకారం ఉందని వెల్లడైంది. అంజనాద్రిని హనుమంతుని జన్మస్థలంగా ప్రకటించేందుకు సీఎం సమావేశం నిర్వహించనున్నారు. అంజనాద్రికి గ్రాంట్ విడుదల చేయడం ఎంత ముఖ్యమో హనుమంతుడి జన్మస్థలం అంజనాద్రి అని ప్రకటించడం కూడా అంతే ముఖ్యమని స్థానిక పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు.

శివలింగాల సద్భావన యాత్ర



పట్టణ ప్రధాన వీధిలో శివలింగాలతో సద్భావన యాత్ర చేపట్టిన దృశ్యం

సిరుగుప్ప: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం శివరాత్రి సందర్భంగా శుక్రవారం నగరంలోని మార్కెట్ యార్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు శివలింగాల సద్భావన యాత్ర నిర్వహించారు. నగర ప్రముఖ వీధుల్లో జరిగిన ఊరేగింపులో ద్వాదశ లింగాలైన కాశీవిశ్వనాథ, భీమాశంకర, వైద్యనాథ, మహాకాళేశ్వర, గౌరీశంకర, శ్రీశైల మల్లికార్జున, గౌరీశంకర, త్రయంబకేశ్వర, నాగేశ్వర, ఓంకారేశ్వర, సోమనాథ, కేదారనాథ, రామేశ్వర తదితర చిత్రపటాలను ఒక్కొక్క కారుపైన అమర్చి డోలు, మేళతాళాలు వాయిద్యాలతో కుంభ కలశాలతో ఊరేగించారు. అనంతర ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ముఖ్యురాలు అన్నపూర్ణ అక్క మాట్లాడుతూ శనివారం సర్వధర్మ సమ్మేళనం, ఆదివారం ప్రగతిశీల రైతులకు అభినందన, సోమవారం ఆధ్యాత్మిక శక్తి, మహిళా సబలీకరణ కార్యక్రమాలు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు స్థానిక నిట్టూరు నరసింహమూర్తి బయలు స్థలంలో జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొంటారని, శివభక్తులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హెచ్‌ఆర్ శ్రీనాథ్‌కు సన్మానం



గంగావతి: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ హక్కును కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. తనను పంచమశాలి సమాజం వారు తమ నివాసంలో సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబడిన పంచమశాలి సమాజాన్ని అగ్ర కులంగా పరిగణించినా ఆ సమాజం ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. అందుకే వారి పోరాటానికి తాను మద్దతును తెలిపానన్నారు. ఈ సందర్భంగా పంచమశాలి సమాజ ప్రముఖులు శివప్ప, అడ్వకేట్ మంజునాథ్, బసవరాజ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేగోటె దుర్గాదేవికి హోమం



హోమ పూజలో పాల్గొన్న బళ్లారి వాసులు

గంగావతి: ఆనెగుంది మేగోటె దుర్గాదేవి దేవస్థానంలో శుక్రవారం బళ్లారికి చెందిన భక్తులు హోమాన్ని నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పలు రకాల అభిషేకాలు, విశేష పూజలను నెరవేర్చిన అనంతరం 10 గంటలకు హోమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మానంద స్వామి నెరవేర్చారు. స్వామీజీ మాట్లాడుతూ అమ్మవారి సన్నిధిలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో హోమాన్ని భక్తులు లోకకళ్యాణం కోసం నెరవేరుస్తుంటారన్నారు.

మురికివాడల అభివృద్ధే నా ధ్యేయం

- గాలి జనార్ధన్ రెడ్డి



కార్యక్రమంలో సన్మానం అందుకుని విజయచిహ్నం చూపుతున్న గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి రూరల్: నగరంలో మురికివాడల అభివృద్ధే తన ధ్యేయమని కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) వ్యవస్థాపకులు గాలి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 32వ వార్డు చలువాది వీధిలో నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మీ పిల్లలకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యాభ్యాసం కోసం తల్లుల ఖాతాకు డబ్బులు పంపుతామన్నారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇంటిని నిర్మిస్తామన్నారు. వారంలో ఒక్కసారి ప్రతి అధికారి మీ ఇళ్ల వద్దకు వచ్చి మీ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. స్లమ్ అనే పేరు లేకుండా చేస్తానని, మీ కాలనీలో హైటెక్ కల్యాణ మండపాన్ని నిర్మిస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు మనోహర్‌గౌడ హేరూరు, తాలూకా అధ్యక్షులు వీరేష్ బలకుంది, అమరజ్యోతి నరసప్ప, సయ్యద్ జిలాని పాషా, మహిళా మండలి లలితమ్మ, చలువాది సమాజ నాయకులు హులుగప్ప మ్యాగి, రైతు నాయకుడు నారాయణప్ప ఉప్పార్, యువనాయకులు చౌడ్కి యమనూర్, రమేశ్ హొసమని, వీరేశ్ సుళేకల్, టీజీ బాబుతో పాటు దళిత నాయకులు, మహిళా కార్యకర్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

మాజీ స్పీకర్ రమేష్‌కుమార్‌కు సతీ వియోగం



విజయమ్మ(ఫైల్)

శ్రీనివాసపురం : మాజీ స్పీకర్, ఎమ్మెల్యే కె ఆర్ రమేషకుమార్ సతీమణి విజయమ్మ(64) అనారోగ్య కారణంగా బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు కన్నుమూశారు. విజయమ్మకు భర్త రమేష్‌కుమార్, కుమారుడు, కుమార్తె, మనవళ్లు ఉన్నారు. విజయమ్మ అంత్యక్రియలను సాయంత్రం స్వగ్రామమైన తాలూకాలోని అడ్డగల్‌లో నెరవేర్చారు. విజయమ్మ మృతికి మాజీ సభాపతి వీఆర్ సుదర్శన్‌తో పాటు పలువురు నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

జెడ్పీ సీఈఓకు అభినందన

కోలారు : బడ్జెట్‌లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల వేతనాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో జిల్లా అక్షర దాసోహ క్షేమాభివృద్ధి సమితి సంస్థాపక అధ్యక్షుడు కల్వమంజలి సి.శివణ్ణ నేతృత్వంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు శుక్రవారం జెడ్పీ సీఈఓ కార్యాలయంలో సీఈఓ యుకేషకుమార్‌ను అభినందించారు. వేతనాల పెంపునకు సహకరించిన సీఈఓకు, మంత్రులు, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శివణ్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం రూ.వేయి వేతనాన్ని పెంచడం హర్షణీయమన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, రాధమ్మ, యశోదమ్మ, సరస్వతమ్మ, జయంతి పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీకి అనర్హుడు

మాలూరు : ఎమ్మెల్యే కె వై నంజేగౌడ జైలు శిక్ష పడి బెయిల్‌పై బయట తిరుగుతున్నారు, హైకోర్టులో కేసు కొట్టి వేస్తేనే ఎన్నికల్లో పోటీ చేయడానికి సాధ్యమవుతుందని, సాంకేతికంగా ఎన్నికల్లో పోటీ చేయవచ్చా లేదా అనేదానిపై నంజేగౌడకు సరైన అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే కె మంజునాథ్‌గౌడ ఆరోపించారు. ఆయప శుక్రవారం తాలూకాలోని లక్కూరు గ్రామంలో జీపీ మాజీ అధ్యక్షుడు కె రామచంద్ర తన మద్దతుదారులతో కలిసి బీజేపీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులను చేశానన్నారు, పార్టీ సిద్ధాంతాలను మెచ్చి ఎంతో మంది ఇతర పార్టీల నుంచి వచ్చి బీజేపీలో ,చేరుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఎన్ రఘునాథ్, నారాయణప్ప, అజ్గర్, జగదేనహళ్లి సుబ్రమణిరెడ్డి పాల్గొన్నారు.

సిద్దరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు తగదు



ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: మాజీ సీఎం సిద్దరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి డాక్టర్ అశ్వత్‌నారాయణకు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం ఎదుట జిల్లా కురుబ, గొల్ల సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రతిపక్ష నేత సిద్దరామయ్యపై అసెంబ్లీలో కించపరిచే వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్‌నారాయణను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కురుబ సంఘం నేత మోహన్, మాజీ జెడ్పీ సభ్యుడు అల్లం ప్రశాంత్, మాజీ కార్పొరేటర్ కెరెకోడప్ప, మాజీ ఉప మేయర్ బెణకల్ బసవరాజ్, గొల్ల సంఘం కార్యదర్శి కేఈ.చిదానందప్ప, రామాంజనేయ, ఎల్.సిద్దనగౌడ, గాదిలింగనగౌడ, తిమ్మప్ప, శ్రీరామరాజ్, కొళగల్ అంజిని, పట్టి యర్రిస్వామి పాల్గొన్నారు.

మంత్రి అశ్వత్ నారాయణను తొలగించాలి

రాయచూరు రూరల్: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి అశ్వత్ నారాయణను మంత్రివర్గం నుంచి తొలగించాలని కురుబ సమాజం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన జిల్లాధ్యక్షుడు బసవంతప్ప, సింధనూరులో గంగన్న మాట్లాడారు. మాజీ సీఎం సిద్దరామయ్యను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన మంత్రిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారి హిరేమఠ్‌కు వినతిపత్రం సమర్పించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్ తదితరులు

కంప్లి: పిల్లలకు ఉత్తమ విద్యా బోధనతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. శుక్రవారం రెగ్యులేటర్ క్యాంప్‌లో పాఠశాల గదులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని నివారించి తాగునీటికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. శాశ్వత తాగునీటి కోసం ఉప్పారహళ్లిలో చెరువును నింపుతామన్నారు. పాత నెల్లుడి వద్ద రూ.7 కోట్లతో కొత్త చెరువును నిర్మించి నెల్లుడి, కొట్టాల, శంకర్‌సింగ్ క్యాంప్, శాంతినగర్ గ్రామాలకు శాశ్వత తాగునీటిని అందిస్తామన్నారు. మెట్రి జీపీ పీడీఓ శ్రీశైలగౌడ, కార్యదర్శి హెచ్.హులుగప్ప, నెల్లుడి జీపీ అధ్యక్షులు ఎల్.శ్రీనివాసరావు, ప్రముఖులు లక్ష్మీనారాయణ, వీరాంజనేయులు, హొన్నళ్లి ఎస్.బసవరాజ్, సీ.విరుపణ్ణ, రెగ్యులేటర్ క్యాంప్ పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు పార్వతి, హెచ్‌ఎం.శంకలింగప్ప, ప్రముఖులు యూ.బసవరాజ్, హొసగేరప్ప, భీమలింగప్ప, తిమ్మారెడ్డి, మల్లికార్జున, కరేగౌడ, పంపాపతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖేల్‌కూద్



బహుమతులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, బెంగళూరు: నగరంలోని రేవా విశ్వవిద్యాలయం సంప్రదాయ క్రీడా పోటీలకు వేదికైంది. రేవా క్యాంపస్‌లో జరిగిన ఈ ఖేల్ కూద్ పోటీల్లో వేలాది మంది పిల్లలు, టీనేజర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కర్ణాటక క్రీడల శాఖ కమిషనర్ ఎంపీ ముల్‌లై ముహిలన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వర్సిటీ చాన్సలర్ శ్యామరాజు మాట్లాడుతూ అనేకమైన సంప్రదాయ ఆటలు నేటి బాలలకు తెలియదని, కోల్పోయిన ఆ బాల్యాన్ని తిరిగి తీసుకొచ్చే చిన్న ప్రయత్నమే ఈ ఖేల్‌కూద్ అని తెలిపారు.

సుధా సోమనాథ్‌కు హైకోర్టులో ఊరట



సుధా సోమనాథ్

గంగావతి: నగర 20వ వార్డు బీజేపీ కౌన్సిలర్ నగరసభ ఉపాధ్యక్షురాలు సుధా సోమనాథ్ సభ్యత్వాన్ని గత సంవత్సరం రద్దు చేయడాన్ని హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలను జారీ చేసింది. కొప్పళ జిల్లా కలెక్టర్‌కు సుధా సోమనాథ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దొడ్డనగౌడ పాటిల్ లేఖ సమర్పించగా అప్పటి కలెక్టర్ వికాస్ కిషోర్ సురళ్కర్ మే 11, 2022న సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఆదేశాలను జారీ చేశారు. ఈ ఆదేశాలను ప్రశ్నిస్తూ సుధా సోమనాథ్ ధార్వాడ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో వాదప్రతివాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం ఆమె సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. దీంతో సుధా సోమనాథ్‌కు ఊరట లభించి ఆమె సభ్యురాలుగా, నగరసభ ఉపాధ్యక్షురాలుగా కొనసాగడానికి అవకాశం కలిగింది.

సంకల్పయాత్ర జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

కోలారు : మార్చి 12న కోలారుకు వస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాధనల గురించి తెలిపే విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయడానికి కార్యకర్తలు శ్రమించాలని ఎంపీ ఎస్ మునిస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విజయసంకల్ప యాత్ర ఏర్పాట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలారు నుంచి యాత్ర చింతామణికి వెళతుందన్నారు. ఆయా తాలూకాలకు వచ్చినప్పుడు కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని తిరిగి అధికారంలోకి తేవడానికి నిర్వహిస్తున్న ఈ యాత్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. బీజేపీ కెంపేగౌడ, అంబేడ్కర్‌లకు ఇచ్చిన గౌరవాన్ని స్మరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు వెంకటమునియప్ప, నారాయణస్వామి, బ్రాహ్మణ అభివృద్ధి మండలి అధ్యక్షుడు సచ్చిదానంద, జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, జిల్లా సమన్వయ కార్యదర్శి కాంతరాజ్ పాల్గొన్నారు.

కుమారను సీఎంని చేయాలి

శ్రీనివాసపురం : పార్టీ అధినేత కుమారస్వామిని సీఎంని చేయడానికి కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు వెంకటశివారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం తాలూకాలోని కరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జేడీఎస్ పంచరత్న పథకాలు సమాజంలోని అన్ని వర్గాల, సముదాయాల అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయన్నారు. కుమారస్వామి 14 నెలల అవధిలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల రూ.25 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేశారన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే పింఛన్ల మొత్తాన్ని పెంచుతారన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి, టీపీ మాజీ అధ్యక్షుడు బండ్లపల్లి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కేవీ శివారెడ్డి పాల్గొన్నారు.

పీఈటీలకు ట్రాక్‌సూట్‌ల పంపిణీ

కోలారు : జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల నిర్వహణకు సహకరించిన పీఈటీలకు ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు రవిచంద్ర శుక్రవారం ట్రాక్‌సూట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల నిర్వహణలో పీఈటీల పాత్ర శ్లాఘనీయం అన్నారు. సంఘం మాజీ అధ్యక్షుడు కేబీ అశోక్ క్రీడాకారుల జాతీయ, అంతర్జాతీయ స్థాయి రాణింపునకు జిల్లా పీఈటీల శ్రమ కారణమన్నారు. కార్యక్రమంలో కేజీఎఫ్ తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, సర్వే శాఖ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ వాస్తవ్య

శ్రీనివాసపురం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికే కలెక్టర్ గ్రామ వాస్తవ్యను నిర్వహిస్తున్నట్లు జిల్లాధికారి వెంకటరాజ తెలిపారు. శుక్రవారం ముళబాగిలు తాలూకాలోని బైరకూరు ఫిర్కా జల్లపల్లిలో నిర్వహించిన గ్రామ వాస్తవ్యను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖ నుంచి పింఛన్ మంజూరు ఆదేశాలు, పౌతి ఖాతా ఆదేశాలు, హక్కు పత్రాల పంపిణీ, పహణీ మార్పులు తదితర సౌలభ్యాలను అందించారు. ఈ సందర్భంగా ముళబాగిలు తహసీల్దార్ వై రవి, జీపీ అధ్యక్షురాలు భారతి, టీపీ ఈఓ సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు నోటీసులు

కేజీఎఫ్ : బంగారుపేట తాలూకాలోని చిక్క అంకండనహళ్లి జీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కేడీపీ త్రైమాసిక ప్రగతి పరిశీలన సమావేశానికి అధికారులు మూకుమ్మడిగా గైర్హాజరయ్యారు. దీంతో ఆగ్రహించిన పంచాయతీ అధ్యక్షుడు హెచ్‌ఎం రవి అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశానికి 27 శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే హాజరు కావడంపై అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల గురించి చర్చించాల్సిన సమావేశానికి అధికారులు రాకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. పంచాయతీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో అధికారులు గైర్హాజరైతే ఎలా? అని ప్రశ్నించారు. గైర్హాజరైన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నేతల ధర్నా

శివాజీనగర: మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కొట్టాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్థనారాయణను మంత్రి పదవి నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రేస్‌కోర్స్ రోడ్డులో కాంగ్రెస్ భవన్ ముందు ధర్నా చేశారు. మంత్రి పరోక్షంగా సిద్దరామయ్య హత్యకు పిలుపునిచ్చారు. దీంతో మంత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సిద్దరామయ్యకు భద్రత పెంచాలని కోరారు. నేతలు బీ.కే.హరిప్రసాద్, రామలింగారెడ్డి, వీ.ఎస్.ఉగ్రప్ప, గంగాంబిక, ఎం.ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన



కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురంలోని దేవసంద్ర వార్డు పరిధి గంగశెట్టి చెరువు అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ ఎం.ఎన్.శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే, నగరాభివృద్ధి శాఖ మంత్రి బైరతి బసవరాజు ఆదేశాల మేరకు చెరువు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

రామలింగారెడ్డికి ఓటమి తప్పదు

బొమ్మనహళ్లి: వచ్చే శాసనసభ ఎన్నికల్లో బెంగళూరు నగర బీటీఎం లేఔట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రామలింగారెడ్డికి ఓటమి తప్పదని బీటీఎం లేఔట్ బీజేపీ నాయకుడు గోవిందరాజు రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బీటీఎం లేఔట్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జయనగర నుంచి నాలుగు సార్లు, బీటీఎం లేఔట్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినా సొంత చరిష్మా లేదని, రాజకీయ నాయకులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని విజయం సాధిస్తున్నారని ఆరోపించారు. బీటీఎం లేఔట్‌లో ఈసారి బీజేపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు.

ముఖాముఖి ఢీకొన్న మారుతి వ్యాన్, బైక్

–ఇద్దరికి తీవ్ర గాయాలు

దొడ్డబళ్లాపురం: మారుతి వ్యాన్, బైక్ ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన దొడ్డ తాలూకా ద్యావసంద్ర వద్ద చోటుచేసుకుంది. దేవనహళ్లి తాలూకా అవతి గ్రామం నుంచి వస్తున్న మారుతి వ్యాన్ ద్యావసంద్ర వద్ద ఎదురుగా వచ్చిన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వస్తున్న దొడ్డ తాలూకా రామయ్యనపాళ్యకు చెందిన రాజప్ప (45), వెంకటేశప్ప (43) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను దొడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దొడ్డబెళవంగల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రతి కుటుంబానికి రూ. 2 వేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలోని యజమానురాలికి నెలకు రూ. 2 వేలు ఆర్థికసాయం చేస్తామని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. శుక్రవారం కోటాలదిన్నెలోని మారెమ్మ దేవతకు పూజలు నిర్వహించి హోసూరు హోబళీలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బొమ్మశెట్టిహళ్లి, రమాపుర, ఆనూడి, కదిరనహళ్లి, కుదురేబాల్య, రంగనహళ్లి తదితర గ్రామాలలో మాట్లాడుతూ... 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తామని, తాలూకాలో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రచార కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ హనుమంతరెడ్డి, టీపీఎస్ మాజీ అధ్యక్షుడు లోకేశ్, గంగాధర, రేణుక, మాజీ మునిసిపాలిటీ సభ్యురాలు కల్పన, మంజుల, ప్రకాశ రెడ్డి, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై స్థానికులతో ఎమ్మెల్యే భేటీ



కృష్ణరాజపురం: మహాదేవపుర ఎమ్మెల్యే, మాజీ మంత్రి అరవింద లింబావళి శుక్రవారం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నగరంలోని కాటం నెల్లూరులోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

శివరాత్రికి సిద్ధమైన కామనదుర్గం



కామనదుర్గం కొండ



మూల విరాట్ రామలింగేశ్వర స్వామి విగ్రహం

- వనవాస సమయంలో సీతారాముల సంచారం

పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకా నీలమ్మనహళ్ళి గ్రామం సమీపంలో నెలకొన్న కామనదుర్గం కొండపై 14 ఏళ్ల వన వాస సమయంలో రామచంద్రుడు, సీతాదేవి, లక్ష్మణుడు సంచరించిన ఆనవాళ్ళు, రాతి విగ్రహాలు, శిలా శాసనాలు, శిల్పాల రూపంలో నేటికి దర్శనమిస్తాయి. కామిలికొండ, కాకాద్రి గిరి, కాకాద్రి పర్వతంగా పిలిచే కామనదుర్గం 6 వేల ఎకరాల విస్తీర్ణం తో సముద్ర మట్టానికి 3,720 అడుగుల ఎత్తులో ఉంది. కామనదుర్గానికి 'కాకులు వాలని కామిలి కొండ' అనే పేరు కూడా ఉంది.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం

కామన దుర్గం పై శివలింగాన్ని సాక్షాత్తు శ్రీ రామ చంద్రుడే ప్రతిష్ఠించినట్లు ప్రతీతి, అందుకే ఇక్కడ శివున్ని రామలింగేశ్వర స్వామిగా భక్తులు పూజిస్తారు. కామనదుర్గం పై శివరాత్రి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. కర్ణాటక నుంచే కాకుండా ఆంధ్ర నుంచి భక్తులు కొండకు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఎండను సైతం లెక్క చేయకుండా వృద్ధులు, మహిళలు కొండపైకి చేరుకుని వేడుకల్లో పాల్గొంటారు. శనివారం ఉపవాసం ఉండి రాత్రి ఆలయంలో రామ భజనలు చేసి జాగరణ చేస్తారు. ఒకనాడు నక్సలైట్లకు ఆలవాలంగా ఉండే కామిలి కొండ వారి ప్రాబల్యం తగ్గి నేడు రామలింగేశ్వర స్వామి భక్తులకు కొండ అండగా నిలిచింది.

రెండు గ్రూపుల ఘర్షణ.. ఇద్దరి హత్య

- ఎన్నికల వేళ బయటపడిన విభేదాలు ?

దొడ్డబళ్లాపురం: రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు హత్యకు గురయ్యారు. ఈ ఘటన దొడ్డ తాలూకా దొడ్డబెళవంగలలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు... దొడ్డబెళవంగల ప్రభుత్వ కాలేజీ క్రీడామైదానంలో శివరాత్రి సందర్భంగా బీజేపీ నేత ఒకరు క్రీడా పోటీలు ఏర్పాటు చేసారు. క్రికెట్ పోటీల సందర్భంగా రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం, ఘర్షణ నెలకొంది. అది కాస్త ముదిరి పరస్పరం కత్తులు, రాళ్లతో దాడి చేసుకునే వరకూ వెళ్లింది ఘర్షణలో భరత్ (23), ప్రతీక్ (17) అనే ఇద్దరు కత్తిపోట్లకు గురయ్యారు. ఇద్దరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. దొడ్డబెళవంగల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దొడ్డబెళవంగలలో ఉద్రిక్త పరిస్థితి

19న నటి ప్రేమకు సన్మానం



శివమొగ్గ: కన్నడ నటి ప్రేమ చిత్రసీమలోకి అడుగుపెట్టి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించడానికి సమన్వయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివమొగ్గ నగరంలో ఉన్న కువెంపు రంగ మందిరంలోని ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు శ్రీగందదగొంబె అవార్డు ప్రదానం చేయడంతో పాటు సన్మానం కార్యక్రమం నిర్వహిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కన్నడ సినిమాకు చెందిన ప్రముఖ దర్శకుడు సునీల్ కుమార్ దేశాయి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఎంపీ బీవై రాఘవేంద్ర అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

బనశంకరి: బార్ ఉద్యోగి హత్య కేసులో పోలీసులు ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈనెల 23న నగరంలోని కుమారస్వామి లేఔట్‌లోని ఓ బార్‌కు సురేశ్, వినోద్‌కుమార్ వచ్చారు. మద్యం సరఫరాలో కొంత ఆలస్యం కావడంతో అక్కడి ఉద్యోగి బసవరాజ్ (39)తో గొడవకు దిగారు. అనంతరం బయటకు వచ్చారు. రాత్రి 10 గంటల సమయంలో మళ్లీ బార్ వద్దకు వెళ్లారు. అక్కడే విశ్రమిస్తున్న బసవరాజ్ పట్టుకుని తీవ్రంగా కొట్టి తలను గోడకు కొట్టి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన బసవరాజ్‌ను ఆస్పత్రికి తరలించగా కోమాలోకి వెళ్లడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

తుమకూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సీఎం. రాజేష్‌గౌడ అన్నారు. శుక్రవారం తుమకూరు జిల్లా శిరా తాలూకా గౌడగెరె సమీపంలోని హోసహళ్లి, గొల్లరహట్టి, హులికుంటె, నిడగట్ట, కొట్టపాళ్య, శాశమూరు, గ్రామాల్లో రూ. 2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇచ్చి హామీ మేరకు ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

కాంగ్రెస్ ధర్నా



మండ్య: మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్థ నారాయణను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం మండ్యలో ధర్నా నిర్వహించారు. నగరంలోని జేసీ సర్కిల్ వద్దకు చేరుకున్న కార్యకర్తలు, సిద్దరామయ్య అభిమానులు బెంగళూరు–మైసూరు జాతీయ రహదారిలో భారీ ర్యాలీగా జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని అక్కడ జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



చింతామణి: మాఘ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని చింతామణి పట్టణంలోని నారసింహపేటలో వెలసిన గంగమ్మకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దేశాభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలి

మైసూరు: ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగం, ధరల పెరుగుదల, విపత్తులు, రాజకీయ ఉత్కంఠత నెలకొంటున్న తరుణంలో అందరూ ధైర్యం కలిగి ఉండాలని అంతర్జాతీయ వృత్తిపర లెక్క పరిశోధన సంఘం అధ్యక్షుడు అనూప్ ఎస్. మెహతా అన్నారు. శుక్రవారం మైసూరు నగరంలోని జేఎస్ఎస్ ఆస్పత్రి రాజేంద్ర శతమానోత్సవం సమావేశం హాల్లో నిర్వహించిన జేఎస్ఎస్ మహా విద్యాపీఠం సువర్ణ మహోత్సవం, దత్తి ఉపన్యాస కార్యక్రమంలో 'రేపటి భారత దేశం ఈ రోజు ప్రారంభం అవుతుంది' అనే అంశంపై ఉపన్యసిస్తూ ప్రతి ఒక్కరు కూడా వ్యక్తిగత జీవితంపై శ్రద్ధ చూపాలని, దేశ సంక్షేమం కోసం పనిచేయాలన్నారు.

ఔట్ పేషెంట్ విభాగం ప్రారంభం



తుమకూరు: సిద్ధగంగ వైద్యవిద్యా ఆస్పత్రిలో శుక్రవారం మఠాధ్యక్షుడు సిద్ధలింగస్వామీజీ ఔట్ పేషెంట్స్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ...వైద్యులు రోగులను ఆప్యాయంగా పలకరించి వైద్యం చేయాలని, అప్పుడే వారిలో నమ్మకం కలుగుతుందన్నారు.

మంత్రి అశ్వత్థ నారాయణపై ఫిర్యాదు



శివమొగ్గ: మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్థ నారాయణపై శుక్రవారం శివమొగ్గ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌కు కృతజ్ఞతలు



సుధాకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చింతామణి: నాలుగు నెలల చిన్నారి వైద్యానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌ను శుక్రవారం సన్మానించారు. పట్టణంలోని ఫారూక్ పాషా, అస్మాతాజ్ దంపతుల చిన్నారి అనారోగ్యం బారిన పడటంతో వారు విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చిన్నారిని బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. చిన్నారి పూర్తిగా కోలుకోవడంతో బాధితులు సుధాకర్ నివాసానికి వచ్చి శాలువ కప్పి సత్కరించారు.

రాగి వామి దగ్ధం

యశవంతపుర: రాగివామిపై కరెంట్ తీగ పడి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటన హాసన జిల్లా అరసీకెరె తాలూకా కణకట్టె హొబళి కల్లసారహళ్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు హనుమంతప్ప కొద్ది రోజుల క్రితం రాగి పంటను కోసి వామి వేశారు. మధ్యాహ్నం ఆకస్మికంగా కరెంట్ తీగ తెగి రాగి వామిపై పడి మంటలు ఏర్పడి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే పంట మొత్తం కాలి బూడిదైంది. రూ. లక్షల్లో పంట నష్టం జరిగిందని బాధితుడు హనుమంతప్ప తెలిపారు.

తీరప్రాంతంలో తుపాన్

యశవంతపుర: మంగళూరు తీరప్రాంతం, కేరళలోని పలు ప్రాంతాలలో భారీ తుపాన్ ఏర్పడిందని జాతీయ సాగర, వాతావరణ పరిశోధన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం రాత్రి నుంచి కరావళి, కేరళలోని పలు ప్రాంతాలలో సముద్రంలో 2 మీటర్లు ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులను హెచ్చరించారు. అదే సమయంలో సముద్ర స్నానానికి అనుమతించడం లేదు. తీరం వెంబడి సురక్షిత చర్యలు తీసుకున్నారు.

హోసూరు వార్తలు..

రెండు టెంపోలు ఢీ, డ్రైవర్లకు గాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం

కెలమంగలం: రెండు టెంపోలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి డెంకణీకోట సమీపంలో చోటు చేసుకొంది. డెంకణీకోట, తళి తదితర చుట్టుపక్కల గ్రామాల్లో రైతులు పండించే పూలను టెంపోల ద్వారా చెన్నై, సేలం, మధురై, తిరుచ్చి తదితర ప్రాంతాలలోని మార్కెట్‌లకు తరలిస్తుంటారు. గురువారం రాత్రి డెంకణీకోట నుంచి పూలను తీసుకెళ్తున్న టెంపోను కెలమంగలం రోడ్డులో కళుగోపసంద్రం వద్ద మరో టెంపో ఢీకొట్టింది. పూల టెంపో పల్టీలు కొట్టి పూలు రోడ్డు మీద చెల్లాచెదురయ్యాయి. రెండు వాహనాల డ్రైవర్లు తీవ్ర గాయాలతో వాహనాల్లో ఇరుక్కుపోయారు. డెంకణీకోట పోలీసులు చేరుకుని డ్రైవర్లను ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

హోసూరు: రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి చెందిన ఘటన మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకొంది. హోసూరు సమీపంలోని ఆవలపల్లి గ్రామానికి చెందిన లిథేష్ (19) గురువారం రాత్రి హోసూరు – కెలమంగలం రోడ్డుపై ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన లిథేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాఠశాల గదులకు భూమిపూజ

కెలమంగలం: డెంకణీకోటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం కెలమంగలం యూనియన్ ఛైర్మన్ కేశవమూర్తి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో గత కొద్ది రోజుల క్రితం తొలగించారు. కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాఠశాల యంత్రాంగం కోరుతూ వచ్చింది. ఛైర్మన్ సంబంధిత శాఖాధికార్లతో చర్చించి నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం లిల్లీ సోఫియా, జయపాల్, సాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బంది.. వేటగాళ్ల మధ్య కాల్పులు

బనశంకరి: కర్ణాటక అటవీశాఖ సిబ్బంది, తమిళనాడు వేటగాళ్ల మధ్య కాల్పులు జరిగిన ఘటన కర్ణాటక–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన పాలారులో చోటుచేసుకుంది. వన్యజీవి విభాగ పాలార్ అటవీ ప్రదేశంలోకి తమిళనాడు వేటగాళ్లు అక్రమంగా చొరబడి అడవి జంతువులు వేటాడటానికి ప్రయత్నించారు. ప్రశ్నించిన కర్ణాటక అటవీశాఖ సిబ్బందిపై కాల్పులకు దిగారు. దీంతో వారు ఎదురు కాల్పులు జరిపారు.

రాజధానికి రూ.9,698 కోట్ల నిధులు



నగరవాసులకు సమస్యగా మారిన వాహనాల సమస్య. బెంగళూరు యలహంకలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ

- ట్రాఫిక్ నియంత్రణకు బడ్జెట్లో కొత్త పథకాలు

బనశంకరి: బెంగళూరునగర సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.9,698 కోట్లు నిధులను కేటాయించామని సీఎం బొమ్మై తెలిపారు.

–అమృత నగరోత్థాన పథకం కింద బెంగళూరులో రూ.6,000 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం. హైడెన్సిటీ కారిడార్ పథకం కింద 108 కిలోమీటర్ల మేర రోడ్లను రూ.273 కోట్లతో అభివృద్ధి. వర్షం నీరు సజావుగా వెళ్లేలా 195 కిలోమీటర్ల పొడవునా డ్రైనేజీ, కల్వర్టులు అభివృద్ధి కోసం రూ.1,813 కోట్లు కేటాయించారు.

- ముఖ్యమైన 75 జంక్షన్లను రూ.150 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆటంకాలు లేని వాహన సంచారం.
- టిన్ ఫ్యాక్టరీ నుంచి మేడహళ్లి వరకు రూ.350 కోట్ల వ్యయంతో 5 కిలోమీటర్లు ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం, సబర్బన్ రైల్వే మండలితో సమన్వయం సాధించి యశవంతపుర రైల్వేస్టేషన్ నుంచి మత్తికెరె, బీఈఎల్ రోడ్డు వరకు ఇంటిగ్రేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించి నేరుగా అనుసంధానిస్తారు.
- రూ.100 కోట్లతో బెంగళూరు 120 కిలోమీటర్ల ఆర్టీరియల్ రోడ్ల వైట్‌టాపింగ్, నగరంలో 300 కిలోమీటర్లు ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లను రూ.450 కోట్లు వ్యయంతో బాగు చేస్తారు.
- మెట్రో రైలును సెంట్రల్ సిల్క్‌బోర్డు జంక్షన్ నుంచి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా 30 స్టేషన్లతో 58.19 కిలోమీటర్ల పొడవునా పనులను త్వరితగతిన పూర్తిచేయడం. ఈ ఏడాది 40.15 కిలోమీటర్లలో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యమని తెలిపారు.
- బెంగళూరు ఉపనగర రైల్వే పథకానికి రూ.1,000 కోట్లు కేటాయింపు.
- కావేరి నీటి సరఫరా పథకం 5వస్టేజ్ పనులను రూ.5,550 కోట్ల అంచనా వ్యయంతో 2023–24 లో పూర్తిచేయడం. 775 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఈ పథకం వల్ల నగరంలో 50 లక్షలమందికి తాగునీరు లభిస్తుందని బడ్జెట్లో పేర్కొన్నారు. చెత్త, మురుగునీటి నిర్వహణకు సంస్కరణ కేంద్రాల ఏర్పాటు.
- బెంగళూరులో ది సేఫ్ సిటీ ప్రాజెక్ట్ కింద 1,640 చోట్ల 4,100 సీసీ కెమెరాలను ఇప్పటికే అమర్చగా కమాండ్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ. ఈ పథకాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేయడం కోసం రూ.261 కోట్ల నిధులు కేటాయింపు.

ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో చోరీ

- సిబ్బంది చేతివాటం

దొడ్డబళ్లాపురం: ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో పనిచేసే వారే రెండు నెలలుగా చోరీ చేస్తున్న సంగతి ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన దొడ్డ తాలూకా అపెరల్ పార్క్‌లోని శ్రీవశిష్ట ట్రేడర్స్ ఫ్యాక్టరీలో చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో పనిచేసే లయ, వంశీకృష్ణ ఇద్దరూ గత రెండు నెలలుగా చోరీకి పాల్పడుతున్నట్లు ఫ్యాక్టరీ యజమాని రమేశ్ జమనా తెలిపారు. లయ, వంశీకృష్ణ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఐస్‌క్రీం తయారు చేసేందుకు ఉపయోగించే గియాం డ్యూజ్, క్యాశువ్ కార్నల్, రోస్టెడ్ ఆల్మండ్ పేస్ట్, వైట్ చాక్లెట్ పేస్ట్ తదితర పదార్థాలను రెండు నెలలుగా చోరీ చేస్తున్నారు.

కెమెరాలకు గ్రీసు పూసి చోరీ

అనుమానం వచ్చి లయ, వంశీకృష్ణ ఇద్దరి రూంలలో చెక్ చేయగా సుమారు రూ.1.75 లక్షల విలువైన పదార్థాలు లభించాయి. ఘటనకు సంబంధించి దొడ్డ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రసుతం ఇద్దరూ పరారీలో ఉన్నారు.

విద్యార్థుల కోసం ప్రభుత్వ యాప్

హోసూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను పెంచేందుకు తమిళనాడు ప్రభుత్వం టీఎన్ ఎస్ఈడీ అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో శుక్రవారం ఈ పథకాన్ని కలెక్టర్ దీపక్ జేకబ్ ప్రారంభించారు. ప్రభుత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలనేది ఉద్దేశమన్నారు. విద్యాశాఖాధికార్లు, ఉపాధ్యాయులు ఈ యాప్ ద్వారా విద్యార్థులను ప్రతిభావంతులుగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో హోసూరు కమిషనర్ స్నేహ, జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారిణి మహేశ్వరి, అధికారులు మణిమేఘలై, ఆనంద్, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు

హోసూరు పారిశ్రామిక ప్రాంతంలోని బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో 6, 7, 8వ తరగతులకు చెందిన విద్యార్థినులకు యూనిలీవర్ సంస్థ వారు మూడు విభాగాల్లో చిత్రలేఖన పోటీలు జరిపారు. ఈ పోటీల్లో మూడు విభాగాలకు చెందిన విద్యార్థినీలు సాఫియా, శరణ్య, జ్యోతిశ్రీ, నిషా, గుణరాగవి, నందిని, మోనిక, సలామత్, ప్రియాంకతో 9 మంది విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.

ఒంటి ఏనుగు స్వైర విహారం



దిన్నూరు ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటి ఏనుగు

హోసూరు: డెంకణీకోట సమీపంలో గురువారం సాయంత్రం ఒంటి ఏనుగు ప్రజలను భయాందోళనలకు గురి చేసింది. బెంగళూరు వద్ద బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి వలస వచ్చిన వందకు పైగా ఏనుగులను అటవీశాఖాధికారులు కర్ణాటక వైపు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో డెంకణీకోట సమీపంలోని దిన్నూరు వద్దకు చేరుకొన్న 9 ఏనుగుల్లో ఓ ఏనుగు విడిపోయి దిన్నూరు, పాపిరెడ్డిపాళ్యం, గొల్లపల్లి, తొట్టి, బాలతోటనపల్లి, ఉబ్బరాయనపల్లి, కెంబత్తపల్లి ప్రాంతాల్లో ఆక్రోశంతో సంచరిస్తూ రైతులు పండిస్తున్న పంటలను ధ్వంసం చేశాయి. వాటి సంచారం చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఒంటి ఏనుగును అటవీ ప్రాంతంలోకి మళ్లించారు.

వాహనదారులకు జరిమానా



వాహనాలను ఆపి పరిశీలిస్తున్న ఏఎస్పీ కౌశిల్

చింతామణి: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఉదయం ఏఎస్పీ కౌశిల్ స్వయంగా రంగంలోకి దిగి వాహనాల లైసెన్స్‌లు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని ఏఎస్పీ సూచించారు.

వేడుకగా వార్షికోత్సవం



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి మంగమ్మనపాళ్య వార్డు సామసంద్రపాళ్యలో వెలసిన శ్రీ అంగాల పరమేశ్వరి అమ్మవారి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు, సమాజ సేవకులు మాల శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు మురళీధర్ రెడ్డి, గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారికి జ్యోతులు తీసుకెళ్లారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మంటగలిసిన మానవత్వం



ఆటో నుంచి పడేస్తున్న దృశ్యం

యశవంతపుర: ఉడుపి జిల్లాలో మానవత్వం మంట కలిసింది. తమ జతలో ఉన్న వ్యక్తి మరణిస్తే అంత్యక్రియలు చేయాల్సిన వారు శవాన్ని ఆటోలో తీసుకెళ్లి పడేసిన ఘటన మల్పె పోలీసుస్టేషన్ పరిధిలోని కెమ్మణ్ణు గ్రామం మార్గంలో చోటుచేసుకుంది. 40 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. కల్లు వ్యాపారి మృతదేహాన్ని ఆటోలో తీసుకువచ్చి కెమ్మణ్ణు మార్గంలో పడేశారు. దుర్వాసన రావటంతో పరిశీలించగా మృతదేహం బయటపడింది. అక్కడి సీసీ కెమెరాను పరిశీలించగా ఈ దృశ్యాలు బయటపడ్డాయి. కల్లు వ్యాపారం చేసే వ్యక్తి జతలో మృతుడు కూడా ఉండేవాడు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గంగా జలాల పంపిణీ

మండ్య: మహాశివరాత్రి సందర్భంగా ధార్మిక శాఖ ఆధ్వర్యంలో మండ్య నగరంతో పాటు జిల్లాలోని వివిధ తాలూకాల్లోని శివాలయాలకు పవిత్ర గంగాజలం పంపిణీ చేశారు. మండ్య నగరంతో పాటు శ్రీరంగ పట్టణ, పాండవపుర, కేఆర్ పేటె, నాగమంగళ, మళవళ్లి తాలూకాలకు క్యాన్లను పంపిణీ చేశారు. ఆదనపు జిల్లా అధికారి నాగరాజు మాట్లాడుతూ... మహా శివరాత్రి సందర్భంగా అన్ని శివాలయాలకు గంగా జలాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

పారదర్శకంగా ఎర్రచందనం వేలం

- 5,376.043 మెట్రిక్ టన్నుల వేలానికి కేంద్ర అనుమతులు
- ఫేజ్–15లో 417.650 మెట్రిక్ టన్నులకు గ్లోబల్ టెండర్లు
- ఎర్రచందనం ఎగుమతిదారులతో సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి



తిరుపతి అలిపిరి: ఎర్ర చందనం వేలాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని రాష్ట్ర అటవీ, విద్యుత్, మైనింగ్‌శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో శుక్రవారం ఎర్రచందనం ఎగుమతిదారుల ప్రోత్సాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ బిడ్డర్లకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేంద్రం నుంచి రావల్సిన పలు అనుమతుల విషయంలో కూడా ఏపీ అధికారులు తోడ్పాటు అందిస్తారన్నారు. సిండికేట్‌గా కాకుండా పారదర్శకంగా అందరూ వేలంలో పాల్గొనాలని కోరారు. 5,376.043 మెట్రిక్ టన్నులు వేలం వేయడానికి అనుమతులు లభించాయన్నారు. దశల వారీగా టెండర్ వేలం ప్రక్రియను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎర్రచందనం ఎగుమతిదారుల సందేహాలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ నివృత్తి చేశారు. ఫేజ్–15లో 417.650మెట్రిక్ టన్నులకు గ్లోబల్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23న తొలి దశ వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలి దశలో మిగిలిన సరుకుకు మార్చి 2న తిరిగి వేలం నిర్వహిస్తామన్నారు. ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్ జి.దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఏపీఎఫ్‌డీసీ క్యాలెండర్, డైరీలను పెద్దిరెడ్డి ఆవిష్కరించారు.

సాగర తీరాన సైన్యమై..

గుడ్లు పెట్టేందుకు విదేశాల నుంచి తరలివస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లు

- 20 వేల కి.మీ. ప్రయాణించి తూర్పు తీరానికి రాక
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రత్యేక హేచరీల ద్వారా సంరక్షణ
- ఇప్పటికే 12,624 గుడ్లు సేకరణ
- గుడ్లు సేకరించి.. తాబేలు పిల్లల్ని సముద్రంలోకి విడిచిపెడుతున్న అటవీ శాఖ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని సముద్ర తీరాలకు చేరుకుంటున్నాయి. అంతరించిపోతున్న జాబితాలో ఉన్న ఈ జాతి తాబేళ్లను రక్షించేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లలో ఏడు రకాల జాతులు ఉన్నాయి. వీటిలో 5 రకాలు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఎక్కువ. రెండు అడుగుల వెడల్పు.. 50 కిలోల వరకూ బరువు పెరిగే ఈ తాబేలు ఎక్కడైతే గుడ్డు నుంచి పిల్లగా బయటకు వస్తుందో.. తిరిగి అక్కడికే వచ్చి గుడ్లు పెట్టడం ఈ జాతి ప్రత్యేకత.

ఆలివ్ రిడ్లే తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు సుమారు 20 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి తీరానికి వస్తాయి. దేశంలోని ఒడిశా తీరంలో ఈ జాతి తాబేళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఆ తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌దే. మన రాష్ట్రంలో కాకినాడ తీరంలోని ఉప్పాడ, హోప్ ఐలాండ్, కోరంగి అభయారణ్యం, కృష్ణా జిల్లాలోని కోడూరు మండలం పాలకాయతిప్ప నుంచి నాగాయలంక మండలం జింకపాలెం వరకూ, గుంటూరు జిల్లాలో నిజాంపట్నం, బాపట్ల పరిధిలోని సూర్యలంక ప్రాంతం వరకు ఈ జాతి తాబేళ్లు ఎక్కువగా వస్తుంటాయి.

ఆడా.. మగా నిర్ధారించేది ఉష్ణోగ్రతలే

ఆలివ్ రిడ్లే తాబేలు గుడ్లు పెట్టి పిల్లగా మారడానికి 28 డిగ్రీల నుంచి 32 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత అవసరం అవుతుంది. 30 నుంచి 32 డిగ్రీల మధ్య పుట్టిన తాబేలు ఆడ తాబేలు అవుతుంది. అంతకంటే తక్కువ డిగ్రీల ఉష్ణోగ్రతలో పుట్టే పిల్లలు మగ తాబేళ్లు అవుతాయి. సృష్టిలో ఒక్క తాబేలు జాతికి మాత్రమే ఇలాంటి ప్రత్యేకత ఉంది. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఏటా అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఫలదీకరణ కోసం వస్తుంటాయి. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెడతాయి.



సముద్రంలోకి వెళుతున్న ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలు

ఇసుకలో 30 నుంచి 45 సెం.మీ. లోతున కుండాకారంలో గొయ్యి తీసి.. 60 నుంచి 120 వరకూ గుడ్లు పెడతాయి. గొయ్యి తీసేదగ్గర నుంచి గుడ్లు పెట్టడానికి 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం తీసుకుంటుంది. ఈ గుడ్లు 45 నుంచి 50 రోజుల తరువాత పిల్లలు బయటకొస్తాయి. ఆలివ్ రిడ్లే తాబేళ్ల వల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుంది. సముద్రంలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు.. చేపల సంతానం వృద్ధి చెందేందుకు తాబేలు ఎంతగానో దోహదపడుతుంది. చేప పిల్లలను తిని జీవించే జెల్లీ చేపలను తాబేలు తినడం వల్ల చేపల ఉత్పత్తి పెరుగుతుంది. తాబేలు ఎంత లోతులో ఉన్నా ప్రతి 45 నిమిషాలకు ఒకసారి నీటిపైకి వచ్చి ఆక్సిజన్ తీసుకుని లోపలకు వెళుతుంటుంది. అవి నీటిలో పైకి, కిందకు రావడం వల్ల నీటిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. ఈ విధంగా పర్యావరణానికి తాబేలు ఎంతో మేలు చేస్తుంది.

ప్రత్యేక హేచరీల ద్వారా రక్షణ

అరుదైన ఆలివ్ రిడ్లే జాతి తాబేలుని రక్షించేందుకు అటవీ శాఖాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అవనిగడ్డ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కోడూరు మండలం పాలకాయతిప్ప వద్ద ఒకటి, నాగాయలంక మండలం లైట్‌హౌస్ శివారు ఐలాండ్ దగ్గర మూడు, సంగమేశ్వరం వద్ద ఒకటి, నిజాంపట్నం, సూర్యలంక వద్ద రెండు హేచరీలను ఏర్పాటు చేశారు. 2009 నుంచి ఇప్పటి వరకూ 5 లక్షల తాబేళ్లను సముద్రంలోకి వదిలారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ కృష్ణా జిల్లా పరిధిలో 12,624 గుడ్లను సేకరించినట్టు అధికారులు చెప్పారు.

తాబేళ్ల సంఖ్య పెరుగుతోంది

ఆలివ్ రిడ్లే తాబేళ్లు గుడ్లు పెట్టే కాలంలో వాటి ప్రాణాలకు ముప్పు వాటిల్లే వలలు వేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై మత్స్యశాఖ అధికారులతో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గతంలో కంటే గుడ్లు పెట్టేందుకు వచ్చే తాబేళ్ల సంఖ్య ఏటా పెరుగుతోంది.

– కేవీఎస్ రాఘవరావు, ఫారెస్ట్ అధికారి, అవనిగడ్డ రేంజ్



గుడ్డు పెడుతున్న తాబేలు



తాబేలు గుడ్లను సేకరిస్తున్న అటవీ శాఖ సిబ్బంది



నాగాయలంక మండలం ఐలాండ్ వద్ద సముద్రంలోకి తాబేళ్లను వదులుతున్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది



సముద్రంలోకి వదిలేందుకు సిద్ధంగా ఉన్న ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలు

ఎస్సీ గురుకుల విద్యార్థుల జయకేతనం

- ఎన్ఎస్ఐసీ పోటీల్లో పెదపావని గురుకులానికి ప్రథమ స్థానం
- మంత్రి మేరుగు నాగార్జున వెల్లడి



ఎన్ఎస్ఐసీ పోటీల్లో విజయం సాధించిన పెదపావని విద్యార్థులు సుష్మ, మహిత

సాక్షి, అమరావతి: బెంగళూరులో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన నేషనల్ స్కూల్ ఇన్నొవేషన్ చాలెంజ్ (ఎన్ఎస్ఐసీ) పోటీల్లో ప్రకాశం జిల్లా పెదపావని ఎస్సీ గురుకులానికి చెందిన విద్యార్థులు సత్తాచాటి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. ఈ–విద్యాలోక్, ఎల్ అండ్ టీ సంస్థలు సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐక్యరాజ్యసమితి ప్రామాణికంగా నిర్ధారించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ఆధారంగా ప్రజెంటేషన్స్ ఇవ్వడానికి ఈ–విద్యాలోక్, ఎల్ అండ్ టీ ఇచ్చిన ఓపెన్ చాలెంజ్‌ను స్వీకరించి దేశవ్యాప్తంగా అనేక విద్యాలయాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బృందాలు పలు ప్రజెంటేషన్లను వివిధ స్థాయిల్లో సమర్పించాయని తెలిపారు. వాటిలో 26 ప్రజెంటేషన్‌లను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వాటిలో పెదపావని (ప్రకాశం), గోపాలపురం(తూర్పుగోదావరి జిల్లా), నరసాపురం (ఎన్టీఆర్ జిల్లా) ఎస్సీ గురుకులాల విద్యార్థుల ప్రజంటేషన్లు కూడా ఉన్నాయని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పెదపావని గురుకులానికి చెందిన విద్యార్థులు ఎ.సుష్మ, డి.మహిత 'సారంలేని మట్టితో హరిత విప్లవం' అనే అంశంపై రూపొందించిన ప్రజంటేషన్‌కు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించిందని పేర్కొన్నారు. విద్యార్థినులకు రూ.60వేలు నగదు పురస్కారాన్ని నిర్వాహకులు అందించారని తెలిపారు. ఢిల్లీ, ముంబై వంటి మహానగరాల్లో పేరెన్నికగన్న కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులతో మారుమూల గ్రామాల నుంచి వచ్చిన ఎస్సీ విద్యార్థులు పోటీపడి తమ ప్రతిభ, ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యంతో అందరి దృష్టిని ఆకర్షించి జాతీయస్థాయిలో విజేతలుగా నిలవడం ఎస్సీ గురుకులాలకే కాదు... రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఐసీ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎ.సుష్మ, డి.మహిత, వారికి స్ఫూర్తినిచ్చిన టీచర్ ఎ.దుర్గాభవాని, ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి, ఏఎంవో ఎన్.సంజీవరావు తదితరులకు మంత్రి నాగార్జున అభినందనలు తెలిపారు.

శబరి దళ కమాండర్‌ను కోర్టులో హాజరు పరచాలి

- మావోయిస్టు పార్టీ డిమాండ్

సాక్షి, పాడేరు: మావోయిస్టు పార్టీ శబరి దళ కమాండర్ సందీప్‌ను తక్షణమే కోర్టులో హాజరుపరచాలని, లేనిపక్షంలో ఇరు రాష్ట్రాల అధికార పార్టీల నేతలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ మావోయిస్టు నేత ఆజాద్ హెచ్చరిస్తూ లేఖ విడుదల చేశారు. పార్టీ పనిపై వెళ్లిన దళ కమాండర్ సందీప్‌ను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఇంతవరకు పోలీసులు ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కామ్రేడ్ సందీప్‌కు ఎలాంటి హాని తలపెట్టినా సహించేది లేదని తెలిపారు. భారత రాష్ట్రసమితి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇలాంటి అరెస్ట్‌లను ప్రోత్సహించడం మంచిది కాదని లేఖలో పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తాం: లోకేశ్

శ్రీకాళహస్తి రూరల్: తాము అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని టీడీపీ నాయకుడు లోకేశ్ చెప్పారు. ఆయన నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర శుక్రవారం తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని లక్ష్మీపురం నుంచి శ్రీకాళహస్తి చేరుకుంది. ఈ సందర్భంగా రామచంద్రాపురంలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ మూడన్నరేళ్లలో నిత్యావసరాల ధరలు భారీగా పెంచి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. యువగళం చూసి జగన్ రెడ్డికి జ్వరం వచ్చిందన్నారు. తన పాదయాత్రను అడ్డుకోవడానికి పోలీసు బలగాలను ఉపయోగించారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం గడుపుతున్నారన్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక అందుబాటులో ఉండేదని, నేడు ట్రాక్టర్‌కు రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. టాక్స్‌లపై టాక్స్‌లు వేసి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ జిల్లా సైకో... అంటూ వ్యాఖ్యానించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గాన్ని కేక్‌లాగా కోసి దోచుకుంటున్నారని విమర్శించారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో జే టాక్స్ వసూలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. లోకేశ్ ప్రసంగం మొదలు పెట్టిన వెంటనే శ్రీకాళహస్తి నియోజకవర్గం అనాల్సిందిపోయి సత్యవేడు నియోజకవర్గం అనడంతో అందరూ ఒక్కసారిగా విస్తుపోయారు. ఆయన మాట్లాడేటప్పటికే చాలామంది ప్రజలు ఇంటిదారి పట్టారు.

పోలవరంపై బాబుది ప్రచార ఆర్భాటమే

పోలవరం రూరల్/రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా) : పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు కమీషన్ల కోసం వాడుకోవడమే కాక, పనులు చేయకుండానే ప్రచార ఆర్భాటంతో నాశనం చేశాడని, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. కాఫర్ డ్యామ్ పూర్తికాకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించడంవల్ల, వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ కొంత కొట్టుకుపోయి సమీపంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. ఈ పరిస్థితుల్లో తప్పులన్నీ సరిచేసుకుంటూ శరవేగంగా పోలవరం పనులు పూర్తిచేస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు లోయర్ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆయన శుక్రవారం ప్రాజెక్ట్ అప్పర్, లోయర్ కాఫర్ డ్యామ్‌లను తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏలూరు, రాజమండ్రి ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్, రాజానగరం, రంపచోడవరం, గోపాలపురం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, నాగులపల్లి ధనలక్ష్మి, తలారి వెంకట్రావులు, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అల్లూరి జిల్లా దిగువ కాఫర్ డ్యామ్ సమీపంలో మీడియాతో మాట్లాడారు. అంబటి ఏమన్నారంటే... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణంతో పాటు గేట్ల అమరిక పనులు కూడా పూరయ్యాయి. ప్రతిపక్షాలు, వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకులు అభూత కల్పనలు సృష్టిస్తున్నారు. టీడీపీ హయాంలో 72 శాతం పనులు పూర్తిచేశామన్నది పచ్చి అబద్ధం. స్పిల్‌వేకు ఒక గేటు పెట్టి ప్రచారం, భజన తప్ప, ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసింది ఏమీలేదు. ఇక ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) బృందాన్ని రప్పించి డయాఫ్రమ్‌వాల్ పరిస్థితి పరిశీలించాలని కోరగా, ఆ బృందం సభ్యులు ఇటీవల వచ్చి డయాఫ్రమ్‌వాల్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. నిజానికి.. అప్పర్ కాఫర్ డ్యామ్, లోయర్ కాఫర్ డ్యామ్‌కు మధ్య 22 మీటర్ల లోతులో గోతులు పడ్డాయి. రెండు వారాల్లో ఇక్కడి పరిస్థితిపై వివరాలు తెలుస్తాయి. అప్పుడు రూ.400 కోట్లు ఖర్చు అయ్యిందని, ఇప్పుడు ఎంతవుతుందో తెలియని పరిస్థితి అని, దీనికి బాధ్యుడు చంద్రబాబు కాదా?

ఈ ఏడాది ఆటంకాలుండవు

ఇక ఈ ఏడాది వరదలు వచ్చినా, వర్షాలు కురిసినా పనులు చేసుకోవడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేయడమే కాక, స్పిల్‌వే మీదుగా నీరు మళ్లించడం ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగింది. ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేసినట్టు చెప్పారు. నీటి గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పనులన్నీ ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. ఈయన పాలనలోనే ప్రాజెక్టు పూర్తవుతుంది. పోలవరంపై చంద్రబాబు బహిరంగంగా చర్చకు రావాలి.

శరవేగంగా పునరావాస పనులు పూర్తి

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పునరావాసానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆర్‌అండ్‌ఆర్‌కు నిధులు విడుదల చేసింది. చంద్రబాబు హయాంలో పునరావాసానికి రూ.193 కోట్లు విడుదల చేస్తే.. సీఎం వైఎస్ జగన్ రూ.1,024 కోట్లు విడుదల చేశారు. మరో వారం రోజుల్లో రూ.542 కోట్లు విడుదల చేస్తున్నారు. మరోవైపు.. పోలవరం జెడ్పీటీసీ కలుం హేమకుమారి మంత్రికి నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ నారాయణరెడ్డి, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్ డైరెక్షన్‌లో జోకర్ యాత్ర

- పునుగులు, బజ్జీలు తింటూ సెల్ఫీలతో పాదయాత్రా?: మంత్రి జోగి రమేష్
- సీఎం జగన్‌పై నోరు పారేసుకుంటే బడిత పూజ తప్పదు



సాక్షి, అమరావతి: పొత్తుల కోసం రాజకీయ బ్రోకర్‌లా చంద్రబాబు బేరసారాలు సాగిస్తుంటే ఆయన కుమారుడు లోకేశ్ ఓ జోకర్‌లా మిగిలారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యానించారు. రాజకీయాల పట్ల కనీస అవగాహన లేని లోకేశ్ పాదయాత్ర పేరుతో ఫన్నీయాత్ర చేస్తున్నారని చెప్పారు. బ్రోకర్ డైరెక్షన్‌లో జోకర్ యాత్ర జరుగుతోందని సర్వత్రా చర్చించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

- ▲ వంకర టింకర నడకతో రోడ్ల పక్కన పునుగులు, బజ్జీలు తింటూ సెల్ఫీలు దిగడాన్ని పాదయాత్ర అని ఎవరైనా అంటారా? పాదయాత్ర చేసే అర్హత లోకేశ్‌కు ఉందా? పోనీ ఆయన దరిద్రానికి ఎలా నడిచినా కనీసం ప్రజల ముందు మాట్లాడే భాషైనా సక్రమంగా ఉండాలి కదా? ఐదు కోట్ల మంది ప్రజల ఆదరణ పొందిన సీఎం వైఎస్ జగన్‌ను ఇష్టానుసారంగా బూతులు తిడతాడా? చంద్రబాబుకు, లోకేశ్‌కు జనం బడిత పూజ చేసే సమయం ఆసన్నమైంది. చంద్రబాబు పెద్ద సైకో అయితే లోకేశ్ పిల్ల సైకో.
- ▲ నక్కజిత్తుల నారా చంద్రబాబు తనయుడు లోకేశ్ పాదయాత్రలో మాట్లాడే విషయాలపై జనం నవ్వుకుంటున్నారు. ఇద్దరి యాత్రల తరువాత ఇక టీడీపీ శవయాత్రకు ముహూర్తమే తరువాయి. చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని కొందరు లోఫర్లు వీధి రౌడీల్లా మాట్లాడుతున్నారు.

పోలీసులూ ఖబడ్దార్!

- ప్రత్యేక కమిషన్ వేసి చక్రవడ్డీతో సహా లెక్క తేలుస్తాం
- పోలీసులపై మరోసారి విరుచుకుపడ్డ అచ్చెన్నాయుడు
- సీఎం, మంత్రులపైనా తీవ్ర వ్యాఖ్యలు



వజ్రపుకొత్తూరు: 'పోలీసులూ ఖబడ్దార్.. మీ ఆగడాలు చూస్తున్నా.. మేం అధికారంలోకి వస్తాం.. ఇప్పటికే చాలా మంది పోలీసు అధికారులు మారిపోయారు.. వారు నాకు ఫోన్ చేస్తున్నారు.. మారని 5 నుంచి10 శాతం వారికి చక్రవడ్డీతో సహా లెక్క తేలుస్తాం..' అంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పోలీసులపై విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బెండి పంచాయతీ మహదేవిపురంలో శుక్రవారం 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతల లిస్టు రాసుకోవాలని, వారిపై ప్రత్యేక కమిషన్ వేసి ఆటకట్టిస్తామన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాల్గొన్నారు.

పోలీసులు సంఘ విద్రోహ శక్తులు

- అధికారంలోకి రాగానే బొక్కలో వేయిస్తా
- నా సభకే అనుమతి ఇవ్వరా?
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మండిపాటు
- రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది
- నన్ను ఆపడం జగన్ వల్ల కాదు.. ఆయన్ను పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు



సాక్షి ప్రతినిధి, కాకినాడ : 'మీరు సంఘ విద్రోహ శక్తులుగా మారారు. రాబోయే రోజుల్లో మీరంతా నా దగ్గరే పని చేయాలి. ఇచ్చిన పర్మిషన్ కేన్సిల్ చేస్తారా? కొందరు పోలీసులైతే రౌడీలు మాదిరిగా ప్రవర్తిస్తున్నారు. నేను అధికారంలోకి రాగానే చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై సమీక్షిస్తా. ఇందుకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిని బొక్కలో పెడతా. మీరు చేస్తున్న పనులు చూసి మీ యూనిఫారం సిగ్గు పడుతోంది' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పోలీసులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. శుక్రవారం రాత్రి ఆయన తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో పోలీసులు సూచించిన ప్రాంతంలో కాకుండా, అనుమతి లేకుండా ఇరుకు రోడ్డుపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఉగ్రవాది, మాఫియా డాన్ జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్న దొంగ అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనుక్కు వెళ్లిందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా అరాచక పాలన సాగుతోందన్నారు. చెత్తమీద కూడా పన్ను వేసే చెత్త సీఎం జగన్ అని, రైతు వ్యతిరేకి అని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ధ్వజమెత్తారు. పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. సీఎం జగన్ వల్ల రెడ్లకు కూడా లాభం కలగలేదని చెప్పారు. 'నన్ను అడ్డుకోవడం జగన్ వల్ల కాదు.. జగన్‌ను పుట్టించిన దేవుడు వల్ల కూడా కాదు. ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు నేను దూసుకుపోతా. రాబోయే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎగురుతుంది' అని చెప్పారు.

రియల్టర్ కిడ్నాప్ కలకలం

- కారులో కాళ్లు, చేతులు కట్టేసి రూ.30 లక్షలు డిమాండ్ చేసిన రౌడీషీటర్ గ్యాంగ్
- రియల్టర్ అకౌంట్‌లో ఉన్న రూ.12 లక్షలు వసూలు
- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన వ్యాపారి

పీఎంపాలెం (భీమిలి): విశాఖలో రియల్టర్ కిడ్నాప్ వ్యవహారం కలకలం సృష్టించింది. గతంలో ఒక రియల్టర్ కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ గ్యాంగే మరో రియల్టర్‌ను కిడ్నాప్ చేసింది. వ్యాపారి నుంచి రూ.12 లక్షలు వసూలు చేసింది. వారి చెరనుంచి విడిపించుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు కిడ్నాపర్ల కోసం 10 బృందాలతో విస్తృతంగా గాలిస్తున్నారు. బాధితుడు పోలీసులకు చెప్పిన వివరాల ప్రకారం .. పెద రుషికొండ ప్రాంతంలో ఉన్న 'రో విల్లాస్'లో కొప్పొజు మధుసూదనరావు (33) కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. స్టాక్ ట్రేడింగ్‌తోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ చేస్తున్న రౌడీషీటర్ కోలా వెంకటహేమంత్‌తో అతడికి 2020లో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి రెండు, మూడు లావాదేవీలు కూడా చేశారు. మధుసూదనరావు తన విల్లాను రూ.1.8 కోట్లకు విక్రయానికి పెట్టారు. వెంకటహేమంత్ ఈ నెల 14వ తేదీన మధుసూదనరావుకు ఫోన్‌చేసి ఆ విల్లాను ఒక వ్యక్తి రూ.2.3 కోట్లకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాడని చెప్పాడు. రూ.30 లక్షలు కమీషన్‌గా ఇవ్వాలని కోరాడు. దీనికి అంగీకరించిన మధుసూధనరావు 15వ తేదీన ఉదయం 6.30 గంటలకు బేమౌంట్ రోడ్డు వద్దకు వెళ్లి.. వెంకటహేమంత్, మరో ఇద్దరు ఉన్న కారులో ఎక్కారు. కొంతదూరం వెళ్లిన తరువాత వెంకటహేమంత్ గ్యాంగ్ మధుసూదనరావు కాళ్లు, చేతులు కట్టేసి, నోటికి ప్లాస్టర్ వేసి గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధుసూదనరావు ప్రాణభయంతో తన అకౌంట్‌లో ఉన్న రూ.12 లక్షలు వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. మధుసూదనరావు వద్ద ఉన్న బంగారు వస్తువులు, మొబైల్‌ను వారు కాజేశారు.

పోలీసుల గాలింపు: వారినుంచి తప్పించుకున్న మధుసూదనరావు శుక్రవారం పీఎంపాలెం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ–1 సుమిత్ సునీల్ గరుడ్ కేసును పర్యవేక్షిస్తున్నారు. కిడ్నాపర్లను పట్టుకునేందుకు 10 బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. కోలా వెంకటహేమంత్‌పై నగరంలో వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులున్నాయి. రౌడీషీట్ ఉన్న అతడు గతంలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన కేసులో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలుస్తోంది. గత నెల 11వ తేదీన ఒక కేసులో జైలుకు వెళ్లి 13వ తేదీన బయటకు వచ్చినట్లు సమాచారం. బయటకు వచ్చిన నెలరోజుల్లో మరో కిడ్నాప్‌కు పాల్పడడం గమనార్హం. ఈ కిడ్నాపర్ల కోసం ఒకవైపు గాలిస్తూనే పోలీసులు అన్ని కోణాల నుంచి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబు

- మాజీ మంత్రి కొడాలి నాని ఆగ్రహం
- ఆ కుటుంబంలోనే పిచ్చి ఉంది
- సీఎం కుటుంబాన్ని దూషిస్తే సహించేది లేదు



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి పట్టిన దరిద్రం, శని.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) మండిపడ్డారు. చంద్రబాబు ఓ 420.. అవినీతి చక్రవర్తి అని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ వారసులు సామాన్యుల్లా బతుకుతుంటే చంద్రబాబు రెండెకరాల నుంచి రూ.2 లక్షల కోట్లు ఎలా సంపాదించారని నిలదీశారు. లోకేశ్ యాత్రను ప్రజలు పట్టించుకోకపోవడంతో పిచ్చిపట్టి సీఎం జగన్ కుటుంబాన్ని వ్యక్తిగతంగా దూషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సతీమణి గురించి వ్యాఖ్యలు చేస్తే ఎవరైనా సరే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు.

- ▲ సీఎం జగన్, ఆయన కుటుంబంపై నోరు జారితే చంద్రబాబు, లోకేశ్‌కు బడితె పూజ ఖాయం. నేను బూతులు మాట్లాడతానని విమర్శించే వారికి చంద్రబాబు, లోకేశ్ అసభ్య వ్యాఖ్యలు వినపడటం లేదా? సీఎం జగన్‌డీఎన్ఏ రాయలసీమది. లోకేష్ డీఎన్ఏ తెలంగాణది. బచ్చాగాడిలా బఫూన్ కోతలు కోస్తున్నాడు. లోకేశ్ ఆంధ్రా రాజకీయాలకు అనర్హుడు. చేవలేని కుమారుడి కోసం చంద్రబాబు పసలేని రాజకీయం వృథా. పది పందులు కలిస్తే లోకేశ్ అవుతాడు. తన తల్లిని రోడ్డుపైకి తెచ్చింది చంద్రబాబేనన్న విషయం లోకేశ్ తెలుసుకోవాలి.
- ▲ చంద్రబాబు, లోకేశ్‌కు పిచ్చెక్కింది. ఆ కుటుంబంలోనే పిచ్చి ఉంది. ఇకపై ఒకటికి మేం రెండంటాం. లోకేశ్‌కు దమ్ముంటే నన్ను కానీ, వంశీని కానీ, ద్వారంపూడి, అంబటి రాంబాబును టచ్ చేయాలి.
- ▲ వివేకానందరెడ్డిని బాబే చంపాడేమో? చంద్రబాబు పాలనలోనే ఆ హత్య జరిగింది. సామర్లకోట బహిరంగ సభలో 'ఏం తమ్ముళ్లూ.. వివేకాను నేనే హత్య చేశాను.. ఏమంటారు?' అని స్వయంగా చంద్రబాబు ప్రకటించారు.
- ▲ పవన్‌కళ్యాణ్ మూడు పెళ్లిళ్లపై మాట్లాడిన వాళ్లంతా ఊరకుక్కలంటూ బాలకృష్ణ టాక్ షోలో అన్నారు. మరి ఎన్టీఆర్ రెండో పెళ్లి గురించి రాద్ధాంతం చేసి వెన్నుపోటు పొడిచిన చిత్తకార్తె కుక్కలెవరు? దీనిపై బాలకృష్ణ, చంద్రబాబు సమాధానం చెప్పాలి రామోజీరావు, రాధాకృష్ణ కూడా ఆనాడు ఎన్టీఆర్‌ను తీవ్రంగా విమర్శించిన చిత్తకార్తె కుక్కలే కదా?

పోలీసుల అదుపులో మావోయిస్టు కీలక నేత రైనో?

సాక్షి, పాడేరు: ఒడిశాలోని కటాఫ్ ఏరియాలో మావోయిస్టు పార్టీ డీసీఎం క్యాడర్‌లో ఉన్న కీలక నేత రైనో అలియాస్ జలుమూరి శ్రీనివాసరావును ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇటీవల అదుపులో తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒడిశాలోని మల్కన్‌గిరి, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పొడియా బ్లాక్‌లో ఈనెల 10న మావోయిస్టులకు, పోలీసులకు ఎదురుకాల్పులు జరిగాయని, మావోయిస్టు నేత రైనోతో పాటు మరో దళసభ్యుడు సజీవంగా పోలీసులకు పట్టుబడ్డారని, వారిలో ఒకరు తప్పించుకోగా రైనో అలియాస్ శ్రీనివాసరావు పోలీసుల చెరలోనే ఉన్నాడని మావోయిస్టు ఏవోబీ నేత రాకేష్ మంగళవారం ఒడిశా మీడియాకు విడుదల చేసిన ఆడియో టేపులో తెలిపారు. ఆరోజు పోలీసు బలగాలు రైనోను మల్కన్‌గిరి తరలించినట్టు పేర్కొన్నారు. ఒడిశా పోలీసుల ఆధీనంలో ఉన్న శ్రీనివాసరావును కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీ పోలీసు ఉన్నతాధికారులు మావోయిస్టు నేత జలుమూరి శ్రీనివాసరావుపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

క్షమాపణల యాత్ర చెయ్

- దరిద్రానికి నిర్వచనం చంద్రబాబే: మాజీ మంత్రి కన్నబాబు



సాక్షి, అమరావతి: అధికారంలో ఉండగా ప్రజలకు మేలు చేయకుండా అక్రమార్జనలో మునిగితేలిన చంద్రబాబు 2024 ఎన్నికల్లోనూ ఓటమి తప్పదని గ్రహించే సీఎం జగన్‌పై దూషణలకు దిగుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మండిపడ్డారు. లోకేష్ పాదయాత్రకు స్పందన లేక జోకర్‌గా మారడం.. తన సభల్లో ప్రజలు కానరాక శాపనార్థాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉండగా చేసిన నిర్వాకాలకు ప్రజలను క్షమాపణలు కోరుతూ యాత్రలు చేయాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో కన్నబాబు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబే. ఆయన అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు కురవక, పంటలు పండక, గుక్కెడు తాగునీరు దొరక్క కరువు విలయతాండవం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో బాబు అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లూ కరువు కరాళనృత్యం చేయడం అరిష్టం కాదా? రాష్ట్రంలో ఇల్లు కట్టుకుని కాపురం ఉండాలని సామాన్య కార్యకర్తే హితవు పలకడంకన్నా అవమానం చంద్రబాబుకు మరొకటి ఉంటుందా? టీడీపీ కార్యకర్తలే బాబు, లోకేశ్‌ను ప్రవాసాంధ్రులుగా పరిగణిస్తున్నారు. చంద్రబాబు తనను మించిన నటుడని ఎన్టీఆరే చెప్పారు. లోకేశ్ బ్రాండ్ నేమ్ పప్పును పోగొట్టుకునేందుకు ఎవరో నేర్పిన బూతులు మాట్లాడుతూ దిగజారి సీఎం జగన్‌ను విమర్శిస్తున్నారు. సీఎం కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగి విమర్శిస్తున్న అయ్యన్నతోపాటు అదే రీతిలో మాట్లాడుతున్న చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడును పిచ్చాసుపత్రిలో చేర్చాలి. సీఎం జగన్ తన విద్యార్హతల గురించి శాసనసభలోనే స్పష్టంగా చెప్పారు. అలాంటి వ్యక్తితో లోకేశ్‌కు పోలికా? లోకేశ్‌కు సత్తా ఉంటే పదో తరగతి పరీక్షలు తెలుగు మీడియంలో రాసి పాసవ్వాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసమే సీఎం జగన్ మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు.' అని కన్నబాబు అన్నారు.

పాహి పాహి పరమేశ్వరా

● నేడు మహాశివరాత్రి

సృష్టి, స్థితి, లయకారులలో శివుడికి లయకారుడని పేరు. అయితేనేం, ఆయన పరమ బోళావాడు. భక్తజన రక్షకుడు. సనాతనుడు, భూతనాథుడు, వైద్యనాథుడు, పశుపతి నాథుడు, చరాచర జగత్తుకు ఆయనే విశ్వనాథుడు, చంద్రశేఖరుడు. భక్తితో కొలిచే తన భక్తులతో పాటు క్రిమికీటకాదులకు కూడా మోక్షమిచ్చి సాక్షాత్కరించే శివయ్య దర్శనం సర్వ పాపహరణం. నేడు మహాశివరాత్రి పర్వదినం. ఈ పర్వదినాన ఆ శుభకరుడి గురించి చెప్పుకోవడం ఎంతో మంగళప్రదం.

మనం ప్రతి నెలలోనూ తెలుగు క్యాలెండర్లలోనూ, పంచాంగాల్లోనూ పండుగలు– పర్వదినాలలో మాస శివరాత్రి అని ఉండటాన్ని చూస్తుంటాం. ఇంతకీ మాస శివరాత్రి అంటే ఏమిటి, మహాశివరాత్రికీ, మాస శివరాత్రికీ గల వ్యత్యాసం ఏమిటో చూద్దాం.

ప్రతిమాసంలోనూ బహుళ పక్షం వచ్చే చతుర్దశికి మాస శివరాత్రి అని పేరు. అలా సంవత్సరంలో పన్నెండు మాస శివరాత్రులు వస్తాయి. వాటన్నింటిలోనూ తలమానికమైనది, మహిమాన్వితమైనది మహాశివరాత్రి. తిథి ద్వయం వున్నప్పుడు అమావాస్యకు ముందురోజు – రాత్రి చతుర్దశి కలిగి ఉన్న రోజుని జరుపుకోవాలని నిర్ణయసింధు చెబుతోంది. 'మహా' అని ఎక్కడ అనిపించినా అన్నింటికంటే గొప్పదని అర్థం చేసుకోవాలి. శివ పార్వతులిరువురికి సంబంధించిన రాత్రి శివరాత్రి అనేది మరో అర్థం. అందుకే శివరాత్రి నాడు అయ్యకి – అమ్మకి కూడా ఉత్సవం జరుగుతుంది. శివ అంటే మంగళకరమైన అని. శివరాత్రి అంటే మంగళకరమైన లేదా శుభప్రదమైన రాత్రి అని అర్థం.

ఇంతకీ శివరాత్రి ఎందుకని అంతటి పర్వదినమైందో చూద్దాం.

క్షీరసాగర మథనంలో అమృతంకంటే ముందు హాలాహలం పుట్టిన విషయం తెలిసిందే. అది ముల్లోకాలను దహించివేస్తుందన్న ప్రమాదం ఉండడంతో దేవదానవులందరు భీతావహులై తమను రక్షించాలంటూ పరమేశ్వరుణ్ణి వేడుకోవడంతో లోక రక్షణార్థం ఆ గరళాన్ని తానే మింగి, గొంతులో బంధించి గరళ కంఠుడుగా పేరుపొందాడు. ఈ హాలాహల ప్రభావానికి ఆయన కంఠం నీలంగా మారడంతో నీలకంఠుడయ్యాడు. లోకాలన్నీ ఆ లోకనాయకుడి మూలాన స్థిమితపడిన రోజు పర్వదినం గాక మరేమిటి?

అయితే... సంప్రదాయ ప్రియులు జరుపుకునే ప్రతి పండుగకూ ఏదో ఒక పురాణగాథ ఉన్నట్లే మహాశివరాత్రికీ ఒకటి రెండు ఐతిహ్యాలున్నాయి.

ఆది మధ్యాంత రహితుడు

పరమేశ్వరుడు ఆది మధ్యాంత రహితుడనడానికి సంబంధించిన ఈ గాథని చూద్దాం:

పూర్వం బ్రహ్మ విష్ణువులు తమలో తాము 'నేను గొప్ప అంటే నేను గొప్ప ' అని వాదించుకున్నారు. ఈ వాదులాట కాస్తా వివాదంగా మారింది. రానురానూ అది మరింతగా పెరిగి భయంకరమైన యుద్ధానికి దారితీసింది. అరివీర భయంకరమైన ఆ యుద్ధానికి త్రిలోకాలూ తల్లడిల్లాయి. దాంతో పరమేశ్వరుడే స్వయంగా రంగంలోకి దిగాలనుకున్నాడు. ఈశ్వర సంకల్పంతో ఒక పెద్ద జ్యోతిర్లింగం బ్రహ్మవిష్ణువుల మధ్య వెలసింది. ఆ మహాలింగాన్ని చూసిన బ్రహ్మ, విష్ణువులిరువురూ లింగాన్ని సమీపించారు. అప్పటివరకు వారి మధ్య ఉన్న ఆధిపత్య పోరు కాస్తా తాత్కాలికంగా సద్దుమణిగి ఆ మహాలింగం మొదలు, తుది తెలుసుకోవాలన్న ఆసక్తిగా మారింది. దాంతో బ్రహ్మ హంస రూపం ధరించి లింగం అగ్రభాగాన్ని చూడటానికి, విష్ణువు శ్వేత వరాహరూపంలో లింగం ఆదిని కనుక్కోవడానికీ బయల్దేరారు.

ఎంతదూరం ఎగిరినా బ్రహ్మకు లింగం అంత్యభాగం కనపడలేదు. వరాహరూపంలో ఉన్న విష్ణువు పాతాళం దాటి వెళ్లినా లింగం మొదలు కనిపించ లేదు. ఇంతలో లింగం పక్కనుంచి ఒక కేతకపుష్పం (మొగలిపువ్వు) జారి కిందకు రావడం చూసి బ్రహ్మ మొగలిపువ్వును ఆపి తనకు, విష్ణువుకు నడుమ జరిగిన సంవాదాన్ని వివరించి, తనకు సహాయం చేయమని అడిగాడు. ఆ లింగం అగ్రభాగాన్ని చూసినట్లుగా విష్ణువుతో చెప్పేటప్పుడు అది నిజ మేనని సాక్ష్యం ఇవ్వమని ప్రాధేయపడ్డాడు బ్రహ్మ. సాక్షాత్తూ సృష్టికర్తయే తనని బతిమాలేసరికి కాదనలేకపోయింది మొగలిపువ్వు. వారిద్దరూ కిందికి దిగివచ్చేసరికి విష్ణువు తాను ఆ లింగం మొదలు చూడలేకపోయానని ఒప్పుకున్నాడు. బ్రహ్మ తాను లింగం అగ్రభాగాన్ని చూశానని, కావాలంటే మొగలిపువ్వును అడగమని చెప్పాడు. 'నిజమే'నంది మొగలి పువ్వు.దాంతో తాను ఓడిపోయానని విష్ణువు ఒప్పుకున్నాడు. అయితే బ్రహ్మదేవుడి అసత్య ప్రచారాన్ని చూడలేక ఈశ్వరుడు వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. బ్రహ్మ చెప్పిన ప్రకారం అబద్ధపు సాక్ష్యం చెప్పిన కేతక పుష్పం అంటే మొగలి పువ్వు నాటినుంచి తనను అర్చించడానికి అవకాశం లేదన్నాడు. అంతేకాదు భక్తులెవ్వరూ మొగలిపువ్వులతో తనను పూజించరాదని శాసించాడు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండీ అల్పవిషయంలో అసత్యం చెప్పిన బ్రహ్మకు భూలోకంలో ఎవరూ పూజ చేయరాదని, ఆలయాలు కట్టకూడదని శాసించాడు. సత్యం చెప్పిన విష్ణువును మెచ్చుకుని, భూలోకంలో తనతో సమానంగా పూజలందుకునే విధంగా ఆశీర్వదించాడు.

అనంతరం బ్రహ్మ, విష్ణువులిద్దరూ ఈశ్వరుణ్ణి శ్రేష్ఠమైన ఆసనం మీద కూర్చుండబెట్టారు. హారాలు, నూపురాలు, కిరీటం, మణికుండలాలు, యజ్ఞోపవీతం, ఉత్తరీయం, పట్టువస్త్రాలు, పూలమాలలు, పువ్వులు, తాంబూలం, కర్పూరం, గంధం, అగరు, ధూపం, శ్వేతఛత్రం, వింజామరలు వంటి దివ్యమైన వస్తువులను సమర్పించి షోడశోపచారంగా పూజించారు. ఆ పూజకు ఈశ్వరుడు ఎంతగానో సంతోషించాడు. జ్యోతిర్లింగరూపంలో బ్రహ్మకు, విష్ణువుకు తాను కనిపించిన సమయాన్ని లింగోద్భవకాలంగా పరిగణించాలని, ఇకనుంచి మాఘ బహుళ చతుర్దశి శివరాత్రి అనే పేరుతో తన పూజలకు శ్రేష్ఠమైనదిగా వర్ధిల్లుతుందని చెప్పాడు. అంతేకాదు, ఆ తిథినాడు తన మూర్తిని, లింగాన్ని పూజించే వారికి మోక్షం లభిస్తుందన్నాడు. శివరాత్రినాడు పార్వతీసమేతంగా తనను అర్చించే వారు మహోన్నత ఫలాలు పొందేవిధంగా అనుగ్రహించాడు.

మహాశివరాత్రి పండుగను జరుపుకోవడంలో మూడు ప్రధానమైన విషయాలు ఉన్నాయి. శివార్చన, ఉపవాసం, జాగరణం. శివరాత్రి రోజున సూర్యోదయానికి ముందుగానే నిద్రలేచి, స్నానాది కార్యక్రమాలు పూర్తి చేసుకుని, శివలింగాన్ని షోడశోపచారాలతో పూజించాలి. శివభక్తులను పూజించి వారికి భోజనం పెట్టాలి. శివాలయానికి వెళ్లి, శివదర్శనం చేసుకోవాలి ఇది శివార్చన. ఇక రెండోది ఉపవాసం. ఉపవాసమంటే శివరూపాన్ని ధ్యానిస్తూ, శివ నామస్మరణం చేయడం.

మూడోది జాగారం. శివరాత్రి నాటి సూర్యాస్తమయం మొదలు మర్నాడు సూర్యోదయం వరకు.. నాలుగు జాములు నిద్రపోకుండా మేల్కొని ఉండటం. ఈ విధంగా జాగారం చేసిన వారికి పునర్జన్మ ఉండదని స్కాంధ పురాణం చెబుతోంది. శివరాత్రి రోజున భగవన్నామ స్మరణం సమస్త పాపాలను నశింపజేస్తుంది. శివరాత్రి నాడు చేసే జాగారాన్ని వ్యర్థ ప్రసంగాలతోనో, ఎలాంటి ప్రయోజనం లేని వాటిని చూస్తూనో కాకుండా శివనామాన్ని స్మరిస్తూ, శివ గాథలను చదువుకుంటూ శివలీలలను చూస్తూ చేసినట్టితే కాలాన్ని సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. ఇంకా పుణ్యమూ, పురుషార్థమూ రెండూ లభిస్తాయని శాస్త్రం చెబుతోంది.

శివరాత్రే యోగరాత్రి. శివరాత్రి రోజుకి ప్రకృతిలో ఉండే తరంగాలు, అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు విశ్వ మానవ వికాసానికి, మనిషి తన పరిపూర్ణమైన రూపాన్ని తెలుసుకోవడానికి, ఆత్మ సాక్షాత్కారానికి తోడ్పడతాయి. అందుకే శివరాత్రి కి కొన్ని ప్రత్యేక నియమాలు విధించారు.

ఉపవాసం ఎలా?

శివరాత్రికి చేసే ఉపవాసానికి, జాగరణకు విశేష ప్రాధాన్యం ఉంది. శివరాత్రి నాడు అందరూ ఉపవాసం చేయాలని శాస్త్రం చెబుతుంది. చిన్నపిల్లలకు, ముసలివాళ్ళకు, అనారోగ్యంతో బాధపడేవాళ్ళకు, గర్భవతులకు, ఔషధ సేవనం చేయాల్సిన వాళ్ళకు మినహాయింపు ఇచ్చింది శాస్త్రం.

ఉపవాసం మరుసటి రోజు మాంసాహారం, గుడ్డు మొదలైనవి తినకూడదు, మద్యపానం చేయకూడదు. ఎలాగూ ఉపవాసం చేస్తున్నాం కదా, ఉదయం లేస్తే ఆకలి తట్టుకోవడం కష్టమని, ఆలస్యంగా లేస్తారు కొందరు. అలా చేయకూడదు. ఉపవాసం ఉండేరోజు ఉదయం సూర్యోదయానికి ముందే నిద్రలేచి, తలపై నుంచి స్నానం చేసి, ఈ రోజు నేను శివునకు ప్రీతికరంగా, శివరాత్రి ఉపవాసం చేస్తున్నాను అని సంకల్పం చెప్పుకోవాలి.

ఉపవాసం అనే పదానికి అర్థం 'దగ్గరగా ఉండడం' అని! భగవంతునికి మనసును, ఇంద్రియాలను దగ్గరగా జరపడమే ఉపవాసం. ఆరోగ్యపరంగా చూసినప్పుడు, ఉపవాసం శరీరంలో ఉన్న విషపదార్థాలను తొలగించడంతో పాటు శరీరంలో ప్రాణశక్తిని, ఇంద్రియ నిగ్రహాన్ని పెంచుతుంది. మరీ నీళ్ళు కూడా తాగకుండా ఉపవసించమని ఎవరూ చెప్పలేదు. అలా చేయకూడదు కూడా. ఎందుకంటే శరీరాన్ని కష్టపెడుతూ, భగవంతుని వైపు మనసును మళ్లించడం కష్టం.

శివరాత్రి నాడు శివలింగానికి రుద్రాభిషేకం చేయించడం మంచిది. అంతేకాదు జాగారం వుండి శివ పంచాక్షరి మంత్రంతో ధ్యానం చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని నమ్ముతారాయన భక్తులు. కనుకనే మహాశివరాత్రి నాడు నమశ్శివాయ అంటూ మారుమోగుతాయి శివాలయాలన్నీ.

'త్రయంబకం యజామహే...'

అంటూ మృత్యుంజయ మంత్రం జపిస్తే సకల రోగబాధలూ తగ్గి, పూర్ణాయుష్షు లభిస్తుందని ప్రతీతి. శివరాత్రి నాడు కలిగినంతలో దానాలు చేయడం వల్ల సత్ఫలితాలు లభిస్తాయి. అందుకే చేసిన వాడికి చేసుకున్నంత మహాదేవా అన్నారు. ఇవేవీ చేయ(లే)కపోయినా నిర్మలమైన మనస్సు తో వీలైనన్ని సార్లు ఓం నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్ర జపం చేసినా చాలు, ఆ బోళాశంకరుడు పొంగిపోయి వరాలిస్తాడు.

– డి.వి.ఆర్.

ఆయన రూపం అపురూపం

శివుడు నిరాకారుడు. సాకారుడు కూడా. అదే ఆయన ప్రత్యేకత. పరమ శివుని ఆకృతిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క అర్థం ఉంది. శివుని త్రిశూలం సత్వ, రజ, తమో గుణాలకు ప్రతిరూపాలు. డమరుకం శబ్ద బ్రహ్మ స్వరూపం. ఆయన శిరస్సును అలంకరించిన చంద్రవంక మనోనిగ్రహానికి, గంగాదేవి శాశ్వతత్వానికి ప్రతీక. శివుడి దేహంపై గల సర్పాలు భగవంతుని జీవాత్మలుగాను, ధరించిన ఏనుగు చర్మం అహంకారాన్ని త్యజించమని, ఆసీనంపైన పులిచర్మం కోరికలకు దూరంగా ఉండమని, భస్మం పరిశుద్ధతనూ సూచిస్తాయి. ఆయన పట్టుకున్న నాలుగు జింక కాళ్ళు చతుర్వేదాలకు, నంది ధర్మదేవతకు, మూడవ నేత్రం జ్ఞానానికి సూచిక.

రెండు స్వరూపాలు

శివుడు కేవలం రుద్ర స్వరూపుడే కాక ప్రేమ స్వరూపుడు కూడా. రుద్రస్వరూపంగా అయితే శివుడు, మహంకాళి, వీరభద్రుడు, కాలభైరవుడు, ఉగ్ర గణపతి, పిశాచగణాలుగా దర్శనం ఇస్తే శాంతస్వభావునిగా ఉన్నప్పుడు పరమేశ్వరుడు, పార్వతీదేవి, కుమారస్వామి, వినాయకుడు, నందీశ్వరుడు, గురునాథ స్వామి, వేద వేదాంగ భూషణులు మనకు కనిపిస్తారు.

జగతః మాతా పితరౌ

శివపార్వతులు తమ కల్యాణ మహోత్సవానికి చక్కగా చిగిర్చే పూచే వసంతకాలాన్ని మనకిచ్చి, ఆకులు రాలే శిశిరాన్ని ఎంచుకున్నారు ఆ దంపతులు. వెన్నెల మెండుగా కాసే పున్నమిని మనకిచ్చి కన్ను పొడుచుకున్నా కానరాని బహుళ చతుర్దశిని తాము తీసుకున్నారు. రాత్రి వేళ అయితే అది మనకి ఇచ్చింది అని భావించి తెల్లవారుజామున మంచిదనుకున్నారు ఆ తలిదండ్రులు. మల్లెల్నీ మొల్లల్నీ మనకి విడిచి వాసన, రూపసౌందర్యం లేని తుమ్మిపూవుల్ని సిద్ధం చేసుకున్నారు. చందనాన్ని మన పరం చేసి విభూతిని పులుముకున్నారు. ఊరేగింపునకి ఎద్దునీ, అలంకారాలుగా పాముల్నీ... ఇలా జగత్తుకోసం ఇన్ని త్యాగాలు చేసిన ఆ ఆది దంపతుల కల్యాణ మహోత్సవానికి పిల్లలమైన మనం తప్పక హాజరు కావాలి. ఆశీస్సులు అందుకోవాలి. అందుకే ఈ జాగరణం.



చిగురించే శుభలేఖ

> ఒకప్పుడు శుభలేఖ అంటే...
> పసుపు సుగంధాలతో అందే ఆహ్వానం.
> డిజిటల్ యుగంలో వాట్సాప్‌లోనే ఆహ్వానం.
> పెళ్లయ్యాక డిలీట్ చేయకపోతే మెమరీ చాలదు.
> ఆ తర్వాత ఆ పత్రిక మన మెమరీలోనూ ఉండదు.
> కానీ... ఈ శుభలేఖ ఎప్పటికీ నిలిచి ఉండే ఓ జ్ఞాపకం.


మంచాల వారి పరిణయ ఆహ్వానం... ఏటా మనింటికి ఎన్నో పెళ్లిపత్రికలు వస్తూ ఉంటాయి. 'అరె! నా పెళ్లిలో పట్టుపరికిణీతో బుట్టబొమ్మలా తిరిగిన ఆ చిన్నమ్మాయికి పెళ్లా! కాలం ఎంత వేగంగా పరుగులు తీస్తోందో? అనుకుంటూ పెళ్లి కార్డును మురిపెంగా చూస్తాం. పెళ్లయిన తర్వాత ఆ కార్డును పాత పేపర్లలో వేసేయడానికి మనసొప్పదు. శుభలేఖను గౌరవించాలి, ఆ జంట వైవాహిక జీవితం కలకాలం లక్షణంగా సాగాలంటే పెళ్లికార్డును అగౌరవపరచకూడదనే సెంటిమెంట్ మనది. ఈ సెంటిమెంట్‌కు కొత్త నిర్వచనం చెప్తోంది డాక్టర్ శరణ్య. ఆహ్వానపత్రిక ముద్రించిన పేపర్‌ను తులసి గింజలను కలిపి తయారు చేయించింది. ''నా పెళ్లి తర్వాత ఈ కార్డును మట్టి కుండీలో వేసి నీరు పోయండి. నాలుగు రోజుల్లో కార్డు కరిగిపోతుంది, మరో నాలుగు రోజులకు పచ్చగా జీవం పోసుకున్న తులసి మొక్క మనల్ని పలకరిస్తుంది. మీ ఇంటికి వచ్చిన తులసి, మీ ఇంటి ఆరోగ్యదాయిని. భూమాతకు కొత్త ఊపిరినిచ్చే ఆరోగ్యలక్ష్మిని చూస్తూ మీ ముఖంలో విరిసే చిరునవ్వే మాకు మీరిచ్చే ఆశీర్వాదం'' అంటోంది.



డాక్టర్ శరణ్య

శుక్రవారమే పెళ్లి!

డాక్టర్ శరణ్యది తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్. ఎంఎస్ ఆఫ్తాల్మాలజీ చేస్తోంది. ఈ నెల 24వ తేదీన పెళ్లి పీటల మీద కూర్చోనున్న శరణ్య తన వివాహాన్ని ఇలా పర్యావరణహితంగా మార్చేసింది. ఆ వివరాలను సాక్షితో పంచుకుంది. ''నేచర్ ఫ్రెండ్లీ లైఫ్ స్టయిల్ నాకిష్టం. నా పెళ్లి కూడా అలాగే జరిగితే బావుంటుందనిపించి అదే మాట నాన్నతో చెప్పాను. పెళ్లి వేదిక అలంకరణ నుంచి భోజనాల వరకు మొత్తం ప్లాస్టిక్ రహితంగా ఉండాలని కూడా అనుకున్నాం. అది పెద్ద కష్టం కాలేదు. ప్రతిదానికీ ప్రత్యామ్నాయం దొరికింది. కార్డుల కోసం చాలా ప్రయత్నం చేయాల్సి వచ్చింది. 'ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ కార్డ్స్' కోసం నేను ఇంటర్నెట్‌లో, నాన్న తన బిజినెస్ కాంటాక్ట్స్‌తో ప్రయత్నించాం. నాన్నకు తెలిసిన వాళ్ల ద్వారా అహ్మదాబాద్‌లో హ్యాండ్‌మేడ్ పేపర్ తయారీతో పాటు మనం కోరిన స్పెసిఫికేషన్‌లన్నీ వచ్చేటట్లు కస్టమైజ్‌డ్‌గా ప్రింట్ చేసిస్తారని తెలిసింది. మూడు నెలల ముందుగా ఆర్డర్ చేయాలి, ఈ ఎకో ఫ్రెండ్లీ ఆహ్వానపత్రికల ఆలోచన తెలిసి మా అత్తగారింట్లో కూడా అందరూ సంతోషించారు. భూమాత పరిరక్షణ కోసం చేస్తున్న ప్రయత్నాలు నా పెళ్లికార్డుతో ఇంతమందికి తెలిశాయి. దీనికి మూలకారణం మా నాన్నే. ప్లాస్టిక్ ఫ్రీ సొసైటీ కోసం చైతన్య సదస్సులు నిర్వహిస్తారు. మా చెల్లికి పక్షులంటే ఇష్టం. వేసవిలో పక్షుల కోసం ఒక పాత్రలో నీరు, గింజలు పెడుతుండేది. పక్షుల సంరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో రెండు వేల బర్డ్ ఫీడర్ బాక్సులు పంచింది. మా ముత్తాత రాజేశం గారు ఫ్రీడమ్ ఫైటర్. మా తాత శంకరయ్య కూడా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవారు. అదే వారసత్వంతో నాన్న కూడా వేసవిలో నగరంలో వాటర్ ట్యాంకులతో నీటి పంపిణీ వంటి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.



కాబోయే భర్త వినయ్‌సాయితో డాక్టర్ శరణ్య

బతుకమ్మ వేడుక కోసం గునుగు పువ్వు సేకరించి శుద్ధి చేసి పంచడం కూడా చాలా ఇష్టంగా చేస్తాం. మనం మన సంస్కృతికి వారసులం మాత్రమే కాదు వారధులం కూడా. ప్రతి సంప్రదాయాన్నీ ఇలా సృజనాత్మకంగా మలుచుకోగలిగితే మనం చేసిన పని మనకు ప్రత్యేకతను ఇస్తుంది. సాంస్కృతిక వారధులుగా సంతోషమూ కలుగుతుంది. పెళ్లి పత్రిక మీద దేవుడి బొమ్మలు, వధూ వరుల ఫొటోలు ఉంటాయి. వాటిని పారేయలేక ఇంట్లోనే పెట్టుకుంటే దొంతర పెరిగిపోతూ ఉంటుంది. మా పెళ్లి పత్రిక మాత్రం తులసి మొక్కగా మీ కళ్ల ముందు ఉంటుంది, మీకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది '' అని సంతోషంగా వివరించింది డాక్టర్ శరణ్య.

– వాకా మంజులారెడ్డి

● స్త్రీ శక్తి

ఆకాశమంత అవకాశం

రేయనా బర్నావీ సౌదీ అరేబియా ఫస్ట్ ఉమెన్ ఆస్ట్రోనాట్‌గా చరిత్ర సృష్టించనుంది. మహిళాసాధికారత విషయంలో సౌదీ మరో అడుగు ముందుకు వేసింది..

గత వైఖరికి భిన్నంగా సౌదీ అరేబియా మహిళా సాధికారత, హక్కులకు పెద్ద పీట వేస్తోంది. తనను తాను కొత్తగా నిర్వచించుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకప్పుడు... మేల్ గార్డియన్ లేకుండా మహిళలు డ్రైవింగ్ చేయకూడదు, విదేశాలకు వెళ్లకూడదు అనే ఆంక్షలు ఉన్న దేశంలో ఎంతో మార్పు వచ్చింది. దీనికి బలమైన ఉదాహరణ... సౌదీ అరేబియా తొలిసారిగా రేయనా బర్నావీ అనే మహిళను స్పేస్ మిషన్ ఎఎక్స్–2కు ఎంపిక చేయడం. సౌదీ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రాం, ప్రైవెట్ స్పేస్ కంపెనీ ఆక్సియం స్పేస్ (యూఎస్) భాగస్వామ్యంతో చేపట్టిన స్పేస్ మిషన్‌లో 33 సంవత్సరాల బర్నావీ సౌదీ అరేబియా ఫస్ట్ ఉమెన్ ఆస్ట్రోనాట్‌గా చరిత్ర సృష్టించబోతోంది.



రేయనా బర్నావీ

న్యూజిలాండ్‌లోని ఒటాగో యూనివర్శిటీ నుంచి బయోమెడికల్ సైన్స్‌లో పట్టాపుచ్చుకున్న బర్నావీ రియాద్‌లోని అల్‌ఫైసల్ యూనివర్శిటీలో బయోమెడికల్ సైన్స్‌లో మాస్టర్స్ చేసింది. క్యాన్సర్ స్టెమ్ సెల్ రిసెర్చ్‌లో తొమ్మిది సంవత్సరాల అనుభవం ఉంది.

కొన్ని నెలల్లో ప్రారంభం కానున్న తమ స్పేస్‌మిషన్‌ను దృష్టిలో పెట్టుకొని సౌదీ స్పేస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఒక వీడియో విడుదల చేసింది. భావుకత నిండిన ఆ వీడియోలో కొన్ని వాక్యాలు ఇలా ఉంటాయి...

సగర్వంగా తల పైకెత్తి చూడు/ ఆకాశంలో అసంఖ్యాకమైన నక్షత్రాలు కనిపిస్తాయి

వాటిని పలకరించాలి/ పరిచయం చేసుకోవాలి/ పేరు పెట్టాలి/ నక్షత్రాలు నీ స్నేహితులు కావాలి

అంతరిక్షం అనేది నీ అపురూపమైన ఇష్టం కావాలి/ ఆకాశ మార్గంలో నీదైన దారి వెదుక్కో

అధ్యయనం చేయాలి/పరిశోధించాలి/ కొత్త విషయాలను ఆవిష్కరించాలి/నీ తరానికి స్ఫూర్తిగా నిలవాలి

నీ మార్గంలో నువ్వు ఒంటరివి కావు/ నీ పూర్వీకులెందరో ఆ బాటలో నడిచారు/ గొప్ప విజయాలు సాధించారు/ నీ కలను ఆవిష్కరించే సమయం వచ్చింది

ఆ కలకు రెక్కలు ఇచ్చే సమయం వచ్చింది... లెట్ ఇట్ ఫ్లై!

వీడియో తొలి దృశ్యంలో ఒక మహిళ కనిపించడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. అంతరిక్ష విషయాల్లో, విజయాల్లో మహిళలు ముందుండబోతున్నారు అని ప్రతీకాత్మకంగా చెప్పడం కావచ్చు!

● కృషి

సేద్య కళ

చదువుకుంటూ పార్ట్‌టైమ్ జాబ్స్ చేసే యువత గురించి మనకు తెలుసు. అలాగే, చదువుకుంటూనే తమ అభిరుచులకు పదును పెట్టుకునేవారినీ మనం చూస్తుంటాం. అయితే, నెల్లూరు జిల్లా కలువాయి మండలం, పెన్న బద్వేల్‌వాసి అయిన చాట్ల అఖిల మాత్రం హాస్టల్‌లో ఉండి బయోటెక్నాలజీలో డిగ్రీ చేస్తూనే, ఖాళీ సమయంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తోంది. తనకున్న ఇష్టం వల్ల సేద్యంలో రకరకాల ప్రయోగాలు సొంతంగా చేయగలుగుతున్నాను అని చెబుతున్న అఖిల తన కలనే కాదు కళను కూడా పండిస్తోంది.



చాట్ల అఖిల



పొలంలో అఖిల

''మాది వ్యవసాయ కుటుంబం అవడంతో చిన్నప్పటి నుంచి ఇంటి పనులతో పాటు పొలం పనులు కూడా తెలుసు. అమ్మ పద్మ, నాన్న గురువయ్య. అమ్మానాన్నలకు అన్న, నేను సంతానం. డిగ్రీ మూడవ సంవత్సరం నెల్లూరు టౌన్‌లోనే హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. డిగ్రీ పూర్తయిన తర్వాత నాకు నేనుగా స్థిరపడాలంటే ఏది ఎంచుకుంటే బాగుంటుంది అని చాలా ఆలోచించాను. కరోనా కాలంలో రెండేళ్లు ఇంటి వద్దే ఉన్నప్పుడు ఎక్కువ సమయం పొలంలోనే గడిపేదాన్ని. అలా వ్యవసాయంలోని కష్టం, ఇష్టం రెండూ అలవాటయ్యాయి. అయితే, ఊళ్లో వ్యవసాయం చేస్తూ, కాలేజీకి వెళ్లి చదువుకోలేను. ఇంటి వద్దే ఉండి నాకు నచ్చిన రీతిలో వ్యవసాయం చేయాలంటే అందుకు అమ్మానాన్నలను ఒప్పించడం కష్టమనుకున్నాను. 'చదువుకుంటున్నావు కదా ఎందుకింత కష్టం' అంటారు. అందుకే అమ్మానాన్నలకు చెప్పకుండానే ఎక్కడైనా కొంత భూమి కౌలుకు తీసుకోవాలని వ్యవసాయం చేయాలని, కరోనా టైమ్‌లోనే తెలిసి వారి ద్వారా చాలా వెతికాను.

సాగులో లేని భూమి..

నేనున్న హాస్టల్‌కి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లిపాడులో ఒక ఎన్ఆర్ఐ భూమి ఉందని తెలిసింది. వారి వివరాలు కనుక్కొని, ఫోన్‌లో సంప్రదించి, రెండెకరాల భూమి కౌలుకు తీసుకున్నాను. అది ఏ మాత్రం సాగులో లేని భూమి. అందుకు చాలా కష్టపడాలి. మొదట కష్టమవుతుందేమో అనుకున్నాను. కానీ, ఇష్టమైన పని కావడంతో సాగు చేయాలనే నిశ్చయించుకున్నాను.

మట్టితో పిచికారి

భూమిని చదును చేయించాను. ఆకు కూరలు, కూరగాయల సాగు చేస్తున్నాను. సాగులో వచ్చే ఇబ్బందులు స్వయంగా తెలుసుకుంటూ, వాటికి పరిష్కారాలు వెదుక్కుంటూ నా ఎఫర్ట్‌ను పెడుతున్నాను. ఓ వయసుపైబడిన వ్యక్తి ఉంటే, అతనికి అవసరాలకు డబ్బు ఇచ్చి పొలానికి కాపలాకు పెట్టాను. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజులు ఈ పనికి ఎంచుకున్నాను. ఉదయం ఫార్మ్ దగ్గరకు వెళతాను. సాయంత్రం వరకు అక్కడే ఉంటాను. మొక్కల ఏపుగా పెరగడానికి మట్టి ద్రావకంతో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నాను. పెన్నానది పక్కన ఉండటంతో అక్కణ్ణుంచి మోటార్ ద్వారా నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసుకున్నాను.

తక్కువ పెట్టుబడితో..

ఇప్పుడు పాలకూర, చుక్కకూర, తోటకూర, గోంగూర, బెండ, చిక్కుడు, స్వీట్‌కార్న్, వంగ, దోస, సొరకాయ వంటివి సాగుచేస్తున్నాను. ఆకు కూరలు 15 రోజులకొకసారి కోతకు వస్తాయి. వీటన్నింటిని వాతావరణం బట్టి నా పనిలో మార్పులు చేసుకుంటాను. తెలిసినవాళ్లే వాటిని స్వయంగా వచ్చి తీసుకెళుతుంటారు. భూమిని చదును చేయించడానికి రూ.5 వేల వరకు పెట్టుబడి పెట్టాను. అన్ని ఖర్చులు పోను రూ. 15 వేల వరకు ఆదాయం వచ్చింది. అయితే, ఈ మొత్తాన్ని కూడా భూమిలో సేంద్రీయ పద్ధతులను అమలు చేయడానికి ఖర్చు పెడుతున్నాను.

మా ఫ్రెండ్స్ కూడా అప్పుడప్పుడు వచ్చి సరదాగా వర్క్ చేస్తుంటారు. సొంతంగా వ్యవసాయం చేస్తున్నానని ఎవరికైనా చెబితే 'చదువుకుంటున్నావు కదా, ఆడపిల్లవు కదా! ఎందుకంత కష్టం, ఇంకేం పని దొరకలేదా' అని నవ్వుతున్నారు. అందుకే ఎవరికీ చెప్పడం లేదు. ఇంకొంత భూమి తీసుకుని సాగు చేయాలనేది తర్వాతి ప్లాన్. 'మా భూమిలో కూడా ఇలా మట్టిని కాపాడుతూ సేద్యం చేయండి..' అని అడిగేవాళ్లున్నారు. ఏషియన్, మిల్లెట్ ఫార్మింగ్‌ను పెద్ద ఎత్తున చేయాలనే ఆలోచన ఉంది'' అని వివరించింది అఖిల.

– నిర్మలారెడ్డి



కొందరు పిల్లలు తల్లిదండ్రుల కళ్లు కప్పి మట్టి, బలపాలు, గోడకు ఉండే సున్నపు బెత్తికలు తింటూ ఉంటారు. మరి కొందరు పెద్దవాళ్లు కూడా బియ్యంలో మట్టిగడ్డలు తినడం చూస్తుంటాం. మొక్కై వంగనిది మానై వంగునా? అన్నట్లు చిన్నప్పుడే పిల్లల్లో ఉండే మట్టి తినే అలవాటును మాన్పించకుంటే వారి ఆరోగ్యానికి పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మట్టితినే అలవాటు మాన్పించడం ఎలాగో చూద్దామా?



మీ కన్నయ్య మన్ను తింటున్నాడా?

ఎందుకు తింటారంటే..?

చాక్లెట్లు, బిస్కట్లు, లాలీపాప్‌లు, ఇలా రకరకాల తినుబండారాలు ఉండగా వాటన్నింటికీ బదులు లేదా వాటితోపాటు అప్పుడప్పుడు ఇలా మట్టి ఎందుకు తింటారో తెలుసా? ... విటమిన్ల లోపమే అందుకు కారణం. శరీరంలో ఉండవలసిన దానికన్నా బాగా తక్కువ పరిమాణంలో ఈ విటమిన్లు ఉండటం లేదా అసలే లేకపోవడం వల్ల పిల్లలు మట్టితింటూ ఉంటారు.

కాల్షియం, ఐరన్ తగినంత లేకపోవడం వల్ల పిల్లలు ఇలా మట్టి తినడానికి అలవాటు పడతారని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి.

మట్టి తినే అలవాటు పిల్లల ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. కడుపు, జీర్ణక్రియకు సంబంధించిన అనేక సమస్యలు మొదలవుతాయి. వాటిని సకాలంలో ఆపకపోతే, పెరుగుదలలోనూ అనేక సమస్యలను ఎదుర్కొంటారు.

పిల్లల శరీరంలో కాల్షియం లోపం ఏర్పడినప్పుడు, వారు మట్టి రుచిని ఇష్టపడతారు. పిల్లలు మట్టి వైపు వెళ్లకుండా నివారించడానికి, తగినంత కాల్షియం ఉన్న పదార్థాలు తినేలా చూడాలి.

పిల్లలకు మట్టి, బలపాలు తినే అలవాటు మానుకోవాలంటే లవంగం నీళ్లు ఇస్తే మేలు జరుగుతుంది. 6-7 లవంగాలను నీటిలో బాగా మరిగించి పిల్లలచేత తాగించండి. అవసరం అనుకుంటే దీనికి కొద్దిగా తేనె కలిపినా మంచిదే.

అరటి పండులో ఎక్కువ మొత్తంలో కాల్షియం ఉంటుంది కాబట్టి పిల్లలకు రోజూ అరటిపండు తినిపించాలి. కావాలంటే అరటిపండుకు తేనె కలిపి మెత్తగా చేసి తినిపించవచ్చు.



టీ ర్స్ ఏది బెటర్?

భారతీయ జనాభాలో 64 శాతం మంది రోజూ టీ తాగడానికి ఇష్టపడతారు, అందులో 30 శాతం మంది సాయంత్రం పూట తాగుతున్నారు. అయితే... సాయంత్రం పూట టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వైద్య శాస్త్రం ప్రకారం మంచి నిద్ర, సరైన లివర్ డిటాక్స్, ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కోసం పడుకోవడానికి కొద్దిగంటల ముందు కెఫీన్‌ను నివారించడం ఉత్తమం. టీ చెడ్డది కాదు.. కానీ.., అది పాలతో తాగాలా, ఎక్కువ తాగాలా.. తక్కువ తాగాలా.. ఏ సమయంలో తాగాలి.. అనేది చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

విదేశాలలో చాలా మంది బ్లాక్ టీనే తాగుతారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, థైరోఫ్లేవిన్, థైరోబిసిన్ వంటి పాలీఫెనాల్స్ ఉంటాయి–ఇవన్నీ ఆరోగ్యకరమైనవే. మనదేశంలో మాత్రం పాలు, చక్కెరను జోడించి టీ తయారు చేసుకొని తాగుతారు. అయితే ఇది అంత మంచిది కాదు. అందువల్ల మన టీరు తెన్నులు మార్చుకోవడం మంచిది.

● రాత్రి షిఫ్టులో పనిచేసే వ్యక్తులు ● ఎసిడిటీ లేదా గ్యాస్ట్రిక్ సమస్య లేని వ్యక్తులు ● ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కలిగిన వారు ● నిద్ర సమస్య లేని వారు ● ప్రతిరోజూ సమయానికి భోజనం చేసేవారు ● సగం లేదా కప్పు కంటే తక్కువ టీ తాగే వారు.. వీరంతా ఎప్పుడు తాగినా ఫరవాలేదు.

సాయంత్రం టీకి వీరు దూరంగా ఉండాలి!

- నిద్రలేమికి గురయ్యే వారు
- ఆందోళనతో బాధపడేవారు, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపేవారు
- అధిక వాత సమస్యలు ఉన్న వ్యక్తులు (పొడి చర్మం, పొడి జుట్టు)
- బరువు పెరగాలనుకునే వారు
- ఆకలి సరిగా లేని వారు
- హార్మోన్ల సమస్యలతో బాధపడేవారు
- మలబద్ధకం / ఆమ్లత్వం లేదా గ్యాస్ సమస్య.
- జీవక్రియ, ఆటో ఇమ్యూన్ వ్యాధులతో బాధపడే వారు.
- తక్కువ బరువు కలవారు
- ఆరోగ్యకరమైన చర్మం, జుట్టు కోరుకునే వారు.

ఇక ఏ టీ, ఎప్పుడు తాగాలో మీరే తేల్చుకోండి.

● హెల్దీ డ్రింక్

ఆరోగ్యంగా ఫిట్‌గా ఉండేందుకు వ్యాయామంతోపాటు రోజువారి ఆహారంలో కలర్‌ఫుల్ ఆహార పదార్థాలు ఉండాలని ఆరోగ్యనిపుణులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడమేగాక యవ్వనంగా కనిపిస్తారు. ఇందుకు యాంటీ ఏజింగ్ డ్రింక్ బాగా పనిచేస్తుంది.



యవ్వన పానీయం



బత్తాయి, ఆపిల్, క్యారెట్, బీట్ రూట్, టమోటా, కీరా, సొరకాయ, పార్స్లే ఆకులను సమపాళ్లల్లో తీసుకుని చిటికెడు పసుపు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో తగినన్ని నీళ్లు కలుపుకోవాలి. వడగట్టి తాగాలి. ఈ జ్యూస్‌ను నిత్యం తాగడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు, మెరిసే చర్మం మీ సొంతమవుతుంది. పరగడుపున తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

● మీకు తెలుసా?

పాలు అనగానే సాధారణంగా గేదెపాలు లేదా ఆవుపాలే అందరికీ తెలుసు. అయితే ఇటీవల గాడిదపాలు, మేకపాలు కూడా కొందరు తాగుతున్నారు. ఇవే కాదు, కొబ్బరిపాలు కూడా ఉన్నాయి. పచ్చికొబ్బరిని కోరి లేదా ముక్కలు చేసి తగినన్ని నీళ్లు చేర్చి రుబ్బి, వడపోయడం ద్వారా కొబ్బరిపాలను తయారు చేయవచ్చు. కొబ్బరి పాలను తాగడం ద్వారా చాల ప్రయోజనాలున్నాయి. అవేమిటో తెలుసుకుందాం...

● ఆవు పాలకు సమానమైన పోషకాలను కలిగి ఉంటాయి. ● యాంటీ వైరల్ గుణాలు సమృద్ధిగా ఉండటంతో రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. ● శరీరంలో ఏర్పడే ఒత్తిడి తగ్గించడంతో పాటు కీళ్ల నొప్పులకు మందులా పనిచేస్తాయి. ● ఫాస్పరస్, కాల్షియం వంటి పోషకాలు ఉండడంతో దంతాలు, ఎముకలు బలంగా మారతాయి. మీ పిల్లలు మామూలు పాలు తాగడానికి మొగ్గు చూపనప్పుడు ఒకసారి కొబ్బరిపాలను పట్టించడానికి ప్రయత్నించండి. మంచి ఫలితం ఉంటుంది.



● హెల్త్ టిప్స్




● ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు మూడు వెల్లుల్లి రేకులు తింటే రక్తపోటు, కడుపులో మంట, నులిపురుగుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ● కొన్ని స్పాంజి ముక్కలను నీళ్లలో తడిపి ఫ్రీజర్లో ఉంచండి. చెయ్యి కాలినా లేదా ఏ తలుపు సందులోనో పడి నలిగినా ఒక స్పాంజి ముక్కను తీసి బాధ ఉన్న ప్రదేశంలో కొద్దిసేపు ఉంచితే నొప్పి, వాపు వెంటనే తగ్గుతాయి. ● పళ్ళు వచ్చే ముందు పిల్లలు ప్రతిదాన్నీ కొరుకుతూ చిగుళ్ళు నొప్పి పుట్టి ఏడుస్తూ ఉంటారు. అటువంటప్పుడు సారింజ తొనలలోని విత్తనాలు తీసేసి, ఆ తొనలను కాసేపు ఫ్రిజ్లో ఉంచి వాటిని పిల్లలకు ఇస్తే ఆ చల్లదనం వారి బాధను పోగొట్టి రిలీఫ్ ఇస్తుంది. వారికి అవసరమైన 'సి' విటమిన్ కూడా లభిస్తుంది. ● ద్రాక్ష రసాన్ని కొంచెం తేనెలో కలిపి రోజుకు మూడు సార్లు తీసుకుంటే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు. ● కొబ్బరినూనె, నిమ్మరసం సమపాళ్లలో తీసుకుని బాగా కలిపి కొద్దిగా వేడిచేసి నొప్పిగా ఉన్న ప్రాంతంలో మర్దన చేస్తే కీళ్ళ నొప్పులు తగ్గుతాయి. ● కిడ్నీ వ్యాధుల నివారణకు రెండు వంతుల దోసకాయ రసానికి, ఒక వంతు ద్రాక్ష రసాన్ని కలిపి ఉదయం, సాయంత్రం ఒక కప్పు చొప్పున తాగి చూడండి ● బచ్చలి రసం, అనాసరసం సమపాళ్లలో తీసుకుని దానిలో కొంచెం నిమ్మరసం కలుపుకుని తాగితే శరీరంలో వేడి తగ్గుతుంది.





సినిమా

నాన్‌స్టాప్ ఇండియన్


● కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' చిత్రం ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, గండికోట లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం నెక్స్ట్ షెడ్యూల్ చెన్నైలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ చాలా కీలకమైనదని తెలిసింది. ఎందుకంటే నెల రోజుల పాటు నాన్‌స్టాప్‌గా ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నారు కమల్‌హాసన్. ముందుగా కమల్‌హాసన్, హీరోయిన్ ప్రియాభవానీ శంకర్ కాంబినేషన్స్‌లోని సీన్స్‌ను చిత్రీకరిస్తారట. ఈ షెడ్యూల్‌లోనే ఈ చిత్రకథానాయిక కాజల్ అగర్వాల్ కూడా జాయిన్ అయ్యే చాన్స్ ఉందని టాక్. ఇంకా రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

ఆ పాట అప్పుడు ఫాస్టింగ్‌లోనే ఉన్నా! - పూజా హెగ్డే


● వారణాసిలో పూజా హెగ్డే

''మన కలలను నెరవేర్చుకునే విషయంలో ఆ పరమశివునిలా ఉగ్రంగా, ఇతరులను క్షమించే విషయంలో ఆయనలా దయతో ఉందాం'' అంటున్నారు పూజా హెగ్డే. నేడు మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ – ''శివరాత్రికి ఉపవాసం ఉండటం అనేది కొన్నేళ్లుగా పాటిస్తున్నాను. ప్రతి శివరాత్రికి మా నాన్నగారు ఉపవాసం ఉంటారు. నా చిన్నతనం నుంచి ఆయన్ను చూస్తున్నాను కాబట్టి నాన్నని ఫాలో అవ్వాలనుకున్నాను. అలా ఎప్పటినుంచో ఫాస్టింగ్ అలవాటైంది. పైగా నేను పదేళ్ల పాటు భరతనాట్యం నేర్చుకున్నాను. దాంతో నటరాజుడిని కొలిచేదాన్ని. ఆ విధంగా శివుడితో నా అనుబంధం ఎప్పటినుంచో ఉంది. స్కూల్ డేస్ నుంచే శివరాత్రికి ఉపవాసం ఉంటున్నాను. సినిమాల్లోకి వచ్చాక కూడా తప్పనిసరిగా ఆచరిస్తున్నాను. 'జిగేల్ రాణి..' ('రంగస్థలం' సినిమా) పాట షూట్ అప్పుడు శివరాత్రి వచ్చింది. ఆ షూట్ అప్పుడు ఫాస్టింగ్ ఉన్నాను. నాకు వీలు కుదిరినప్పుడల్లా శివుడి ఆలయాలను సందర్శిస్తుంటాను. కాశీ విశ్వనాథ్ ఆలయానికి వెళ్లాను. ధర్మస్థలి (కర్నాటక), బాబుల్‌నాథ్ మందిర్ (ముంబై)లకు కూడా వెళ్లాను. ఇక నాకు శివుని పాటల్లో 'శివ్ తాండవ్ స్తోత్రం' ఇష్టం'' అన్నారు పూజా హెగ్డే.

● గంగా హారతి తిలకిస్తూ...

వారణాసిలో జరిగే గంగా హారతిని మా నాన్నగారు గతంలో చూశారు. మేం కూడా చూస్తే బాగుంటుందని ఆయన అన్నారు. అలా రెండేళ్ల క్రితం నేను, అమ్మానాన్న, అన్నయ్య వెళ్లాం. హారతి చూస్తుంటే ఒక అద్భుతమైన అనుభూతి లభించింది. అది మాటల్లో చెప్పలేను. గంగా నదీ తీరాన నిలబడి తిలకించడం ఓ గొప్ప అనుభూతి అయితే, పడవలో కూర్చుని తిలకించడం మరో అనిర్వచనీయమైన అనుభూతి.



● శ్రీలేఖ, రాజమౌళి

ఇరవైఅయిదు దేశాల్లో టూర్

సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ సినిమా రంగంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా 25 దేశాల్లో వరల్డ్ మ్యూజికల్ టూర్‌ని మార్చి 17 నుంచి ప్రారంభిస్తున్నారామె. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు రాజమౌళి రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''ప్రపంచంలో 5 భాషల్లో 80 సినిమాలకు సంగీతం అందించిన ఏకైక మహిళా మ్యూజిక్ డైరెక్టర్ శ్రీలేఖ. తను ఎంతో సాధించినందుకు అభినందనలు'' అన్నారు. ఎంఎం శ్రీలేఖ మాట్లాడుతూ– ''రాజమౌళి అన్న చేతుల మీదగా నా వరల్డ్ మ్యూజిక్ టూర్ పోస్టర్ లాంచ్ కావడం ఆనందంగా ఉంది. ఆయన దర్శకత్వం వహించిన మొట్టమొదటి టెలీ సీరియల్ 'శాంతినివాసం'కి నేను సంగీతం అందించాను. రవి మెలోడీస్ బ్యానర్ ద్వారా ఇన్వెస్టర్ గ్రోప్స్ సహకారంతో మిడిల్ ఈస్ట్ (ఖతార్) నుంచి మొదలయ్యే వరల్డ్ మ్యూజిక్ టూర్ 25 దేశాల్లో జరుగుతుంది. ఈ టూర్‌లో 25 మంది సింగర్స్ పాల్గొంటారు'' అన్నారు.

రికార్డు స్థాయి వసూళ్లు ఖాయం - నిర్మాత నాగవంశీ


● వెంకీ, నాగవంశీ

''గత ఏడాది మా బ్యానర్ నుంచి వచ్చిన 'భీమ్లానాయక్', 'డీజే టిల్లు' సినిమాలకు హౌస్‌ఫుల్ అంటూ నాకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఇప్పుడు 'సార్'కు అంత మంచి రెస్పాన్స్ వస్తుండడం హ్యాపీగా ఉంది'' అని అన్నారు సూర్యదేవర నాగవంశీ. ధనుష్ హీరోగా నటించిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలైంది. అదే రోజు సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో నాగవంశీ మాట్లాడుతూ– ''ధనుష్‌గారి 'రఘువరన్ బీటెక్' మొత్తంగా తెలుగులో ఎంత వసూలు చేసిందో ఆ స్థాయి వసూళ్లు 'సార్' తొలి రోజునే వచ్చేలా ఉన్నాయి. ఆయన కెరీర్‌లో ఈ చిత్రం రికార్డు స్థాయి వసూళ్లను రాబట్టేలా ఉంది'' అన్నారు. ''ఇంటర్మీడియట్ చదివినప్పుడు, నేను చూసిన చుట్టుపక్కల ఘటనల ఆధారంగా ఈ చిత్రకథ రాశాను'' అన్నారు వెంకీ అట్లూరి.

డేట్ ఫిక్స్

స్టూడెంట్‌గా బెల్లంకొండ గణేష్ థియేటర్స్‌కి వచ్చే సమయం ఖరారైపోయింది. బెల్లంకొండ గణేష్ హీరోగా రాఖీ ఉప్పలపాటి దర్శకత్వంలో 'నాంది' ఫేమ్ సతీష్ వర్మ నిర్మించిన చిత్రం 'నేను స్టూడెంట్ సార్..!'. ఇందులో అవంతిక దస్సాని హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను మార్చి 10న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నట్లుగా శుక్రవారం ప్రకటించారు మేకర్స్. ''ఇది ఇంటెన్స్ యాక్షన్ మూవీ'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: అనిత్ మధాడి.


● గణేష్, అవంతిక

థగ్స్‌తో మైత్రి


● హ్రిదు

ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా తెరకెక్కించిన ఇంటెన్స్ యాక్షన్ తమిళ చిత్రం 'థగ్స్'. హ్రిదు హరూన్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో సింహా, ఆర్కే సురేష్, మునిష్‌కాంత్, అనస్వర రంజన్ కీ రోల్స్ చేశారు. హెచ్ఆర్ పిక్చర్స్ పతాకంపై జీయో స్టూడియోస్ భాగస్వామ్యంతో రియా షిబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. కాగా 'థగ్స్' తెలుగు వెర్షన్ 'కోనసీమ థగ్స్'ను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పీ పంపిణీ చేయనుంది.

సస్పెన్స్... థ్రిల్


● సునీల్, విశ్వంత్, జయప్రకాశ్

విశ్వంత్ దుడ్డుంపూడి, శ్రీజిత గోష్, శుభ శ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కథ వెనుక కథ'. కృష్ణ చైతన్య దర్శకత్వంలో అవనీంద్ర కుమార్ నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ను డైరెక్టర్ గోపీచంద్ మలినేని రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''టీజర్ ఆసక్తిగా ఉంది. సినిమా పెద్ద హిట్ కావాలి'' అన్నారు. అవనీంద్ర కుమార్ మాట్లాడుతూ– ''ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించి, కొత్త కాన్సెప్ట్ చిత్రాలను అందించాలనే ఆలోచనతో దండమూడి బాక్సాఫీస్ సంస్థని స్థాపించాను. తొలి చిత్రంగా సస్పెన్స్, థ్రిల్ నేపథ్యంలో 'కథ వెనుక కథ' తీశాం. సిటీలో జరుగుతున్న హత్యలకు ఓ వ్యక్తి కారణం కాదు, ఓ గ్యాంగ్ అని పోలీసాఫీసర్ సత్య ఎలా తెలుసుకుంటాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు.

అది నా అదృష్టం - కిరణ్ అబ్బవరం



''గీతా ఆర్ట్స్‌లాంటి మంచి, పెద్ద బ్యానర్‌లో నటించాలని అందరూ అనుకుంటారు. నా కెరీర్ ప్రారంభంలోనే ఆ బ్యానర్‌లో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి మంచి సినిమా చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''నేను చేసిన 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' సినిమా నచ్చడంతో అల్లు అరవింద్, వాసుగార్లు 'వినరో భాగ్యము విష్ణు కథ' చేసే అవకాశం ఇచ్చారు. ప్రేమ, వినోదం, థ్రిల్.. ఇలా కుటుంబ సమేతంగా చూడదగ్గ అన్ని అంశాలతో మురళి తెరకెక్కించారు. నా కెరీర్‌లో 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' మంచి కమర్షియల్ హిట్. ఆ సినిమాని మించిన కమర్షియల్ హిట్‌ని 'వినరో..' సాధిస్తుంది. 'కిరణ్ ఎలాంటి పాత్రలైనా చేయగలడు' అని ప్రేక్షకులతో అనిపించుకోవాలన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం నేను నటిస్తున్న 'మీటర్' షూటింగ్ పూర్తయింది. 'రూల్స్ రంజన్' 80 శాతం చిత్రీకరణ పూర్తయింది'' అన్నారు.


● రితికా సింగ్

కిడ్నాపర్స్ చేతిలో...

'గురు' సినిమా ఫేమ్ రితికా సింగ్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఇన్ కార్'. హర్షవర్ధన్ దర్శకత్వం వహించారు. ఇన్ బాక్స్ పిక్చర్స్‌పై అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మించిన ఈ చిత్రం మార్చి 3న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఆయా భాషల ట్రైలర్స్‌ని శుక్రవారం విడుదల చేశారు. ''సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్'. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. కాలేజీకి వెళ్లే ఓ అమ్మాయిని గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేస్తారు. ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేయాలనుకుంటారు. వారి బారి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఆమెను వారు తీవ్రంగా గాయపరుస్తారు. ఆ తర్వాత ఆమె పోరాటం చేసి, వారి నుంచి ఎలా తప్పించుకుంది? అనేది చిత్రకథ'' అని యూనిట్ పేర్కొంది. సందీప్ గోయత్, మనీష్ ఝుంజోలియా, జ్ఞాన్ ప్రకాష్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: మిథున్ గంగోపాధ్యాయ.

సాక్షి బిజినెస్

శనివారం
18-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
317	92
61,003	17,944

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,712	▽ 144
డోజోన్స్	33,691	▽ 5
ఎఫ్‌టీఎస్ఈ 100	8,004	▽ 8
డాక్స్	15,482	△ 52
షాంఘై	3,224	▽ 25
నికాయ్	25,513	▽ 183

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్)	56,175	▽ 253
బంగారం (22 క్యారెట్)	55,950	▽ 252
వెండి (కిలో)	64,500	▽ 889

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.04	83.71
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.79	89.84
€	యూరో	ఒకటి	97.45	100.73
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	60.58	62.56
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.66	58.07
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.92	62.88
SAR	సౌదీ రియాల్	ఐదు/పది	21.09	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదు/పది	21.65	23.45
¥	చైనా యువాన్	ఐదు/పది	10.92	12.99

గోద్రెజ్ ప్రాపర్టీస్ చేతికి రాజ్ కపూర్ భవంతి

రూ. 100 కోట్లకు కొనుగోలు



న్యూఢిల్లీ: ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత దివంగత రాజ్‌కపూర్‌కి చెందిన భవంతిని గోద్రెజ్ ప్రాపర్టీస్ కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 100 కోట్లు వెచ్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్‌కపూర్ వారసుల నుంచి దీన్ని కొనుగోలు చేసినట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ వివరించింది. ముంబైలోని చెంబూర్‌లో ఉన్న ఈ ప్రాపర్టీని కంపెనీ లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయనుంది. భవంతికి సంబంధించిన స్థల పరిమాణం మొత్తం ఎకరం ఉంటుంది. ఎంతకు కొనుగోలు చేసినదీ వెల్లడించనప్పటికీ.. ఇందులో చేపట్టే ప్రాజెక్టు ద్వారా రూ. 500 కోట్ల ఆదాయం రాగలదని అంచనా వేస్తున్నట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పిరోజ్‌షా గోద్రెజ్ తెలిపారు. చెంబూర్‌లో ఎకరం స్థలం మార్కెట్ విలువ రూ. 100–110 కోట్లు ఉంటుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ చైర్మన్ అనుజ్ పురి చెప్పారు. 2019 మే నెలలో రాజ్‌కపూర్ కుటుంబం నుంచి ఆర్‌కే స్టూడియోస్‌ను కూడా గోద్రెజ్ ప్రాపర్టీస్ కొనుగోలు చేసింది. ఆ అనుబంధాన్ని కొనసాగిస్తూ కొనుగోలు చేసిన భవంతిని కూడా గోద్రెజ్ ప్రాపర్టీస్ దీన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దగలదని ఆశిస్తున్నట్లు రాజ్‌కపూర్ కుమారుడు రణ్‌ధీర్ కపూర్ తెలిపారు.

పీడబ్ల్యూసీలో 30,000 నియామకాలు



న్యూఢిల్లీ: రాబోయే కొన్నేళ్లలో భారత్‌లో సుమారు 30,000 మంది సిబ్బందిని తీసుకునే యోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ చైర్మన్ బాబ్ మోరిట్జ్ తెలిపారు. ప్రస్తుతం తమ దగ్గర దాదాపు 31,000 మంది ఉద్యోగులు ఉన్నట్లు ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మరోవైపు, భారత్‌పై అత్యంత ఆశావహంగా ఉన్నట్లు ష్నైడర్ ఎలక్ట్రిక్ చైర్మన్ జాన్–పాస్కల్ ట్రికోయిర్ తెలిపారు. ప్రస్తుతం అమెరికా, చైనా తర్వాత భారత్ తమకు అతి పెద్ద మార్కెట్‌గా ఉందని వివరించారు. స్వచ్ఛ ఇంధన రంగంలో పురోగమించేందుకు భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా దిగ్గజ సంస్థలకు సారథ్యం వహించే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా మరో టెక్నాలజీ కంపెనీ సారథ్య బాధ్యతలను భారత సంతతికి చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్‌కు సీఈవోగా నీల్ మోహన్ (47) నియమితులయ్యారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చేసిన మోహన్.. 2008లో గూగుల్‌లో చేరారు. దాదాపు ఎనిమిదేళ్ల పాటు డిస్‌ప్లే, వీడియో అడ్వర్టైజింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తించారు. 2015లో యూట్యూబ్ చీఫ్ ప్రాడక్ట్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. యూట్యూబ్ షార్ట్స్, మ్యూజిక్, సబ్‌స్క్రిప్షన్ సర్వీసులను తీర్చిదిద్దారు. గూగుల్‌లో చేరడానికి ముందు డబుల్‌క్లిక్ అనే సంస్థలో ఆరేళ్ల పాటు పని చేశారు. దాన్ని 2008లో గూగుల్ కొనుగోలు చేసింది.

దిగ్గజాలకు సారథ్యం వహిస్తున్న మనోళ్లు..

పేరు	కంపెనీ
సుందర్ పిచాయ్	గూగుల్, ఆల్ఫాబెట్
సత్య నాదెళ్ల	మైక్రోసాఫ్ట్
అరవింద్ కృష్ణ	ఐబీఎం గ్రూప్
శంతను నారాయణ్	అడోబ్
జయశ్రీ ఉల్లాల్	అరిస్టా నెట్‌వర్క్స్
జార్జ్ కురియన్	నెట్‌యాప్
రాజీవ్ సూరి	నోకియా
అజయ్‌పాల్ సింగ్ బంగా	మాస్టర్‌కార్డ్

త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలకు బీమా పాలసీ

● జునో సీఈవో రాకేశ్ కౌల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల కోసం కూడా త్వరలోనే బీమా పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు జునో జనరల్ ఇన్సూరెన్స్ (గతంలో ఎడెల్వీస్ జనరల్ ఇన్సూరెన్స్) సీఈవో రాకేశ్ కౌల్ తెలిపారు. ప్రస్తుతం రోడ్ సైడ్ అసిస్టెన్స్ వంటి అంశాలకు సంబంధించి అధ్యయనం చేస్తున్నట్లు ఆయన వివరించారు. త్వరలో మరికొన్ని హెల్త్ పాలసీలను కూడా ప్రవేశపెడుతున్నట్లు కౌల్ పేర్కొన్నారు. తమ వ్యాపారంలో దాదాపు 35 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉంటోందని ఆయన పేర్కొన్నారు. 30 లక్షల పైగా కస్టమర్లు, 1,000 పైచిలుకు కార్పొరేట్ క్లయింట్లు ఉన్నట్లు కౌల్ తెలిపారు.

వడ్డీ రేట్లు పెరిగినా.. ఇంటి కొనుగోలులో తగ్గేదేలే!

- మే నుంచి 2.5% పెరిగిన రెపో రేటు
- గృహ రుణ రేట్లూ పైపైకి..
- అయినా రూ.30–75 లక్షల శ్రేణిలో ఆగని కొనుగోళ్లు: ఐఎంజీసీ

న్యూఢిల్లీ: ఇళ్ల కొనుగోళ్ల విషయంలో 'వడ్డీరేట్ల' పెరుగుదల పెద్ద అడ్డంకిగా కనిపించడం లేదని రియల్టీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బ్యాంకులు వడ్డీరేట్లు పెంచినప్పటికీ, రూ.30–50 లక్షలు, రూ.50–75 లక్షల విభాగాల్లో ఇళ్ల రుణ డిమాండ్ పెరిగిందని ఇండియా మార్టిగేజ్ గ్యారంటీ కంపెనీ (ఐఎంజీసీ) తన తాజా నివేదికలో పేర్కొంది.

వడ్డీరేటు పెరుగుదల తీరిదీ..

కరోనా కాలంలో 4%గా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు), 2022 మే 4న తొలిసారి 0.40% పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో 0.5% చొప్పున పెరుగుతూ, 5.9%కి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు 0.35% ఎగసి 6.25 శాతాన్ని తాకింది. వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5% రెపో రేటు పెరిగినట్లయ్యింది. ఈ పెంపుతో ఈ రేటు 6.5%కి చేరింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత దీనికి నేపథ్యం. దీనికి అనుగుణంగా బ్యాంకులు కూడా గృహ రుణ రేట్లను పెంచుతూ వచ్చాయి. వినియోగదారులు నెలవారీ చెల్లింపుల (ఈఎంఐ) భారమూ పెరిగింది. ఈ పరిణామాలపై ఐఎంజీసీ తాజా నివేదికను ఆవిష్కరించింది.

నివేదికలో ముఖ్యాంశాలు..

- తక్కువ రుణ అర్హత, అలాగే ఆకర్షణీయమైన లీజింగ్ (అద్దె) ఎంపిక విధానాల ఆవిర్భావం కారణంగా మిలీనియల్స్ (1981–1996 మధ్య జన్మించినవారు) గృహ కొనుగోలు నిర్ణయాలను ఎక్కువగా వాయిదా వేస్తున్నారు.
- రెపో రేట్ పెంపుదల భారం రుణ గ్రహీతలకు బదలాయించడం జరుగుతోంది. దీనివల్ల వినియోగదారుల నెలవారీ చెల్లింపుల (ఈఎంఐ) భారం 10 నుంచి 25 శాతం శ్రేణిలో గణనీయంగా పెరిగింది. వడ్డీరేట్లు వార్షికంగా ప్రస్తుతం 9 నుంచి 9.25 శాతం పెరిగాయి.
- ఉద్యోగ కోతల నేపథ్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో గత త్రైమాసికంలో మొండిబకాయిలు (ఎన్‌పీఏ) కొంత పెరిగాయి. సమస్య మరింత తీవ్రమైతే ఎన్‌పీఏలూ పెరగవచ్చు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్న వారు రుణ కాల వ్యవధిని పెంచుకోడానికి బ్యాంకర్‌తో చర్చించవచ్చు. ఈఎంఐల చెల్లింపునకు తమ పొదుపులనూ వినియోగించుకోవచ్చు. రుణ చెల్లింపుల వైఫల్యం జరక్కుండా సాధ్యమైనంతగా ప్రయత్నించాలి.



ఐఎంజీసీ కీలకపాత్ర...

ప్రైవేటు రంగంలో 2014లో ఐఎంజీసీ కార్యకలాపాలు ప్రారంభించింది. 2008లో జారీ అయిన తనఖా గ్యారెంటీ మార్గదర్శకాల ప్రకారం దీనిని ఆర్‌బీఐ నియంత్రిస్తుంది. ఈ కంపెనీ టాప్ 5 ఒరిజినేటర్స్‌సహా 17 బ్యాంకింగ్ భాగస్వాములతో పని చేస్తుంది. వీటిలో బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు ఉన్నాయి. బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్‌ఐసీ హౌసింగ్ వీటిలో ఉన్నాయి. ప్రత్యేకంగా గృహ రుణాలకు సంబంధించి క్రెడిట్ డిఫాల్ట్ బీమాను ఐఎంజీసీ అందిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఒక కస్టమర్ హోమ్ లోన్‌పై డిఫాల్ట్ అయినట్లయితే, ఐఎంజీసీ బ్యాంకుకు నష్టపరిహారం ఇస్తుంది. తద్వారా బ్యాంక్‌నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

భారం తగ్గింపునకు ప్రయత్నం అవసరం

రుణ రేట్లు పెరిగిన ప్రస్తుత తరుణంలో రుణ గ్రహీతముందు ఇప్పుడు రెండు ఎంపికలు ఉన్నాయి. ఇందులో మొదటిది... క్రెడిట్ ప్రొఫైల్, రీపేమెంట్ చరిత్ర ప్రాతిపదికన సాధ్యమైన తక్కువకు వడ్డీని అమలుచేయించుకునేలా తమ రుణదాతతో చర్చించాలి. మీ బ్యాంకర్ అభ్యర్థనను పట్టించుకోకపోతే, తక్కువ, పోటీపూర్వక వడ్డీరేటును పొందేందుకు ఇతర బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇక రెండవ ఎంపిక విషయానికి వస్తే.. కస్టమర్లు తమ వార్షిక బోనస్‌లు, పొదుపుల నుంచి పాక్షిక ప్రీ–పేమెంట్లు చేయడం వల్ల అధిక రుణ భారం నుంచి ఊరట పొందవచ్చు. గృహ రుణాల ప్రీ–పేమెంట్‌ల కుగాను తక్కువ వడ్డీరేట్లలో వేసిన స్థిర డిపాజిట్లను కూడా ఉపసంహరించుకోవచ్చు. వినియోగదారులు తమ కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకోవడం తగదు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా రాబోయే త్రైమాసికాల్లో మరింత రేట్లు పెరిగే అవకాశం ఉన్న విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. రుణ తిరిగి చెల్లించే సామర్థ్యం పరంగా భద్రతను పెంపొందించుకోడానికి తగిన మార్జిన్లను చేతిలో ఉంచుకోవాలి.



– అమిత్ దివాన్,
ఐఎంజీసీ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్

గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

- తెరపైకి వడ్డీరేట్ల పెంపు భయాలు
- సెన్సెక్స్ నష్టం 317 పాయింట్లు
- 18వేల దిగువకు నిఫ్టీ



ముంబై: గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు విరామం పడింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, ద్రవ్యోల్బణ భయాలు, బాండ్లపై దిగుబడి, డాలర్ ఇండెక్స్ పెరుగుదల అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. సూచీల మూడు రోజుల ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఉదయం సెన్సెక్స్ 326 పాయింట్ల నష్టంతో 60,994 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 60,811 – 61,303 మధ్య కదలాడింది. చివరికి 317 పాయింట్లు పతనమై 61,003 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 61 పాయింట్ల పతనంతో 17,975 వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్‌లో 17,885 – 18,034 శ్రేణిలో ఊగిసలాడింది. ఆఖరికి 92 పాయింట్లు క్షీణించి 17,950వేల స్థాయి దిగువన 17,944 వద్ద నిలిచింది. ఒక్క ఇంధన షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు జరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.75%, స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం చొప్పున నష్టపోయాయి. ఫైనాన్స్, ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. సూచీలు అరశాతం నష్టంతో ఇన్వెస్టర్లకు రూ.1.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 12 పైసలు నష్టపోయి 82.82 స్థాయి వద్ద స్థిరపడింది. ఫెడ్ వడ్డీరేట్ల పెంపు భయాలతో అమెరికా మార్కెట్లు గురువారం మూడువారాల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. ఫలితంగా ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

ఆంధ్రా సిమెంట్స్ వైజాగ్ స్థలం విక్రయం!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆంధ్రా సిమెంట్స్‌కు చెందిన విశాఖపట్నం యూనిట్‌లో కార్యకలాపాలను కొనసాగించరాదని సాగర్ సిమెంట్స్ బోర్డు నిర్ణయించింది. నగర పరిధిలోకి ఈ యూనిట్ రావడమే కంపెనీ నిర్ణయానికి కారణం. విశాఖ యూనిట్ 107 ఎకరాల్లో విస్తరించింది. ఆంధ్రా సిమెంట్స్ వైజాగ్ యూనిట్ స్థలాన్ని విక్రయించే ప్రయత్నాలను చేస్తామని సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి ఇన్వెస్టర్లతో జరిగిన కాన్ఫరెన్స్ కాల్‌లో వెల్లడించారు. రుణ భారంతో ఉన్న ఆంధ్రా సిమెంట్స్ తాజాగా సాగర్ సిమెంట్స్ పరం అయిన సంగతి తెలిసిందే. డీల్ విలువ రూ.922 కోట్లు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ అమరావతి బెంచ్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. జేపీ గ్రూప్‌నకు చెందిన ఆంధ్రా సిమెంట్స్‌కు గుంటూరు జిల్లా దాచేపల్లిలో క్లింకర్, సిమెంట్ ప్లాంటు, విశాఖపట్నం వద్ద గ్రైండింగ్ యూనిట్ ఉంది.

సాక్షి స్పోర్ట్స్



తొలిసారి సెమీస్‌లో భారత్

ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు తొలిసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. దుబాయ్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3–2తో హాంకాంగ్‌పై నెగ్గింది. 0–2తో వెనుకబడిన భారత్ ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందడం విశేషం. నిర్ణాయక ఐదో మ్యాచ్‌గా జరిగిన మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–13, 21–12తో ఎన్జీ సాజ్ యైయు–ఎన్జీ వింగ్ యుంగ్ జోడీపై నెగ్గి భారత్‌కు సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇషాన్–తనీషా 24–26, 17–21తో లీ చున్ రెగినాడ్–ఎన్జీ సాజ్ యైయు చేతిలో... లక్ష్య సేన్ 22–20, 19–21, 18–21తో ఎన్జీ కా లాంగ్ అంగుస్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల–చిరాగ్ శెట్టి జోడీ 20–22, 21–16, 21–11తో తాంగ్ చున్ మన్–యెంగ్ షింగ్ చోయ్ ద్వయంపై నెగ్గగా... నాలుగో మ్యాచ్‌లో పీవీ సింధు 16–21, 21–7, 21–9తో సలోని మెహతాను ఓడించడంతో భారత్ 2–2తో స్కోరును సమం చేసింది.

మార్చి 31 నుంచి ఐపీఎల్



న్యూఢిల్లీ: వచ్చే మూడు నెలలు భారత్‌లో 'లీగ్'ల సందడే సందడి! క్రికెట్ ప్రేక్షకులకు ప్రత్యేకించి టి20 ప్రియులకు కచ్చితంగా పండగే పండగ! వచ్చే నెల 4 నుంచి 26 వరకు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. నాలుగు రోజుల వ్యవధిలోనే ఐపీఎల్ మొదలవుతుంది. మార్చి 31 నుంచి మే 28 వరకు పురుషుల మెగా ఈవెంట్ జరుగుతుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం విడుదల చేసింది. నాలుగుసార్లు చాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగే తొలి పోరుతో ఐపీఎల్–16 ప్రారంభం అవుతుంది. 12 వేదికల్లో పది ఫ్రాంచైజీల మధ్య 52 రోజుల పాటు ఈ టోర్నీ జరుగుతుంది. లీగ్ దశలో 70 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మే 21న బెంగళూరు, గుజరాత్‌ల మధ్య జరిగే పోరుతో లీగ్ దశ ముగుస్తుంది. ఇందులో 18 రోజులు (శని, ఆదివారాల్లో) రెండేసి మ్యాచ్‌లుంటాయి. ఒకే మ్యాచ్ ఉంటే రాత్రి 7.30 గంటలకు, రెండు మ్యాచ్‌లుంటే మధ్యాహ్నం 3.30 గంటలకు మ్యాచ్‌లు మొదలవుతాయి. ప్లే ఆఫ్, ఫైనల్ వేదికల వివరాలను త్వరలో ప్రకటిస్తారు. తుదిపోరు మే 28న జరుగునున్నప్పటికీ వేదిక ఇంకా ఖరారు చేయలేదు.

సౌరాష్ట్రకు ఆధిక్యం

కోల్‌కతా: బెంగాల్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 81/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 317 పరుగులు సాధించింది. హార్విక్ దేశాయ్ (50; 8 ఫోర్లు, 1 సిక్స్), షెల్డన్ జాక్సన్ (59; 10 ఫోర్లు), అర్పిత్ వసవాడ (81 బ్యాటింగ్; 11 ఫోర్లు), చిరాగ్ జానీ (57 బ్యాటింగ్; 10 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. 109 పరుగులకు 4 వికెట్లు కోల్పోయిన దశలో సౌరాష్ట్ర జట్టును షెల్డన్ జాక్సన్, అర్పిత్ ఐదో వికెట్‌కు 95 పరుగులు జోడించి ఆదుకున్నారు. జాక్సన్ అవుటయ్యాక అర్పిత్, చిరాగ్ జానీ ఆరో వికెట్‌కు అజేయంగా 113 పరుగులు జత చేశారు. బెంగాల్ బౌలర్లలో ముకేశ్, ఇషాన్ పోరెల్ రెండు వికెట్ల చొప్పున తీశారు.

ఆస్ట్రేలియా కాస్త మెరుగ్గా...

- తొలి ఇన్నింగ్స్‌లో 263 ఆలౌట్
- ఖాజా, హ్యాండ్స్‌కాంబ్ అర్ధ సెంచరీలు
- భారత్ 21/0
- బోర్డర్–గావస్కర్ ట్రోఫీ రెండో టెస్టు

న్యూఢిల్లీ: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ రెండో టెస్టులోనూ మొదటి రోజు భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 78.4 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (125 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హ్యాండ్స్‌కాంబ్ (142 బంతుల్లో 72 నాటౌట్; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. మొహమ్మద్ షమీ (4/60) ప్రత్యర్థిని పడగొట్టగా, అశ్విన్, జడేజా చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం ఎలాంటి ఇబ్బంది లేకుండా 9 ఓవర్లు ఎదుర్కొన్న భారత్ ఆట ముగిసే సమయానికి 21 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (13 బ్యాటింగ్), రాహుల్ (4 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు కెరీర్‌లో 100వ టెస్టు ఆడుతున్న భారత సీనియర్ క్రికెటర్ పుజారాను దిగ్గజం సునీల్ గావస్కర్ సన్మానించారు.

స్మిత్ డకౌట్...

గత మ్యాచ్‌తో పోలిస్తే ఈసారి ఆస్ట్రేలియా ఓపెనర్లు తొలి గంట పాటు కాస్త ప్రతిఘటన కనబర్చగలిగారు. ఖాజా ఆత్మవిశ్వాసంతో ఆడగా, వార్నర్ (15; 3 ఫోర్లు)లో తడబాటు కొనసాగింది. 21వ బంతికి గానీ అతను తొలి పరుగు తీయలేకపోయాడు. ఈ క్రమంలో సిరాజ్ బౌలింగ్‌లో మోచేతికి, హెల్మెట్‌కు బంతి బలంగా తగలడంతో వార్నర్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. షమీ ఓవర్లో రెండు వరుస ఫోర్లు కొట్టిన వార్నర్ అతని తర్వాతి ఓవర్లోనే వెనుదిరిగాడు. మరోవైపు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్వీప్ షాట్లతో పరుగులు రాబట్టిన ఖాజా 71 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆసీస్‌కు అసలు దెబ్బ అశ్విన్ ఓవర్లో తగిలింది. 91/1తో మెరుగ్గా ఉన్న స్థితిలో లబుషేన్ (18)ను అశ్విన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా... మరో రెండు బంతులకే భరత్ చక్కటి క్యాచ్‌తో స్మిత్ (0) డకౌట్ కావడం ఒక్కసారిగా కంగారూలు వెనక్కి తగ్గేలా చేసింది. రెన్‌షా స్థానంలో ఈ మ్యాచ్‌లోకి వచ్చిన ట్రవిస్ హెడ్ (12; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువసేపు నిలవలేదు.

కీలక భాగస్వామ్యాలు...

ఆసీస్‌ను గట్టెక్కించే బాధ్యత ఖాజా, హ్యాండ్స్‌కాంబ్‌లపై పడింది. వీరిద్దరు క్రీజ్‌లో ఉన్నంతసేపు చకచకా పరుగులు జోడించారు. ముఖ్యంగా జడేజాను లక్ష్యంగా చేసుకొని వీరు పరుగులు రాబట్టారు. అయితే స్వీప్ షాట్లతోనే 29 పరుగులు సాధించిన ఖాజా చివరకు అదే షాట్‌కు వికెట్‌ను సమర్పించుకున్నాడు. క్యారీ (0) వెంటనే అవుట్ కాగా... ఈసారి ప్యాట్ కమిన్స్ (33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించాడు. మరోవైపు 110 బంతుల్లో హ్యాండ్స్‌కాంబ్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఆసీస్ జోరు పెంచుతున్న దశలో రవీంద్ర జడేజా ఒకే ఓవర్లో కమిన్స్, మర్ఫీ (0) వికెట్లతో దెబ్బ కొట్టాడు. చివరి రెండు వికెట్లు షమీ ఖాతాలోకి వెళ్లాయి.



షమీ / వార్నర్



13 భారత్ తరఫున 100 టెస్టులు ఆడిన 13వ క్రికెటర్‌గా పుజారా గుర్తింపు పొందాడు. గతంలో సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్, అనిల్ కుంబ్లే, కపిల్‌దేవ్, సునీల్ గావస్కర్, వెంగ్ సర్కార్, గంగూలీ, కోహ్లి, ఇషాంత్ శర్మ, హర్భజన్, సెహ్వాగ్ ఈ ఘనత సాధించారు.

1 అంతర్జాతీయ టి20 ఫార్మాట్ మొదలయ్యాక ఒక్క అంతర్జాతీయ టి20 కూడా ఆడకుండానే 100 టెస్టులు పూర్తి చేసుకున్న తొలి క్రికెటర్ పుజారా.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (సి) భరత్ (బి) షమీ 15; ఖాజా (సి) రాహుల్ (బి) జడేజా 81; లబుషేన్ (ఎల్బీ) (బి) అశ్విన్ 18; స్మిత్ (సి) భరత్ (బి) అశ్విన్ 0; హెడ్ (సి) రాహుల్ (బి) షమీ 12; హ్యాండ్స్‌కాంబ్ (నాటౌట్) 72; క్యారీ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0; కమిన్స్ (ఎల్బీ) (బి) జడేజా 33; మర్ఫీ (బి) జడేజా 0; లయన్ (బి) షమీ 10; కున్‌మన్ (బి) షమీ 6; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (78.4 ఓవర్లలో ఆలౌట్) 263. వికెట్ల పతనం: 1–50, 2–91, 3–91, 4–108, 5–167, 6–168, 7–227, 8–227, 9–246, 10–263. బౌలింగ్: షమీ 14.4–4–60–4, సిరాజ్ 10–2–30–0, అశ్విన్ 21–4–57–3, జడేజా 21–2–68–3, అక్షర్ 12–2–34–0.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (బ్యాటింగ్) 13, రాహుల్ (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 21. బౌలింగ్: కమిన్స్ 3–1–7–0, కున్‌మన్ 4–1–6–0, లయన్ 2–0–4–0.

చీఫ్ సెలక్టర్ చేతన్ శర్మ రాజీనామా



న్యూఢిల్లీ: ఓ టీవీ చానెల్ స్టింగ్ ఆపరేషన్‌లో అడ్డంగా బుక్కైన సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ చేతన్ శర్మ తన పదవికి రాజీనామా చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాలసీకి విరుద్ధంగా వ్యవహరించిన ఆయనపై వేటు ఖాయమనుకుంటే... తాజాగా తనే వైదొలిగారు. 'చేతన్ రాజీనామా లేఖను బోర్డు కార్యదర్శి జైషాకు పంపారు. ఆయన ఆమోదించారు. స్టింగ్ ఆపరేషన్ ఉదంతం నేపథ్యంలో ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఆయన్ని తప్పుకోమని ఎవరూ కోరలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఆయన వైదొలగడంతో శివసుందర్ దాస్‌కు చీఫ్ సెలక్టర్ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. సెలక్షన్ కమిటీ సభ్యులతో కలిసి కోల్‌కతాలో రంజీ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన చేతన్ ఇరానీ కప్ కోసం జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. అయితే రాజీనామా చేసిన వెంటనే ఆయన అక్కడి నుంచి నిష్క్రమించారు. మీడియాకు ముఖంచాటేసి ఢిల్లీకి బయల్దేరారు. 'జీ న్యూస్' చానెల్ జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో మాజీ పేసర్ చేతన్ శర్మ నోరు పారేసుకున్నారు. క్రికెటర్లు 80–85 శాతమే ఫిట్‌నెస్‌తో ఉంటారని, ఇంజెక్షన్ తీసుకొని 100 శాతం ఫిట్‌నెస్‌తో ఆటకు సిద్ధమవుతారని, బుమ్రా కూడా ఇదే చేస్తాడని నోటికొచ్చిందల్లా వాగారు. జట్టులో కోహ్లి, రోహిత్ శర్మల గ్రూప్‌లు ఉన్నాయని, కెప్టెన్సీ నుంచి తప్పుకునే విషయంలో కోహ్లి అబద్ధం చెప్పాడని చేతన్ శర్మ స్టింగ్ ఆపరేషన్‌లో పేర్కొన్నారు. చేతన్ తీవ్ర వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ కీలకపోరు

సాయంత్రం గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కెబెహ (దక్షిణాఫ్రికా): మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత్ కీలకపోరుకు సిద్ధమైంది. గ్రూప్–2లో భాగంగా తమ మూడో లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని టీమిండియా ఈ మ్యాచ్‌లో గెలిస్తే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది. ప్రస్తుతం గ్రూప్–2లో భారత్, ఇంగ్లండ్ తాము ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందాయి. ఇంగ్లండ్‌తో పోరులో నెగ్గాలంటే భారత అమ్మాయిలు సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. పాకిస్తాన్, వెస్టిండీస్‌తో మ్యాచ్‌ల్లో విజయం సాధించే క్రమంలో ఒత్తిడికిలోనైన భారత్ ఈ మ్యాచ్‌లో తడబడితే మాత్రం ప్రతికూల ఫలితం వచ్చే అవకాశముంటుంది.

సెమీస్‌లో బోపన్న జోడీ



రోటర్‌డామ్: ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ– 500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)– మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–2, 6–1తో నాలుగో సీడ్ లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)–హ్యారీ హిలియోవారా (ఫిన్‌లాండ్) జోడీపై సంచలన విజయం సాధించింది. 48 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశారు. సెమీఫైనల్లో కెవిన్ క్రావిట్జ్–టిమ్ ప్యూయెట్జ్ (జర్మనీ)లతో బోపన్న–ఎబ్డెన్ తలపడతారు.

బ్లన్‌డెల్ సెంచరీ



మౌంట్ మాంగనుయ్: టామ్ బ్లన్‌డెల్ (138; 19 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించడంతో ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 82.5 ఓవర్లలో 306 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 37/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్‌ను డెవాన్ కాన్వే (77; 7 ఫోర్లు, 1 సిక్స్), బ్లన్‌డెల్ ఆదుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో అండర్సన్ (3/36), ఓలీ రాబిన్సన్ (4/54) రాణించారు. 19 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 79 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇంగ్లండ్ ఓవరాల్ ఆధిక్యం 98 పరుగులకు చేరుకుంది.

క్లుప్తంగా...

రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తరించాలి

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



సాక్షి, అమరావతి: రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. కెనెడియన్ రెడ్ క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన బహుళ ప్రయోజనకర ప్రత్యేక వాహనాన్ని విజయవాడలోని రాజ్ భవన్ వద్ద శుక్రవారం ఆయన ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ తమ దాతృత్వం సద్వినియోగమవుతుందంటే సానుకూలంగా స్పందించే దాతలు సమాజంలో ఎందరో ఉన్నారన్నారు. అటువంటి దాతలకు, సమాజానికి మధ్య రెడ్‌క్రాస్ అనుసంధానకర్తగా వ్యవహరించాలని సూచించారు. రక్తదానం, వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాలకు ఈ వాహనం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ ఏపీ శాఖ చైర్మన్ డా.శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరిడా పాల్గొన్నారు.

గవర్నర్ శివరాత్రి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ హరిచందన్ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నట్లు రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

పార్టీ రాష్ట్ర కార్యాలయానికి ఆ భూమి కొనడంలేదు

- ప్రకటనలో వెల్లడించిన బీజేపీ

సాక్షి, అమరావతి: తమ పార్టీ రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి భూమి కొనుగోలుకు ఇప్పటికే చేసిన సంప్రదింపులను నిలిపేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యాలయ బిల్డింగ్ కమిటీ కన్వీనర్ కాయితి సైదారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ జిల్లా, రాష్ట్ర కార్యాలయ భవన నిర్మాణాలకు వివాదాస్పద ఆస్తులను కొనుగోలు చేయటం లేదా బహుమతిగా స్వీకరించటానికి అంగీకరించదని పేర్కొన్నారు. మంగళగిరికి సమీపంలో చినకాకాని గ్రామ పరిధిలో హైకోర్టు న్యాయవాది బద్రి వెంకటరెడ్డి పార్టీ రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి దానంగా ఇచ్చిన 62 సెంట్ల భూమికి ఆనుకుని ఉన్న, వారితాలూకు మిగిలిన భూమిలోని దాదాపు ఎకరం భూమిని కూడా కొనుగోలు చేయడానికి ఇప్పటికే సంప్రదింపులు చేసినట్లు తెలిపారు. ఆ ఆస్తికి సంబంధించి వివాదాస్పద అంశాలు తమ దృష్టికి రావడంతో ఆ సంప్రదింపులను నిలిపేయాలని పార్టీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

'కన్నా' వ్యాఖ్యలపై స్పందించను

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



చీరాల: మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తనపై చేసిన వ్యాఖ్యల గురించి స్పందించాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ చాలాకాలం నుంచి తనపై ఆరోపణలు చేస్తున్నారని, ఆయన వ్యాఖ్యలకు అప్పుడు స్పందించలేదు, ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. తన గురించి పార్టీ అధినాయకులకు తెలుసని చెప్పారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై వారాహికి పూజ సమయంలో బీజేపీతో పొత్తులోనే ఉన్నామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు కేంద్రం నిధులు కేటాయిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. బీజేపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ముప్పల వెంకటరమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ సంపద

- ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్

సాక్షి, అమరావతి: పాశ్చాత్య ప్రభావంతో మరుగున పడిన భారతదేశ సంస్కృతి, విద్యా వ్యవస్థ, ఆర్థిక వనరులను వెలికితీసి దేశ అభివృద్ధికి సాధనంగా ఉపయోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ అన్నారు. సునీల్ అంబేకర్ ఇంగ్లిష్‌లో రచించిన 'ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళిక–21వ శతాబ్దం కోసం' పుస్తకం తెలుగు అనువాదాన్ని విజయవాడ పుస్తక మహోత్సవంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ అన్నది జాతీయ సంపదని, దేశంలో ప్రతి ఒక్కరికి ఆ సంస్థపై యాజమాన్య హక్కు ఉందని చెప్పారు. 21వ శతాబ్దంలో దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, సిద్ధాంతాలను వివరించేందుకే ఈ పుస్తకాన్ని రచించామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ ప్రచార ప్రముఖ్ భయ్యా వాసు మాట్లాడుతూ భారతదేశ గత కాలపు విజయాలు, వర్తమాన కాలపు పనితీరు, భవిష్యత్ కోసం ప్రణాళికలను ప్రజలకు వివరించడమే ఈ పుస్తకం లక్ష్యమన్నారు. ఈ పుస్తకం తెలుగు అనువాదకర్త బీరం వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత వల్లీశ్వర్, 'ఎమెస్కో' అధినేత విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెడ్.. క్రేజీ ఫుడ్!

ఒకప్పుడు జ్వరం వచ్చినప్పుడు మాత్రమే రొట్టె తినేవారు. ఇప్పుడైతే భారతీయుల్లో చాలామంది ప్రతిరోజూ రొట్టెల్ని లాగించేస్తున్నారు. అదేమంటే.. ఆరోగ్యం కోసమేనని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా రొట్టెలు క్రేజీ ఫుడ్‌గా మారుతుండగా.. వాటి వినియోగంలో ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ఐదేళ్ల క్రితం దేశంలో బ్రెడ్స్ అమ్మకాల విలువ 640 మిలియన్ డాలర్లు కాగా.. ప్రస్తుతం 1,024 మిలియన్ డాలర్లకు చేరిందంటే రొట్టెలు భారతీయులతో ఎలా లొట్టలు వేయిస్తున్నాయో అవగతం చేసుకోవచ్చు.




- దేశంలో పెరుగుతున్న బ్రెడ్ వినియోగం
- దక్షిణాది రాష్ట్రాలదే పైచేయి
- సంప్రదాయ ఆహారాల స్థానంలో మల్టీగ్రెయిన్ బ్రెడ్లు
- సంపూర్ణ పోషకాలుండటంతో ఆహార ప్రియుల మొగ్గు

సాక్షి, అమరావతి: పాశ్చాత్య వంటకమైన బ్రెడ్ భారతీయుల భోజనంలో ప్రధాన ఆహారంగా మారిపోతోంది. వేగవంతమైన జీవనశైలి, పనిభారం వల్ల వివిధ రకాల బ్రెడ్స్ భారతీయ భోజనశాలను ఆక్రమిస్తున్నాయి. ఎంతగా అంటే మసాలాలతో కూడిన కూరగాయ వంటకాలను భర్తీ చేస్తూ డైనింగ్ టేబుల్‌పై తిష్టవేస్తున్నాయి. జామ్, బటర్, పీనట్ బటర్ వంటి స్ప్రెడ్‌ల ఎంపికతో టోస్ట్, బ్రెడ్ ఆమ్లెట్లు పట్టణ వాసుల ఇళ్లలో నిత్య అల్పాహారాలుగా మారుతున్నాయి. రెడీ టు కుక్ ఆహారం అందుబాటులోకి రావడంతో మహిళలు సూప్, సలాడ్ డిన్నర్‌లను బ్రెడ్‌తో చేయడానికే మక్కువ చూపుతుండటం విశేషం.

దక్షిణాది రాష్ట్రాలే టాప్

జాతీయ పోషకాహార సర్వే ప్రకారం బ్రెడ్ వినియోగిస్తున్న కుటుంబాల్లో ఓ వ్యక్తి సగటున రోజుకు 80 గ్రాముల బ్రెడ్ ఆహారంగా తీసుకుంటున్నారు. ఇందులో స్త్రీల (66 గ్రా) కంటే పురుషులే (96 గ్రా) ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇది ఈ ఏడాది చివరి నాటికి ఒక కుటుంబం ఏడాదికి 31.7 కిలోలుగా పెరగనుంది. భారత్‌లో అతిపెద్ద బ్రెడ్ వినియోగదారుల జాబితాలో దక్షిణ భారతదేశం మొదటి స్థానంలో ఉండటం విశేషం. భారతదేశ బ్రెడ్ మార్కెట్ 2017లో 640.73 మిలియన్ డాలర్లు కాగా.. ప్రస్తుతం 1,024.54 మిలియన్ డాలర్లకు చేరుకుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో భారతీయులు నెలకు బ్రెడ్ కోసం రూ.300 నుంచి రూ.800 వరకు ఖర్చు చేస్తున్నారు.

దేశంలో బ్రెడ్ వినియోగం ఇలా..



ప్రొటీన్ బ్రెడ్స్ కూడా వచ్చేశాయ్

దేశంలో ఊబకాయ బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇది 2030 నాటికి దాదాపు 27 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా. ఇందుకు భారతీయుల ఆహారంలో కార్బోహైడ్రేట్లే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు గుర్తించారు. సంప్రదాయ భారతీయ భోజనంలో అన్నం, రోటీ, వేపుడు పదార్థాలు ఉంటాయి. దీనికి తోడు ఆధునిక జీవనశైలిలో తగినంత శారీరక శ్రమ లేకపోవడంతో కొవ్వు పెరిగిపోయి ఊబకాయానికి దారి తీస్తోంది. శరీరానికి కార్బోహైడ్రేట్లు అవసరమే కానీ.. కేవలం కార్బోహైడ్రేట్లను మాత్రమే తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే బ్రెడ్‌లలో ప్రొటీన్, కార్బోహైడ్రేట్, కాల్షియం, ఐరన్ వంటివి లభిస్తున్నాయి. జీర్ణక్రియకు అవసరమైన ఫైబర్‌ని అధికంగా అందిస్తున్నాయి.

మల్టీగ్రెయిన్ బ్రెడ్స్‌దే హవా

మార్కెట్‌లో రకరకాల బ్రెడ్స్ వస్తున్నాయి. తృణధాన్యాల వినియోగం కాలక్రమేణా పెరుగుతోంది. హోల్‌గ్రెయిన్, మల్టీగ్రెయిన్, రై బ్రెడ్, వీట్ బ్రెడ్‌లు అన్ని సూపర్ మార్కెట్‌లలో అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే పట్టణ ప్రజలు రొట్టెల కోసం ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. ఇతర ఆహార పదార్థాల కంటే తృణధాన్యాల ఉత్పత్తుల్లో ఎక్కువ డైటరీ ఫైబర్ కంటెంట్ ఉన్నందున అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నాయి.



రూ.8వేల లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగి...

రెండు దశాబ్దాల తర్వాత శిక్ష

పీసీ చట్టం కింద వేర్వేరుగా మూడేళ్ల చొప్పున జైలు శిక్ష విధించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: భూమి సర్వే కోసం 2002లో రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి 20 ఏళ్ల తర్వాత హైకోర్టు శిక్ష విధించింది. అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 7 కింద మూడేళ్లు జైలు, రూ.10 వేల జరిమానా, సెక్షన్ 13(2) కింద మరో మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. ఈ రెండు శిక్షలను ఏక కాలంలో అనుభవించాలని హైకోర్టు ఆదేశించింది. సదరు ఉద్యోగిని నిర్దోషిగా ప్రకటిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ఇటీవల తీర్పు వెలువరించారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలం బిట్రగుంటకు చెందిన గోరంట్ల వీరయ్య చౌదరి, అతని సోదరుడు బుచ్చయ్య నాయుడు చెరో 16.66 ఎకరాల భూమి కొన్నారు. వీరయ్య చౌదరి తన భూమిలో 5 ఎకరాలను సోదరుడు బుచ్చయ్య నాయుడుకు విక్రయించారు. తమ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని దగదర్తి ఎమ్మార్వోకు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మార్వో ఈ దరఖాస్తును డిప్యూటీ సర్వేయర్ నిమ్మకాయల విజయ్‌కుమార్‌కు పంపారు. ఆయన సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు రూ.15వేల లంచం డిమాండ్ చేశారు. చివరకు వీరయ్య చౌదరి నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటూ 2002, సెప్టెంబర్ 16న ఏసీబీ అధికారులకు చిక్కాడు. దీనిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన నెల్లూరు ఏసీబీ కోర్టు విజయ్‌కుమార్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ 2007లో తీర్పునిచ్చింది. అయితే విజయ్‌కుమార్ లంచం తీసుకున్నాడని పక్కా ఆధారాలు ఉండటంతో ఏసీబీ కోర్టు తీర్పుపై ఏసీబీ అధికారులు హైకోర్టులో 2007లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు... విజయ్‌కుమార్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. విజయ్‌కుమార్‌కు పైన పేర్కొన్న విధంగా శిక్ష విధించారు.

మరింత మందికి ఆక్వా విద్యుత్ సబ్సిడీ

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నెల 1వ తేదీ నుంచి విద్యుత్ సబ్సిడీ వర్తింపజేస్తున్నారు.

సీఎం ఆదేశాల మేరకు..

జోన్ పరిధిలో పదెకరాల్లోపు అసైన్డ్‌తో సహా వివిధరకాల ప్రభుత్వ, దేవదాయ భూముల్లో సాగుచేస్తున్న వారికి విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయడంలో నెలకొన్న సాంకేతిక సమస్యలను ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూర్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబును ఆదేశించారు. దీంతో మత్స్యశాఖాధికారులు జోన్ పరిధిలో అసైన్డ్ ల్యాండ్స్, వివిధరకాల ప్రభుత్వ, దేవదాయ భూముల్లో పదెకరాల్లోపు సాగుచేస్తున్నవారిని గుర్తించి వారికి విద్యుత్‌సబ్సిడీ వర్తించేలా చర్యలు చేపట్టారు. ఈ జాబితాలను తయారుచేసి ఆయా డిస్కమ్‌లకు పంపించేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు నాన్ ఆక్వాజోన్ ప్రాంతాల్లో అర్హతగల ఆక్వాజోన్ ప్రాంతాల గుర్తింపునకు చేపట్టిన సర్వే పూర్తికాగా, వాటికి గ్రామసభతోపాటు జిల్లాస్థాయి కమిటీలు ఆమోదముద్ర వేశాయి. రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదం పొందగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

డిస్కమ్‌లకు జాబితాలు

ఆక్వాజోన్‌లో పదెకరాల్లోపు అర్హత కలిగిన విద్యుత్ కనెక్షన్ల వివరాలను డిస్కమ్‌లకు పంపించాం. వాటికి యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. కొన్ని సాంకేతిక కారణాల వల్ల జోన్ పరిధిలో ఉన్న అసైన్డ్, ఇతర ప్రభుత్వ, దేవదాయ భూముల్లో సాగుచేసే పదెకరాల్లోపు రైతులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు విద్యుత్ సబ్సిడీ వర్తింపజేసేలా చర్యలు చేపట్టాం. ఈ జాబితాలను డిస్కమ్‌లకు పంపిస్తున్నాం. నాన్ ఆక్వాజోన్ ప్రాంతాల్లో అర్హమైన ప్రాంతాలను గుర్తించి జోన్ పరిధిలోకి బదలాయించేందుకు చర్యలు చేపట్టాం. – కన్నబాబు, కమిషనర్, మత్స్యశాఖ

పాతర.. కుంభకోణాలకే!

సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) ప్రతిష్టను కుంభకోణాలతో మసకబార్చిన గత సర్కారు నిర్వాకాలపై ఏనాడూ స్పందించని ఈనాడుకు హఠాత్తుగా ఫైబర్ నెట్ గుర్తొచ్చింది. అంతే.. 'ఫైబర్ నెట్‌కు పాతర' శీర్షికన ఓ కథనాన్ని వండి పారేసి చంకలు గుద్దుకుంది. నిజం చెప్పాలంటే పాతర వేసింది ఫైబర్ నెట్‌కు కాదు.. కుంభకోణాలకే తెర పడింది మరి! ఏపీఎస్‌ఎఫ్‌ఎల్‌లో ప్రక్షాళన చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం విస్తరించి అత్యధిక స్పీడ్‌తో ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. గిరిజనులు అత్యధికంగా నివసించే ఐటీడీఏ పాడేరు, రంపచోడవరం లాంటి ప్రాంతాలకు సైతం కార్యకలాపాలను చేరువ చేసింది.

మరింత స్పీడ్.. అధిక డేటాతో

ఈనాడు పత్రిక ప్రచురించిన కథనాలను ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ తీవ్రంగా ఖండించింది. 2018లో కనెక్షన్ల సంఖ్య 3.12 లక్షలు కాగా 2019 అక్టోబర్ నాటికి 7.3 లక్షలకు పెరిగి ఇప్పటికీ అదే సంఖ్య కొనసాగుతోందని స్పష్టం చేసింది. గతం కంటే అధిక స్పీడ్, అధిక డేటాతో ప్యాకేజీలను ప్రవేశపెట్టి వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు తెలిపింది. గతంలో రూ.235 ప్యాకేజీ ద్వారా 50 జీబీ డేటా, 10 ఎంబీఎస్ స్పీడ్ ఉండగా 2021 సెప్టెంబర్ 21 నుంచి 150 జీబీ డేటా, 20 ఎంబీపీఎస్ స్పీడ్‌కు పెంచినట్లు వివరించింది. డేటా వినియోగం ఆధారంగా రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.508 వరకు నాలుగు రకాల ప్యాకేజీలను ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ప్రవేశపెట్టింది. వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేలా 2022 ఆగస్టు 22 నుంచి ప్రీపెయిడ్ సేవలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

చేపట్టిన కొత్త ప్రాజెక్టులు

ప్రభుత్వ విభాగం పేరు	మొత్తం కేంద్రాలు	కనెక్షన్లు ఇచ్చిన కేంద్రాలు	విలువ రూ.కోట్లల్లో
గ్రామ, వార్డు సచివాలయాలు	15,004	7,268	77.8
ఏపీఎస్‌డబ్ల్యూఏఎన్	735	713	29.56
రైతు భరోసా కేంద్రాలు	10,606	5,359	25.9
హెల్త్,మెడికల్ ఫ్యామిలీ హెల్త్‌కేర్-ఐబీబీ	1,692	0	17.15
ఐటీడీఏ రంచపచోడవరం	151	136	6.52
హెల్త్,మెడికల్ ఫ్యామిలీ హెల్త్‌కేర్-ఐఎల్‌ఎల్	275	87	6.13
ఐటీడీఏ చిత్తూరు	20	6	3.92
పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి	748	725	2.44
ప్రైమరీ హెల్త్ సెంటర్స్	449	335	2.0
ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్	373	340	0.96
రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ	110	110	0.90
సాంఘిక సంక్షేమ పాఠశాలలు	192	154	0.54
తపాలా శాఖ	101	101	0.40

కొత్తగా 15,421 ప్రాంతాలకు..

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల నుంచి 13 ప్రాజెక్టులను దక్కించుకోవడం ద్వారా వ్యాపారపరంగా ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ మరింత విస్తరించింది. 15,421 కొత్త ప్రాంతాలకు సేవలను అందించడమే కాకుండా 15,000 కి.మీ ఫైబర్ కనెక్టివిటీని విస్తరించింది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఫ్యామిలీ హెల్త్‌కేర్ లాంటి 13కుపైగా కీలక ప్రాజెక్టులను దక్కించుకొని వేగవంతమైన నెట్ సేవలను అందిస్తోంది. శ్రీసిటీలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌కు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తోంది. వీటితో ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఆదాయం గణనీయంగా పెరిగింది. 2018–19లో రూ.51.25 కోట్లుగా ఉన్న ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఆదాయం 2021–22 నాటికి రూ.215.63 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి నాటికి రూ.150.50 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.



నాడు.. టెరాసాఫ్ట్ ముసుగులో

టీడీపీ హయాంలో ఏపీ ఫైబర్ గ్రిడ్ ఫేజ్-1 ప్రాజెక్టును నిబంధనలకు విరుద్ధంగా టెరాసాఫ్ట్‌కు కట్టబెట్టడం ద్వారా పెద్ద ఎత్తున నిధులను దారి మళ్లించినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో 18 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏపీఎస్‌ఎఫ్‌ఎల్‌కు రూ.120 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలతో తేలడంతో ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఎండీ కె.సాంబశివరావు, టెరాసాఫ్ట్ సబ్‌కాంట్రాక్టర్ కోటేశ్వరరావులను సీఐడీ అరెస్ట్ చేసింది.

కందిపప్పుతో శివుడి రూపం



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ కందిపప్పు బద్దలతో శివుడి రూపాన్ని తీర్చిదిద్దాడు. 17 అంగుళాల పొడవు, 13 అంగుళాల వెడల్పుతో డ్రాయింగ్ షీట్‌పై 2,023 కంది పప్పు బద్దలతో తయారు చేశాడు. ఆ పప్పు బద్దలపై సూక్ష్మ శివలింగాలను నలుపు రంగుతో మైక్రో బ్రష్‌తో ఏడు గంటలు శ్రమించి తీర్చిదిద్దాడు. – నంద్యాల(అర్బన్)

రుద్రాక్ష లింగం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రెండు లక్షల రుద్రాక్షలతో శివలింగం శుక్రవారం ఏర్పాటు చేశారు. నేపాల్ నుంచి తెచ్చిన రుద్రాక్షలతో శివలింగం సిద్ధం చేశారు. శివరాత్రి సందర్భంగా శనివారం సాయంత్రం భక్తులకు ఈ రుద్రాక్షలను వైఎస్సార్‌సీపీ నాయకుడు గున్నేరి కిషోర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు. – ఏర్పేడు(తిరుపతి జిల్లా):

శివోహం..

సాక్షి, అమరావతి: మహాశివరాత్రి పర్వదినానికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాల అలంకరణతో శుక్రవారం రాత్రే పండుగ వాతావరణం ఏర్పడింది. భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రముఖ ఆలయాలు అయిన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, మహానంది వంటి వాటి వద్ద ప్రత్యేక ఏర్పాట్ల పర్యవేక్షణకు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి నలుగురు అధికారులను ఇప్పటికే నియమించింది. వీటికి తోడు పంచారామాలుగా పిలుచుకునే ద్రాక్షారామం శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానం, సామర్లకోట శ్రీకుమార భీమారామం, అమరావతి శ్రీఅమరేశ్వర స్వామి దేవస్థానం, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి దేవస్థానం, భీమవరం సోమేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ధార్మిక ప్రవచనాలతో పాటు వివిధ ప్రాచీన కళా రూపాల ప్రదర్శనలు భక్తులకు వినోదం పంచనున్నాయి.

శివరాత్రికి 3,800 ప్రత్యేక బస్సులు: ఆర్టీసీ

సాక్షి, అమరావతి: శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ 3,800 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. రాష్ట్రంలో 101 శైవ క్షేత్రాలకు 25 లక్షల మంది భక్తులను చేర్చడమే లక్ష్యంగా ప్రత్యేక బస్సుల షెడ్యూల్‌ను రూపొందించింది. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నిర్వహిస్తుండటం విశేషం. ప్రధానంగా కోటప్పకొండకు 675, శ్రీశైలంకి 650, వైఎస్సార్ జిల్లా పొలతలకు 200, ఏలూరు జిల్లా పట్టిసీమకు 100 బస్సులు చొప్పున నడపనుంది. కోటప్పకొండ ఘాట్ రోడ్డు బస్సు సర్వీసుల కోసం తిరుమల–తిరుపతి ఘాట్ రోడ్డు బస్ సర్వీసుల డ్రైవర్లను నియమించింది. శైవక్షేత్రాలు, బస్‌స్టేషన్ల వద్ద ప్రత్యేక విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. భక్తుల కోసం షామియానాలు, తాగునీరు ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం తెలిపారు.

ముగిసిన ఏరో ఇండియా

- రూ.80 వేలకోట్ల విలువైన 266 ఒప్పందాలు
- పాల్గొన్న 90కి పైగా దేశాలు
- గురు, శుక్రవారాల్లో 5 లక్షలమందికి పైగా ప్రజల సందర్శన

సాక్షి బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని యలహంక వైమానిక స్థావరంలో ఐదురోజులు జరిగిన 14వ ఎడిషన్ ఏరో ఇండియా శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ నెల 13న ప్రారంభమైన ఈ ఎయిర్ షోను తిలకించేందుకు చివరి రెండురోజులు గురు, శుక్రవారాల్లో ప్రజలకు అవకాశం కల్పించారు. ఈ రెండురోజుల్లో ఐదులక్షలమందికి పైగా ప్రజలు ఈ ఎయిర్ షోను వీక్షించారు. విమానాల వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు నగరవాసులు పోటీపడ్డారు. చివరిరోజు శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు ఎయిర్ షో నిర్వహించారు. అతి దగ్గరి నుంచి వాయువేగంతో దూసుకెళుతున్న యుద్ధ విమానాలను చూసి పులకరించిపోయారు. కాంబాట్ హెలీకాప్టర్లు, తేజస్, సుఖోయ్, సూర్యకిరణ్ తదితర స్వదేశీ యుద్ధ విమానాలు, ఉత్పత్తులు ప్రపంచస్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించాయి. అమెరికా, ఫ్రాన్స్, రష్యా తదితర 90కి పైగా దేశాలు ఈ ఎయిర్ షోలో పాల్గొన్నాయి. 700కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. తొలి మూడురోజులు బిజినెస్ కార్యకలాపాలు, ఒప్పందాలు, సెమినార్లు, ఏవియేషన్ ఉత్పత్తుల ప్రదర్శనలకు పరిమితం చేశారు. వివిధ దేశాలు, సంస్థల మధ్య 266 సహభాగస్వామ్య ఒప్పందాలు కుదిరాయి. ఇందులో 201 ఎంవోయూలు, 53 కీలక ప్రకటనలు ఉన్నాయి. ఈ ఒప్పందాల విలువ సుమారు రూ.80 వేల కోట్లు. యుద్ధ విమానాల కొనుగోలు, ఉత్పత్తి నిర్మాణాలకు సంబంధించి పలు కంపెనీల మధ్య ఒప్పందాలు జరిగాయి. కొందరు విదేశీ రక్షణ అధికారులు స్టార్టప్ కంపెనీలతో వేలకోట్ల రూపాయల విలువైన ఒప్పందాలను చేసుకున్నారు. తదుపరి ఏరో ఇండియా 2025 ఫిబ్రవరిలో జరగనుంది.

'మార్గదర్శి' కేసు త్వరగా విచారించండి

- సుప్రీంకోర్టును కోరిన రామోజీరావు తరపు న్యాయవాది



సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి కేసును త్వరగా విచారించాలని రామోజీరావు తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అరవింద కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అనంతరం ఈ కేసును ఏప్రిల్ 11న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

ఒలింపిక్స్ పతకం సాధించాలి

- ఇంటర్నేషనల్ అథ్లెట్ డాక్టర్ నటరాజన్

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు 2028 లేదా 2032 ఒలింపిక్స్ క్రీడల్లో దేశం తరఫున పతకం సాధించేలా ఎదగాలని ఐఎస్‌పీఏ డైరెక్టర్, ఐఏఏఎఫ్ లెవల్-1 కోచ్, ఇంటర్నేషనల్ అథ్లెట్ డాక్టర్ ఆర్.నటరాజన్ (ఐఆర్‌ఎస్) ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడురోజులు నిర్వహించిన జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్-2కె23 శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నటరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు ఒలింపిక్స్ పతకం సాధించి దేశానికి కీర్తి తెచ్చిపెట్టాలని కోరారు. విద్యార్థులు ప్రధానంగా ఐదు విషయాల్లో (ఆరోగ్యం, తిండి, నిద్ర, ఆటలు, చదువు) అజాగ్రత్తగా ఉండరాదని చెప్పారు. సాధారణ విద్యార్థి మాదిరి ఆలోచిస్తే సమూహంలో ఒకరిగా మిగులుతారే తప్ప ప్రత్యేక గుర్తింపు దక్కదన్నారు. నిత్యనూతనంగా ఆలోచించే వారే జీవితంలో విజయాన్ని అందుకోగలరని చెప్పారు. విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ మహోత్సవ్ సినీ ఇండస్ట్రీలో చాలామందిని డైరెక్టర్లుగా, సినీహీరోలుగా, యాంకర్లుగా తయారుచేసిందన్నారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులు సమూహంగా ఆడటం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. ఈ మహోత్సవ్‌లో 82 ఈవెంట్లను నిర్వహించారు. వందకుపైగా కళాశాలల నుంచి పదివేల మందికిపైగా వచ్చిన విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్.రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943